ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital
Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam
23-7-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 172 పేజీలు: 10+4 వెల: 6.50

**ఉభయ సభల్లో విపక్షాల ఆందోళనలు**

**గాజాలో యుద్ధం ఆగాలని 25 దేశాల సంయుక్త ప్రకటన**

5లో

# పంటల వివరాలపై శాటిలైట్ సర్వే

## ల్యాండ్ రీసర్వే తర్వాత వ్యవసాయ రికార్డుల నవీకరణ

**47 లక్షలు పైగా 'అన్నదాత సుఖీభవ' లబ్ధిదారుల ఇ-కెవైసి పూర్తి**

**త్వరలో సాగునీటి సంఘాలతో వర్చువల్ సమావేశాలు**

**జలవనరుల అధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు**



మంగళవారం సచివాలయంలో వ్యవసాయ, జలవనరుల శాఖపై సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** వ్యవసాయరంగంలో ఆధునాత పద్దతులను అవలంబిద్దాం,అన్ని రకాల పంటల్లో అత్యధిక దిగుబడులు సాధిద్దామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.ఉద్యాన పంటలను విస్తరిద్దామన్నారు.రాష్ట్రమంతటా ఏ సర్వే నెంబర్ భూమిలో ఏ పంటలు పండిస్తున్నారనే పంటల వివరాలు శాటిలైట్ సర్వే ద్వారా సేకరించాలని అధికారులను ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం భలభద్రాపురంలో చేపట్టిన శాటిలైట్ సర్వేతో సమగ్ర సమాచారం వెల్లడైందన్నారు. క్షేత్ర స్థాయిలో సేకరించిన సమాచారం, శాటిలైట్ సర్వే సమాచారం సరిపోల్చాలని స్పష్టం చేశారు. ఒక ప్రాంతంలో ఒకే తరహా పంటలు వేసేలా రైతులకు దిశా నిర్దేశం చేయాలని చెప్పారు. రైతు సేవా కేంద్రం నుంచి ఈ మేరకు నిరంతరం సూచనలు, సహకారం వారికి అందించాలన్నారు. రీసర్వే అనంతరం రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన జరిగిన తర్వాత వ్యవసాయ రికార్డులు కూడా నవీకరించాలని అధికారులను ముఖమంత్రి ఆదేశించారు. మంగళ వారం సచివాలయంలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై సిఎం చంద్రబాబు సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. నాలుగు గంటలకు పైగా వ్యవసాయంఅనుబంధ రంగాలపై లోతైన చర్చజరిపి... రైతులకు మేలు చేసేలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే, జలవనరులశాఖ అధికారులతోనూ సమీక్షనిర్వహించి నీటి నిర్వహణపై మార్గదర్శకాలు జారీ చేశారు.

**రైతులకు సహకారానికి ఎఐ చాట్ బోట్**

పంటల ప్రణాళిక, ఉత్పత్తులకు విలువ జోడింపు, రైతులకు సహకారం అందించేందుకు ఏఐ చాట్ బోట్ వినియోగంపై సమీక్షలో చర్చించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రైతులకు అవసరమైన సమాచారాన్ని వారికి అందేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మరోవైపు ఇప్పటి వరకూ 47,41,792 మంది రైతుల వివరాలతో అన్నదాత సుఖీభవ పథకం కింద ఇకెవైసి పూర్తయిందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇ పంట ద్వారా అర్హులను గుర్తించాలని, రాష్ట్రంలోని ప్రతీ రైతుకు ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. వ్యవసాయరంగం అభివృద్ధికి తాను అత్యధిక ప్రాధాన్యత ఇస్తానని... త్వరలో సాగునీటి సంఘాలతో >>2



# సంక్షేమ హాస్టళ్లు ఇలాగేనా?

**సోషల్ వెల్ఫేర్, బిసి, గురుకుల హాస్టళ్లలో ఏమిటీ దుస్థితి?**

**కోట్లలో వ్యయం ఏమవుతోంది?**

**పనులన్నీ కాంట్రాక్టర్ల లబ్ధికోసమేనా?**

**పరిస్థితులపై నివేదిక ఇవ్వాలని సిఎస్‌కు హైకోర్టు ఆదేశం**

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** సాంఘిక సంక్షేమ, బిసి, గురుకుల హాస్టల్స్‌లో వసతుల లేమిపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసిందిజ హాస్టల్స్‌లో పరిస్థితులు చక్కదిద్దలేదంటూ అధికారులపై మండిపడింది.ఈ విషయంలో ఏమీ తెలియనట్లు ఎలా మిన్నకుండి పోతున్నారని ప్రశ్నించింది. ఏటా ప్రభుత్వంచేసే కోట్లాది రూపాయల ఖర్చులు ఎక్కడికి వెళుతున్నాయనే సందేహాన్నివ్యక్తంచేసింది. కాంట్రాక్టర్ల లబ్ధి కోసమే >>2



మంగళవారం రాష్ట్రపతిని కలుసుకున్న రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్

# బీహార్ జెడి (యు) నేతకే ఉపరాష్ట్రపతి!

**రాజ్యసభ ప్రస్తుత డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌కే దక్కే అవకాశం**

**న్యూఢిల్లీ, జూలై 22:** ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. మరో రెండేళ్ల పదవీకాలం ఉన్నప్పటికీ ఆయన కుర్చీని ఖాళీ చేశారు. ఆరోగ్య కారణాలను పేర్కొంటూ రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపించారు. రాజ్యాంగంలోని 67(ఎ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరనే అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతున్నది. అధికార పార్టీ పలువురు పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తున్నది. బిజెపితోపాటు ఎన్డీయే పక్షాలకు చెందిన నేతకూ ఈ పదవి దక్కనుందని సమాచారం. ఈనేపథ్యంలో జనతాదళ్ (యునైటెడ్) ఎంపి, రాజ్యసభ డిప్యూటీ >>2



**భవిష్యత్తులో నటిస్తానో లేదో చెప్పలేను, సిఎంతో సంప్రదించాకే ఏ నిర్ణయమైనా..**

**పారదర్శకంగా ఉండాలన్నదే నా అభిమతం, ప్రజలు బుద్ధి చెప్పినా జగన్‌లో మార్పు రావడంలేదు**

**మీడియాతో డి.సిఎం పవన్ కల్యాణ్**

# నా ప్రాధాన్యత రాజకీయాలే

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** ఏ విషయంలోనైనా నిక్కచ్చిగా తాను ఉంటానని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు. తాను విధానాలకు కట్టుబడి ఉంటానన్నారు. రాజకీయాల్లో పారదర్శకతే తనకు ఇష్టమన్నారు. మంగళవారం ఎపి సచివాలయంలో పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు.రాజకీయాంశాలపైన,తన కొత్త సినిమా హరిహర వీరమల్లు చిత్రం ప్రమోషన్స్‌పై ఆయన మాట్లాడారు,సినిమాలకు సంబంధించి తాను తీసుకునే ప్రతి నిర్ణయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిలో పెడతానన్నారు.ఆయన అభిప్రాయాలను గౌరవించే దిశలో తన నిర్ణయాలుంటాయన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పినప్పటికి మాజీ ముఖ్యమంత్రి జగన్‌లో మార్పు రావడంలేదన్నారు.

ఇక హరిహర వీరమల్లు చిత్రం కోసం కష్ట పడి పని చేసాను.నేను రాజకీయాల్లోకి వెళ్లినందున సినిమాలు ఏదో తూతూ మంత్రగా చేస్తాడని అనుకోవద్దని ఇందులో చాలాకష్టపడ్డాను. కెరీర్ ప్రారంభంలో ఎలా చేశానో ఇప్పుడు కూడా మార్షల్ ఆర్ట్స్ కోసం అంతేకష్టపడ్డా. అయితే కొన్నేళ్లుగా సినిమాలకు దూరంగా ఉండడం వల్ల బాడీ ఫ్లెక్సిబిలిటీ పోయింది. శరీరం సహకరించలేదు. అయినా శ్రమించా. క్లైమాక్స్‌ను నేనేకొరియోగ్రఫీ చేసి డిజైన్ చేశానుఅని పవన్ చెప్పారు. జగన్ పాలనలో ఎన్నో కుటుంబాలు మద్యం కారణంగా బలయ్యారన్నారు. జనసేన పార్టీ కార్యాలయానికి అనేక మంది బాధితులు వచ్చారన్నారు. ఇప్పుడు మద్యం కుంభకోణంలో అనేక మంది అరెస్టు అవుతున్నారని తెలిపారు. ఒకవైపు నిధులుతినేశారు.. జనం ప్రాణాలు తీశారని ధ్వజమెత్తారు.ఇంకా బెదిరింపుల ధోరణితో జగన్, వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని పవన్ కల్యాణ్ ఫైర్ అయ్యారు. ఇటువంటి కాగితపు బెదిరింపులకి ఎవరూ భయపడరని.. ఇలాంటి తాటాకు చప్పుళ్లు చాలా చూశామని హెచ్చరించారు. ఎన్నో పోరాటాలుచేసి ఇక్కడ నిలబడ్డామని.. ఇంతటి ప్రజాతీర్పుతో అధికారంలోకి వచ్చామని ఉద్ఘాటించారు. అవినీతి, అడ్డగోలుగా వ్యవహరించి కూడా ఇంకా ఎందుకు అరుస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వారి అరుపులను పట్టించుకోదని చెప్పుకొచ్చారు. వాళ్లు రప్పా రప్పా అంటే తాము మెడలు కోయించుకోవడానికి సిద్ధంగా లేమని హెచ్చరించారు. వాళ్లు కోస్తామంటే తాము మరోవైపు నుంచి మెడ చూపిస్తామా..? అని ప్రశ్నించారు. రాజధాని అమరావతి భూ సమీకరణపై తన నిర్ణయాన్ని ఇప్పటికే సిఎం చంద్రబాబుకి చెప్పానన్నారు. సిఎం కూడా తన అభిప్రాయంతో ఏకీభవించారని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. అందరిని ఒప్పించి వాళ్లనుకూడా భాగస్వాములుగా చేసి ముందుకు వెలుదామని >>2

# రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు

**జనజీవనం అస్తవ్యస్తం**

**విజయవాడ, జూలై 22,ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం భారీ వర్షాలు కురుస్తున్నాయి. విజయవాడ నగరంలో మంగళవారం జోరు వాన కురిసింది.రోడ్లపై వాన నీరు చేరి వాహనచోదకులకు, పాదచారులకు ఇబ్బంది కలిగింది.నగరంలోని లోతట్టు ప్రాంతదారుల్లో వాన నీరు చేరింది.దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఏలూరు, గుంటూరు, రాజమండ్రి, కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం,భీమవరం నగరాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి.. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడ్డాయి.రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. దీంతో పంట సాగు పనులు ఊపందుకున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో ఆదివారం రాత్రి కురిసిన భారీవర్షంతో ఎట్టకేలకు సార్వా సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. మొగల్తూరు మండలంలో చిరుజల్లులు కురుస్తున్నాయి. పెనుమంట్రలో చిరుజల్లులు పడుతున్నాయి. వాతావరణం చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు. >>2



మంగళవారం ఉండవల్లిలో అధికారులతో సమీక్ష జరుపుతున్న మంత్రి లోకేష్

# మంగళగిరిపై ఐటి కంపెనీల ఆసక్తి!

**రెండోవిడత ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు**

**నియోజకవర్గ వ్యాప్తంగా 10 వేల టిడ్కో ఇళ్ల నిర్మాణం**

**మంగళగిరి, జూలై 22, ప్రభాతవార్త:** ఐటి, ఇతర కంపెనీలు మంగళగిరికి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని, భవిష్యత్‌లో 50వేల మంది పనిచేసేందుకు అవకాశం ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన పలు అభివృద్ధి పనుల పురోగతిపై ఉండవల్లి నివాసంలో అధికారులతో మంత్రి సమీక్షించారు. వివిధ పనుల పురోగతిని అధికారులు పవర్ పాయింట్ ప్రజెంజేషన్ ద్వారా వివరించారు. ఈసందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. మంగళగిరికి ఐటీ, నాన్ ఐటీ కంపెనీలు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని, ఇందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టిసారించాలన్నారు. మంగళగిరిలో వివిధ ప్రభుత్వ భూముల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్నవారికి రెండో విడతలో 2వేల ఇళ్ల పట్టాల పంపిణీకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

మిగిలిన ఇళ్ల పట్టాల విషయంలోనూ పనులను వేగవంతం చేయాలని సూచించారు.నియోజకవర్గ వ్యాప్తంగా 10వేల టిడ్కో ఇళ్ల నిర్మాణం!ప్రజలు నివసించేందుకు అనుకూలంగా వివిధ ప్రాంతాల్లో నియోజకవర్గవ్యాప్తంగా 10వేల టిడ్కో ఇళ్లను నిర్మించాల్సిన అవసరం ఉంది. >>2

**మాజీమంత్రి నారాయణ స్వామిని వీడియోకాల్‌తో**

# విచారణ

**విజయవాడ, జూలై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** ఎక్సైజ్ శాఖ మాజీ మంత్రి నారాయణస్వామిని సిట్ బృంద వీడియో కాల్ ద్వారా విచారించినట్లు సమాచారం. తాను అనారోగ్యం కారణంగా విచారణకు రాలేనని నారాయణస్వామి స్పష్టం చేసిన సందర్భంలో సిట్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబు తున్నారు. ప్రభుత్వం దుకాణాలు తీసుకొస్తే మద్యం వినియోగంతగ్గుతుందని, ప్రజలను మద్యంనుండి దూరం చేయవచ్చని తనకు చెప్పారని అంతకుమించి నూతన మద్యం విధానం గురించి తనతో ఏమీ చర్చించలేదు' అని గత ప్రభుత్వహయాంలోఎక్సైజ్‌శాఖ మంత్రిగా పనిచేసిన కె.నారాయణ స్వామి సిట్ >>2

**తిరుమలలో అన్ని వసతులతో విశ్రాంతి కేంద్రాలు**

**శ్రీవారి సేవ విస్తరణకు నలుగురు కోఆర్డినేటర్లు**

**రూ.4.35కోట్లతో ఒంటిమిట్టరామాలయంలో నూతన అన్నదాన భవనం**

**టిటిడి బోర్డు కీలక నిర్ణయాలు**

**వైకుంఠమ్-3 క్యూకాంప్లెక్స్**

# నిర్మాణంపై నిపుణుల కమిటీ!

**తిరుమల,జూలై 22ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతున్న నేపథ్యంలో వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ నిర్మాణం అవసరాన్ని పరిశీలించేందుకు నిపుణులతో టిటిడి కమిటీ వేయనుంది. ఈ కమిటీ క్షుణ్ణంగా ఇప్పుడున్న పరిస్థితులను అంచనావేసి, ఆలయం వెలుపల క్యూలైన్లను నియంత్రించేందుకు అధ్యయనం చేయనుంది. ఆ తరువాత సమర్పించే నివేదిక ఆధారంగా భవిష్యత్ అవసరాల దృష్ట్యా తిరుమలలో వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేందుకు టిటిడి పాలకమండలి నిర్ణయం తీసుకోనుంది. ఇప్పటికే తిరుమలలో భక్తుల రద్దీ విపరీతంగా పెరుతుండటంతో అందుకు అనుగుణంగా భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల్లో లాంజ్‌ల తరహాలో విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటుచేయనుంది. అనువైన నిర్మాణాలు చేపట్టడంపై కన్సల్టెన్సీలతో కమిటీ ఏర్పాటు కానుంది. లక్షలాదిగా తరలివస్తున్న భక్తులకు ఇతోధికంగా సేవలందిస్తున్న శ్రీవారిసేవ స్వచ్ఛంద సేవను మరింత విస్తరించి పటిష్టంగా అమలు చేసేందుకు నలుగురు >>2



మంగళవారం తిరుమల అన్నమయ్యభవనంలో జరిగిన టిటిడి పాలకమండలి సమావేశం దృశ్యం

# గ్రామాలకు కొత్త పేర్లు!

**మార్పుల పరిశీలనకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు**

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దులు పేర్ల మార్పులు, చేర్పుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ అంశంపై అధ్య యనం చేసేందుకు మంత్రి వర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.దీనిలో సభ్యులుగా ఏడుగురు మంత్రులను నియమించింది. వీరిలో అనగాని సత్య ప్రసాద్, పొంగూరు నారాయణ, వంగలపూడి అనిత, బిసి జనార్ధన్ రెడ్డి, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహార్, సత్యకుమార్ యాదవ్‌లు ఉన్నారు. ఈ కమిటీకి కన్వీనరుగా రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ ఉప మంత్రివర్గ ఉపసంఘంలోని మంత్రులు పరిపాలనా సౌలభ్యం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా,రెవెన్యూ డివిజన్, మండల సరిహద్దుల మధ్య దూరాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో సూచించింది. సరిహద్దులు నిర్ణయించే ముందు స్థానిక ప్రాంతంచారిత్రక,సాంస్కృతికనేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకో వాలి. సామాజిక, ఆర్థిక,అభివృద్ధి కోసం అంతరాలు లేని విధంగా ప్రాంతాలను నిర్దేశించాలని పేర్కొంది. సరిహద్దులు, పేర్లపై ప్రజలు,ప్రజా ప్రతినిధులు నుంచి వచ్చిన సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని దిశా నిర్దేశం చేసింది.

# తోతాపురి మామిడి రైతుకు భారీ ఊరట

**క్వింటా మామిడికి మార్కెట్ ఇంటర్వెన్షన్ ధర రూ. 1490**

**విజయవాడ,జూలై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** తోతాపురి మామిడి రైతులకు ఉపశమనం లభించింది. క్వింటా మామిడికి మార్కెట్ ఇంటర్వెన్షన్ ధరను రూ.1490గా నిర్ణయిస్తూ కేంద్రం నుంచి ప్రకటన వెలువడింది. 50-50 నిష్పత్తిలో కేంద్రం, ఎపి ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ ధరను చెల్లించనున్నాయి. నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కానుంది. 2025-26 సంవత్సరానికి ఎంఐసికింద ధరల లోపం చెల్లింపు (పిడిపి)ను కేంద్రం ఆమోదించించింది. కేంద్రం నిర్ణయంతో ఎపిలో 1.62 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి కొనుగోలుకు అవకాశం లభించినట్లైంది. మామిడి రైతులకు క్వింటాల్‌కు రూ.1,490.73లు చెల్లించనున్నారు. కేంద్రం, ఎపి ప్రభుత్వం సగం,సగం నిష్పత్తిలో ఈ మద్దతు ధర చెల్లించనున్నాయి. కేంద్రం నిర్ణయంతో తోతాపురి రైతుకు భారీ ఊరట లభించే >>2



తోటలో ఆరబోసిన తోతాపురి మామిడి కాయలు

# నకిలీ మద్యం ముఠా పట్టివేత

**36 మంది అరెస్టు, 2200 లీటర్ల అక్రమ స్పిరిట్ స్వాధీనం**

**విజయవాడ, జూలై 22, ప్రభాతవార్త ప్రతినిధి:** నకిలీ మద్యంవ్యాప్తిని అడ్డుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ నిర్వహిస్తున్న ప్రత్యేక దాడుల ఫలితంగా భారీవిజయం నమోదు అయ్యింది. ఆధునీకరించిన నిఘా వ్యవస్థ, డేటా విశ్లేషణ ఆధారంగా చేపట్టిన చర్యల్లో ముప్పై ఆరు మందిని అరెస్టు చేయడంతో పాటు రెండు వేల రెండు వందల ముప్పది రెండు లీటర్లకు పైగా అక్రమ స్పిరిట్, నకిలీ మద్యం బాటిళ్లు, లేబుళ్లు, ప్యాకింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం ప్రధానంగా ప్రజారోగ్యం, నాణ్యమైన మద్యం సరఫరాపై దృష్టి సారించగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలుమార్లు నకిలీ మద్యం నిర్మూలనపై పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ నేపథ్యంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ మీనా ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిఘా చర్యలు చేపట్టారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు డేటా ఆధారంగా స్పిరిట్ వినియోగంలో అనుమానాస్పద మార్పులను గుర్తించి ప్రత్యేక దాడులు నిర్వహించారు. జూన్ నెల 23 >>2



మంగళవారం తిరువనంతపురంలో మాజీ సిఎం అచ్యుతానందన్ భౌతిక కాయంవద్ద నివాళులర్పిస్తున్న కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్, సిఎం పినరై విజయన్

## రైల్వే పరీక్ష పేపర్ లీకేజీ కేసులో 8 మందికి జైలు

### సిబిఐ ప్రత్యేక న్యాయస్థానంలో నేరారోపణలు రుజువు

**గుంతకల్లు రైల్వే, జూలై 22, ప్రభాత వార్త:** రైల్వే పరీక్ష పేపర్ లీకేజీ కేసులో 08 మంది రైల్వే సిబ్బందిపై నేరారోపణలు రుజువు కావడంతో ఐదేళ్ల జైలుశిక్ష, ఒకొక్కరు రూ.5లక్షల రూపాయల జరిమానా విధిస్తూ అహ్మదాబాద్ సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు తెలిసింది.

## మద్యం కేసు నిందితులకు రిమాండ్ పొడిగింపు

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మద్యం కుంభ కోణం కేసులో నిందితులకు విజయవాడ ఎసిబి కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. ఆగస్టు1 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ఈ కేసులో 11 మంది నిందితులకు రిమాండ్ ముగియడంతో సిట్ అధికారులు మంగళవారం కోర్టులో హాజరు పర్చారు.ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు నిందితులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, గోవిందప్ప బాలాజీ, ధనుంజయరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి సహా 11 మందికి రిమాండ్ పొడిగించింది.

## ప్రకాశం బ్యారేజికి కొనసాగుతున్న వరద

**విజయవాడ,జూలై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** భారీ వర్షాల నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీకి స్థానిక వరద నీరుచేరుతోంది. దీంతో జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్ ఇన్‌ఫ్లో 20,478 క్యూసెక్కులు కాగా,25 గేట్లు అడుగు మేర ఎత్తి దిగువకు 18,125 క్యూసెక్కులు,కాల్వలకు 2,623 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఇదే సందర్భంగా బ్యారేజీ బ్రాంచ్ కెనాల్స్‌కు నీటి విడుదల చేసారు.

## ఎసిబి కోర్టులో భావోద్వేగానికి గురైన చెవిరెడ్డి

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** ఎసిబి కోర్టులో తన వాదనలు వినిపించుకునే క్రమంలో తుడా మాజీ చైర్మన్, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. తన తండ్రి, తన సోదరుడు మద్యం కారణంగానే చనిపోయారని న్యాయాధికారికిచెప్పిన చెవిరెడ్డి.. తనను మద్యం వ్యాపారం చేయవద్దని తండ్రి చెప్పినట్టు వెల్లడించారు. తండ్రి, తమ్ముడు చనిపోవడంతోనే తాను లిక్కర్ జోలికి వెళ్లలేదని, చేయని తప్పుకు శిక్షణ అనుభవిస్తున్నందుకు బాధగాఉందని ఎమోషనల్ అయ్యారు.



మంగళవారం న్యూఢిల్లీలో కన్వరియ యాత్రలో పాల్గొన్న ఢిల్లీ సిఎం రేఖాగుప్త

## మంగళగిరిపై ఐటి కంపెనీల ఆసక్తి!

>> ఇందుకు అవసరమైన స్థల సేకరణపై అధికారులు దృష్టి సారించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో అందుబాటులో ఉన్న భూముల వివరాలను ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. తాడేపల్లి రిటైనింగ్ వాల్, మంగళగిరి లక్ష్మీ ృ నరసింహస్వామి దేవాలయం అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, మోడ్రన్ లైబ్రరీ, పార్క్‌లు, స్మశాన వాటికలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులపైనా మంత్రి సమీక్షి ంచారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ృ, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టళ్లు ఇలాగేనా?

>> పనులు జరుగుతున్నాయా? అని నిలదీసింది. మన ఇంట్లో పిల్లలను నేలపై పడుకోబెడతామా? అని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. జిల్లా స్థాయిలో అధికారులు విధిగా హాస్టల్స్ సందర్శించాలని ఆదేశించింది. నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సిపిసిఆర్) గైడ్‌లైన్స్ ప్రకారం అన్ని మౌలిక వసతులను ప్రభుత్వమే కల్పించాలన్న నిబంధనలను గుర్తు చేసింది. తాగునీరు, పౌష్టికాహారం, బెడ్లు, బెడ్ షీట్లు, యోగ్యమైన మరుగుదొడ్లు, బాత్ రూమ్స్ ఉండి తీరాలని తేల్చి చెప్పింది. వసతుల కల్పన అంశంపై నిర్లక్ష్యం వహిస్తే, సాంఘిక, బిసి, గురుకుల సంక్షేమశాఖల ముఖ్యకార్యదర్శులను బాధ్యులను చేస్తామని హెచ్చరించింది. మీరే కనుక (సిఎస్) దృష్టి పెట్టి ఉంటే ఈ విధంగా ఉండవని వ్యాఖ్యానించింది. హాస్టల్స్ పరిస్థితులు మార్చాలన్న సంకల్పంతోనే స్వయంగా కోర్టుకు పిలిచామని చెప్పింది. ఇప్పటికైనా ఆ గైడ్‌లైన్స్ ప్రకారం చర్యలు తీసుకోవాలని సిఎస్‌ను ఆదేశించింది. జిల్లా స్థాయిలో సీనియర్ అధికారులు క్రమం తప్పకుండా హాస్టళ్లను తనిఖీ చేయాలంది. ఇకపై నెలవారీ నివేదికలను అందజేసేలా చర్యలు తీసుకోవాలని సిఎస్‌ను ఆదేశించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. రాష్ట్రంలోని హాస్టళ్లలో నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ మార్గదర్శకాల మేరకు వసతుల కల్పన లేవంటూ కాకినాడకు చెందిన కీతినీడి అఖిల్ శ్రీగురు తేజ వేసిన పిల్‌పై విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. గతంలో న్యాయ సేవాధికార సంస్థ జిల్లా అధికారులతో హాస్టల్స్‌లోని పరిస్థితులపై నివేదిక తెప్పించుకున్న హైకోర్టు వాటిని పరిశీలించి విస్తుపోయింది. సంక్షేమ హాస్టళ్లలో దుస్థితి వర్ణణాతీత మని వ్యాఖ్యానించింది. ఈ పరిస్థితుల్లో మార్పులు చేసేందుకు నిర్దిష్ట ప్రతిపాదనలతో సిఎస్ వ్యక్తిగతంగా విచారణకు రావాలని గతంలో ఆదేశించింది. ఆన్‌లైన్‌లో సిఎస్ విజయానంద్ విచారణకు హాజరయ్యారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారుల నివేదికలను చూస్తే హాస్టల్స్ ఎలా ఉన్నాయో అర్థమవుతుందని సిఎస్‌ను ఉద్దేశించి చెప్పింది. నర్సీపట్నంలోని ఓ సంక్షేమ హాస్టల్‌లో 228 మంది విద్యార్థినులుంటే ఒక్క మరుగుదొడ్డి మాత్రమే ఉందని గుర్తు చేసింది. విజయనగరం జిల్లాలోని అంధుల పాఠశాలలో 33 మంది విద్యార్థులుంటే, వారి సహాయ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయని చెప్పింది. సిఎస్ స్థాయి అధికారి కదిలితేనే పరిస్థితుల్లో మార్పు వస్తుందని చెప్పింది. దీనిపై సిఎస్ విజయానంద్ స్పందిస్తూ, హాస్టల్స్‌లోని పరిస్థితులపై సమీక్ష నిర్వహించామని, కొత్త బిల్డింగ్స్ నిర్మిస్తామని, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొన్నిచోట్ల పనులు ప్రారంభమయ్యాయని, రెండేళ్లలో చేయబోయే పనులపై నివేదిక ఇస్తామని తెలిపారు.

# నా ప్రాధాన్యత రాజకీయాలే

>> చెప్పానని.. అందుకు సిఎం కూడా ఒప్పుకున్నారని తెలిపారు. మనం అమరావతి ఏకైక రాజధాని అని చెప్పి అధికారంలోకి వచ్చామని గుర్తుచేశారు. అందుకనే వివాదాలు చేయకూడదని చెప్పానని అన్నారు. తమ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమని ఉద్ఘాటించారు.

తన తాజా సినిమా ప్రమోషన్లలో ఉన్నానన్నారు. హరిహర వీరమల్లు ప్రమోషన్స్ కోసం పవన్ కళ్యాణ్ రంగంలోకి దిగి ప్రమోషన్స్ చేస్తున్నారు.. పవన్ సినిమా గురించి . ఈ క్రమంలో మీడియా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. మంచి సినిమా కథలు వస్తే నిర్మాతగా వ్యవహరిస్తానని.. ఈ అంశాలన్నీ కూడా సిఎం చంద్రబాబుకు కూడా చెప్పానని గుర్తుచేశారు. సిఎంకు చెప్పిన అనంతరమే సినిమాల గురించి నిర్ణయాలు తీసుకున్నానని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ క్రమంలో మీడియా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

జానీ ఫ్లాప్ గురించి అడగ్గా పవన్ సమాధానమిస్తూ.. నేను చిరంజీవి తమ్ముడు అయి ఉండి, అప్పటికి హిట్స్‌లో ఉన్నా జానీ ఫ్లాప్ అయ్యాక డిస్ట్రిబ్యూటర్స్, ఫైనాన్షియర్స్ నా ఇంటి మీదకు వచ్చేసారు డబ్బులు కోసం. అది సినిమా రిలీజయి అయిదు రోజులు, పది రోజుల తర్వాత కూడా కాదు. ఫస్ట్ షో పడింది బాగోలేదు అనగానే వచ్చేసారు సినిమా ఆడట్లేదు, మా డబ్బులు పోయాయి అని. అప్పుడు హిట్ అయితే నాకేం ఇచ్చారా అనే ప్రశ్న నామైండ్‌లో వచ్చింది. కానీ అక్కడ అది ఆలోచించరు. దానిని నేను కంప్లైంట్ చేయను. అప్పుడు అన్ని ఆర్థిక బంధాలే అని అనిపించింది. అప్పుడు నా రెమ్యునరేషన్ వెనక్కి ఇచ్చేసాను. సినిమా ఫ్లాప్ అయితే బాధపడమని ఇండైరెక్ట్‌గా చెప్పారు. అప్పుడు నేను ఒంటరిగా ఉన్నాను. ఆ సమయంలో 15 లక్షలు అప్పు చేశాను అవన్నీ క్లియర్ చేయడానికి. ఆ అనుభవం నన్ను బలమైన వ్యక్తిగా మార్చింది. జానీ ఫెయిల్యూర్ నాకు పాలిటిక్స్‌లో హెల్ప్ చేసింది. 2019లో ఓడిపోతే ఆ రోజులే గుర్తొచ్చాయి. ఫెయిల్యూర్ అనేది లైఫ్‌లో ఒక పార్ట్ అంతే అని అన్నారు. నా ప్రయారిటీ రాజకీయాలే ప్రస్తుతం. సినిమా నా లైఫ్‌లో భాగం. ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతర్వాత యాక్టింగ్ చేస్తానో లేదో తెలీదు. కానీ నిర్మాతగా నా పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ మీద మాత్రం సినిమాలు చేస్తాను అని తెలిపారు.

# శాటిలైట్ సర్వే

>> వర్చువల్ సమావేశాలు సైతం నిర్వహించి వారితో నేరుగా మాట్లాడతానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మరోవైపు ఖరీఫ్ సీజన్‌లో దక్షిణ కోస్తాలోని కొన్ని జిల్లాలు మినహా రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కృష్ణా, గోదావరి, వంశధార బేసిన్‌లలో ప్రధాన ప్రాజెక్టులు నిండుగా ఉన్నాయని.. సమృద్ధిగా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం కూడా పెరిగిందని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రాష్ట్రంలో 9.90 లక్షల హెక్టార్లలో వివిధ పంటల సాగు జరుగుతోందని చెప్పారు. అయితే, వర్షాధారంగానే పంటలు పండించేలా పంట కాలాన్ని ముందుకు తీసుకురావాలని ముఖ్యమంత్రి సూచించారు.

**ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గాలి**

రాష్ట్రంలో ఎరువులు, పురుగుమందులను అవసరానికి మించి వినియోగిస్తున్నారని... ఈ కారణంగా భూసారం తగ్గిపోతోందని... ఎరువులు, పురుగు మందులు ఏమేరకు వాడాలో రైతులకు వివరించి... వాటిని అధికంగా వినియోగించకుండా నియంత్రించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఎరువుల వినియోగం తగ్గించి ప్రకృతి సేద్యం దిశగా ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 36.71 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించగా, అంతకుముందు ఏడాదితో 12 శాతం మేర తగ్గిందని అధికారులు వెల్లడించారు. అలాగే, 202425లో 1,733 మెట్రిక్ టన్నుల పురుగుమందులు రాష్ట్రంలో వినియోగం జరిగిందని తెలిపారు. అయితే, ఆర్గానిక్‌బయో ఫెర్టిలైజర్ల వినియోగంపై అవగాహన పెంచాలని ముఖ్యమంత్రి చెప్పారు.

**పొగాకు, మామిడి కొనుగోళ్లపై కలెక్టర్లకు ఆదేశాలు**

ఈ సీజన్‌లో వ్యవసాయ అధికారులను ఇతర వ్యవసాయేతర విధులకు వినియోగించొద్దని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. హెచ్డీ బర్లీ, మ్యాంగో రైతులకు చెల్లింపులపైనా సీఎం మాట్లాడారు. మార్క్ ఫెడ్ నుంచి రెండు విడతల్లో బకాయిలు చెల్లించాలని సూచించారు. ఆగస్టు 20 లోగా హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తోతాపురి మామిడి కొనుగోళ్లపై ఆయా జిల్లా కలెక్టర్లతో మాట్లాడిన ముఖ్యమంత్రి ఆగస్టు 15 లోగా మామిడి రైతులకు కూడా డబ్బులు చెల్లించాలని చెప్పారు. విలువ జోడింపులో భాగంగా కవర్ బ్యాగుల్లో పండించిన తోతాపురి మామిడి పళ్ల నాణ్యతను సీఎం పరిశీలించారు. టేబుల్ వెరైటీ పండించడం ద్వారా దేశీయంగా, పల్ప్ లాంటి ఉత్పత్తులతో విదేశాలకు ఉత్పత్తులు పంపేందుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. రైతుల నుంచి కొనుగోళ్లు జరపని కంపెనీలపైనా కఠినంగా వ్యవహరించాలని చెప్పారు.

# యుఎఇ ఆర్థిక మంత్రితో సిఎం చంద్రబాబు భేటీ

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్థిక మంత్రి హెచ్ఇ అబ్దుల్లా బిన్ టౌక్ ఆల్మరీ తో ఏపీ సీఎం చంద్రబాబు కీలక బేటీ అయ్యారు.,తన క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు మంగళవారం రాత్రి జరిగిన బేటీలో లులూ అంతర్జాతీయ వాణిజ్య సంస్థ యూసఫ్ ఆలీ ఎంఎ,ఆ సంస్థ వాణిజ్య విభాగం ఎండీ ఆదీమ్ అహ్మద్‌తోను సీఎం చంద్రబాబు వాణిజ్య,పెట్టుబడుల అంశాలపై చర్చించారు.ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు తన "ఎక్స్" ఖాతాలో వెల్లడించారు.ఏపీ అభివృద్ధి శరవేగంతో జరుగుతున్న అంశంతో పాటు,రాష్ట్రంలో అనేజాతీయ,అంతర్జాతీయ సంస్థలు రూ.లక్షలకోట్లు పెట్టుబడులు ఆసక్తి చూపించడంతో క్షేత్రస్థాయిలో గ్రౌండింగ్ చేసిన విషయాన్ని వివరించారు. విజయవాడలో లులూ మాల్ ఏర్పాటు,అవసరమైన స్థల సేకరణ ఇతర కీలకంశాలుపై సీఎం యుఎఇ ఆర్థికమంత్రి,లులూ సంస్థ కీలక బాధ్యులతో చర్చించారు.ఈ చర్చలో చేసుకున్న ఒప్పందాలు,ఇతరంశాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.ఈ బేటీలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు.

# మద్యం ముఠా పట్టివేత

>> తేదీ నుంచి జూలై 22వ తేదీ వరకు కోరింగిపాలెం, పశ్చిమ గోదావరి, అనకాపల్లి, బాపట్ల, నెల్లూరు జిల్లాల్లో దాడులు జరిగాయి. నకిలీ మద్యం తయారీకి ఉపయోగించే ఖాళీ బాటిళ్లు, సీలింగ్ యంత్రాలు, లేబుళ్లు, మిషన్లు స్వాధీనం చేసుకోవటం జరిగింది. తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్ జిల్లాలో ఉన్న కృష్ణ ఫార్మా కంపెనీ ఈ ముఠాకు మూలంగా గుర్తించబడింది. కరోనా మహమ్మారి సమయంలో తాత్కాలికంగా మంజూరైన అనుమతిని దుర్వినియోగం చేస్తూ, స్పిరిట్‌ను హ్యాండ్ రబ్ పేరుతో డెనేచర్ చేయకుండా నేరుగా నకిలీ మద్యం తయారీదారులకు పంపినట్లు విచారణలో తేలింది. కంపెనీ యజమాని మల్లికార్జున రావు నేరాన్ని ఒప్పుకున్నాడు. అతడు రుత్తల శ్రీనివాస్ అలియాస్ అబ్దుల్ కలాం, చరణ్జీత్ సింగ్ సెథీలకు స్పిరిట్ సరఫరా చేసినట్లు అధికారుల విచారణలో వెల్లడైంది.

ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ ఇచ్చిన సమాచారంతో తెలంగాణ ఎక్సైజ్ అధికారులు స్పందించి, సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ లో జూలై 21 వ తేదీన ఎనిమిది వందల లీటర్ల స్పిరిట్, నకిలీ లేబుళ్లు, ఖాళీ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ముంబయిలోని సరఫరాదారుల నుంచి తెచ్చిన ఖాళీ బాటిళ్లు, బ్రాండ్ లేబుళ్లు కూడా నిందితుల వద్ద లభించాయి. డెనేచర్ చేయని స్పిరిట్‌ను నేరుగా మద్యం తయారీలో వాడటం వల్ల ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పు ఏర్పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. కమిషనర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ, నిఘా వ్యవస్థను ఆధునీకరించి, డేటా ఆధారంగా చర్యలు చేపట్టడం వల్లే ఈ ముఠాను ఛేదించగలిగామని తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ మాట్లాడుతూ, ప్రతి నేరంలో భాగమైన వ్యక్తిని గుర్తించి శిక్షించడానికి శాఖ పూర్తి స్థాయిలో కృషి చేస్తోందని అన్నారు. నిఘా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, భవిష్యత్తులో ఇటువంటి ముఠాలకు రాష్ట్రంలో తావు ఉండదని స్పష్టం చేశారు.

కృష్ణ ఫార్మా కంపెనీ లైసెన్సు రద్దు చేయాలని తెలంగాణ అధికారులను ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ కోరనుంది. అంతరాష్ట్ర సమన్వయంతో మిగిలిన నిందితులను గుర్తించి శిక్షించే ప్రక్రియ కొనసాగుతుంది. నకిలీ మద్యం వ్యాపారాన్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ ఆపరేషన్‌తో ప్రజలకు నాణ్యమైన మద్యం అందే మార్గం సుగమం అయింది. నిబంధనలు పాటించే మద్యం వ్యాపారానికి భరోసా పెరిగింది. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చర్యలను మరింత వేగవంతం చేసింది.

# నిర్మాణంపై నిపుణుల కమిటీ!

>> కోఆర్డినేటర్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీచేయనున్నారు. మంగళవారం తిరుమల అన్నమయ్యభవనంలో 85 ప్రతిపాదనలతో టిటిడి పాలకమండలి సమావేశం జరిగింది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో భక్తులకు సౌకర్యాలు, పలు అభివృద్ధిపనులు చేపట్టడంపై కీలకంగా చర్చించి నిర్ణయాలు వెలువరించింది. మధ్యాహ్నం బోర్డు తీర్మానాలు, ఆమోదం పొందిన అంశాలను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు మీడియాప్రతినిధులకు వెల్లడించారు. కడపజిల్లా ఒంటిమిట్టలోని టిటిడి ఆధ్వర్యంలోని కోదండరామస్వామి ఆలయానికి రోజువారీగా విచ్చేస్తున్న భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందించేందుకు 4.35కోట్ల రూపాయలతో నూతన అన్నదాన భవనం నిర్మించేందుకు ఆమోదించారు. ఆగస్టునెల నుండి ఒంటిమిట్ట ఆలయంలో మూడుపూటలా అన్నప్రసాదం వితరణ చేయాలని నిర్ణయం. కడపలో వేల సంవత్సరాల చరిత్ర ఉన్న శివాలయం అభివృద్ధికి నిధులు మంజూరుచేశారు. త్వరలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ)అమలుచేసి సామాన్యభక్తులకు త్వరితగతిన దర్శనం కల్పిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి 10లక్షల రూపాయలనుండి 20లక్షల రూపాయలకు వ్యయం పెంచారు. తిరుమలలోని శిలాతోరణం, చక్రతీర్థం ప్రాంతాలను మరింత ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్,డిపిఆర్ రూపొందించాలని నిర్ణయించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి ఒక సబ్‌కమిటీ ఏర్పాటుచేసి, ఆకమిటీ ఇచ్చే నివేదికప్రకారం తదుపరి చర్యలుతీసుకోనున్నారు. శ్రీవారి భక్తులు సైబర్‌మోసాలకు గురికాకుండా నియంత్రించేందుకు సైబర్‌సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటుచేయడానికి ఆమోదం తెలిపారు. పరిపాలన సౌలభ్యంకోసం తిరుమలలో అన్ని విభాగాలు ఒకేచోట కేంద్రీకృతమయ్యేలా నూతన పరిపాలన భవనం నిర్మాణానికి ఆమోదించారు. తాళ్ళపాకలో అభివృద్ధి కార్యక్రమాలకు నిపుణులతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే శ్రీవాణి ట్రస్ట్ ద్వారా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన 320 ఆలయాలకు 79.82లక్షల రూపాయల అంచనాతో 320 మైక్‌సెట్లను ఉచితంగా అందించాలని నిర్ణయించారు. ఒక్కోమైక్‌సెట్ ఖర్చు 25వేల రూపాయలుగా తెలిపారు. వేదపరిరక్షణలో భాగంగా 700మంది వేదపారాయణదారులను నియమించుకునేందుకు, అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలమేరకు వేదపారాయణదారులకు దేవాదాయశాఖద్వారా 600మందికి నెలకు 3వేల రూపాయలు లెక్కన నిరుద్యోగభృతి చెల్లించేందుకు 2.16కోట్ల రూపాయలు టిటిడి నిధులు మంజూరుచేసేందుకు ఆమోదం తెలిపారు.

రాష్ట్ర హైకోర్టు తీర్పుననుసరించి టిటిడిలో కాంట్రాక్టు డ్రైవర్లుగా పనిచేస్తున్న 142మందిని క్రమబద్ధీకరించేందుకు టిటిడి బోర్డు ఆమోదిస్తూ ప్రభుత్వ ఆమోదానికి పంపేందుకు నిర్ణయించారు. భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా కాలినడకన తిరుపతి అలిపిరి, శ్రీనివాసమంగాపురం సమీపంలోని శ్రీవారిమెట్టు నడకమార్గాల్లో భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా మౌలిక వసతులు, లైటింగ్, భద్రత, ఆధ్యాత్మిక ఆహ్లాదకర వాతావరణం పెంపొందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. అన్యమత ఉద్యోగులపై నిఘా పెట్టామని, అలాంటి ఉద్యోగులను ఎవరినీ వదలిపెట్టే ప్రసక్తేలేదని ఛైర్మన్ నాయుడు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బోర్డుసభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, శాంతారాం. జాస్తిపూర్ణసాంబశివరావు, సదాశివరావు, ఎంఎస్ రాజు, పనబాక లక్ష్మి,టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి తదితరులు పాల్గొన్నారు.

# విచారణ

>> అధికారులతో చెప్పినట్లు సమాచారం. మద్యం విధానాన్ని అడ్డం పెట్టుకొని దోపిడీ జరిగినట్లు తన దృష్టికి ఎన్నడూ రాలేదని, రాజ్ కెసిరెడ్డి ఎవరో కూడ తనకు తెలియదని వివరించినట్లు తెలిసింది. విజయవాడలోని సిట్ కార్యాలయంలో సోమవారం విచారణకు రావాలంటూ ఆయనకు అధికారులు నోటీసులివ్వగా అనారోగ్య కారణాల రీత్యా విచారణకు నేరుగా హాజరుకాలేనని సమాచారమిచ్చారు. దీంతో తిరుపతిలోని నారాయణస్వామి నివాసానికి సిట్ అధికారులు ఓ ఇనస్పెక్టర్‌ను పంపి, వీడియోకాల్ ద్వారా ఆయన్ను విచారించారు. దాదాపు 20 నిముషాల పాటు ఆయను ్న ప్రశ్నించారు. ఏ ఒక్క ప్రశ్నకూ ఆయన సరైన సమాధానం చెప్పలేదని తెలిసింది.

### వారం - వర్జ్యం

23-07-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయనం
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
చతుర్దశి రా.2.30
ఆరుద్ర సా.5.57
వర్జ్యం : తె.5.22-6.53
దు.ఉ.11.49-12.41
రాహుకాలం - మ.12.00-1.30

### వార్తాఫలం

**మేషం:** సంతానానికి నూతన విద్యా, ఉద్యోగ యత్నాలు లభిస్తాయి. బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

**వృషభం :** సోదరుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. కోపతాపాలకు దూరంగా ఉండండి. ప్రయాణాలు.

**మిథునం:** ప్రయాణాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. కీలక నిర్ణయాలలో సొంతఆలోచనలు శ్రేయస్కరం.

**కర్కాటకం :** అకారణంగా వివాదాలు ఏర్పడినా జీవితభాగస్వామి సలహాతో పరిష్కరించుకొంటారు.

**సింహం:** కాంట్రాక్టులు లాభిస్తాయి. రాజకీయ, కళారంగాల వారికి అనుకోని అవకాశాలు లభిస్తాయి.

**కన్య :** నూతన ప్రయత్నాలు సఫలమవుతాయి. పాతబాకీలు వసూలవుతాయి. వృత్తి, వ్యాపారాలు ప్రోత్సాహకరంగా వుండును.

**తుల :** నూతన మిత్రులు పరిచయమై కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తారు. సంఘంలో గౌరవమర్యాదలు పొందుతారు.

**వృశ్చికం:** చిరకాల కోరిక నెరవేరే సమయం. ఉద్యోగాలలో విశేష ఆదరణ పొందుతారు. వస్తు, వస్త్రా కొనుగోలు.

**ధనుస్సు:** బంధువుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. నూతన విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**మకరం:** తండ్రి నుండి ఆస్తి లాభాలు పొందుతారు. ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు. శుభవార్తలు.

**కుంభం:** ఇంతకాలం పడిన కష్టానికి ఫలితం దక్కుతుంది. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**మీనం:** దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడతారు. కుటుంబసభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# బీహార్ జెడి (యు) నేతకే ఉపరాష్ట్రపతి!

>> ఛైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. బీహార్‌కు చెందిన హరివంశ్‌కు రాజకీయాల్లో అనుభవజ్ఞునిగా పేరున్నది. ఉన్నత విద్యావంతుడిగా పేరుపొందారు. ఆయన తొలిసారి 2014లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆర్థికశాస్త్రంలో పిజి చేసిన ఆయన జర్నలిస్టుగా డిప్లొమా అందుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందు చాలాయేళ్లు జర్నలిస్టుగా పనిచేశారు. ప్రభుత్వ బ్యాంకులో ఉద్యోగం వచ్చినప్పటికీ జర్నలిజంపై మక్కువతో 'ధర్మయుగ్'లో సబ్‌ఎడిటర్‌గా కెరీర్ ప్రారంభించారు. రవివర్, ప్రభాత్ ఖబర్ వంటి ప్రముఖ ప్రింట్ మీడియా సంస్థల్లో పనిచేశారు. ప్రభాత్ ఖబర్‌కు చీఫ్ ఎడిటర్‌గానూ వ్యవహరించారు. మాజీ ప్రధాని చంద్రశేఖర్‌కు సలహాదారుగా పనిచేసిన ఆయన.. ఆ ప్రభుత్వం కూలిపోవడంతో మళ్లీ జర్నలిజంలోకి వచ్చేశారు. నితీశ్‌కుమార్ నేతృత్వంలోని జెడి(యు) నుంచి తొలిసారి ఎంపిగా ఎన్నికయ్యారు. 2020 నుంచి రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు కూడా ఉండనుండటంతో హరివంశ్‌నే ఉపరాష్ట్రపతిగా ఎన్డీయే ప్రభుత్వం నియమించే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే పదవి నుంచి తప్పుకుంటున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహకారాన్ని అందచేసిన రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు, ప్రధాని మోడీకి ,కేంద్రమంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కాగా, మరో రెండేళ్లు పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. 2022లో ఎన్డీయే తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేట్ కావడంతో ఆయన బెంగాల్ గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. విపక్ష అభ్యర్థి మార్గరేట్ అల్వాపై విజయం సాధించి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 710 ఓట్లకుగాను 528 ఓట్లు గెలుచుకుని 1997 తర్వాత అత్యధిక ఓట్లతో ఉపరాష్ట్రపతిగా విజయం సాధించిన వ్యక్తిగా రికార్డు సృష్టించారు. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన మూడో వ్యక్తి ధన్‌ఖడ్. అంతకుముందు 1969లో రాష్ట్రపతి పదవికి పోటీ చేసేందుకు వివి గిరి, 1987లో రాష్ట్రపతిగా ఎన్నిక కావడంతో ఆర్. వెంకటరామన్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. కానీ, అలాంటిదేమీ లేకుండానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం ఢిల్లీ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు

>> ఏలూరు జిల్లాలోనూ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నగరంలోని పలు వీధులు జలమయమయ్యాయి. అమీనాపేట, అశోక్‌నగర్, ఆర్‌ఆర్‌పేట, పవర్‌పేట, పత్తేబాద్ ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచింది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం వరి చేలకు జీవం పోసింది. 20 రోజులుగా వర్షాలు పడకపోవడంతో నాట్లు వేసిన పొలాలు, వెదజల్లిన చేలు, నారుమళ్లు ఎండిపోయాయి. చాలా గ్రామాల్లో రైతులు ఎండిపోతున్న పైరును కాపాడుకునేందుకు నానాపాట్లు పడ్డారు. ఈ పరిస్థితుల్లో ఆది, సోమవారాల్లో కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గత మూడ్రోజుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.

సోమవారం పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పల్నాడు జిల్లా సత్తెనపల్లి, గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో భారీ వర్షం కురిసింది. గుంటూరులో సగటున 110 మిల్లీ మీటర్లు, పల్నాడులో 80 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు అయింది. వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.గుంటూరు జిల్లాలో కొండవీటి వాగు, పాల వాగు, కోటెళ్ల వాగుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో పొలాల్లోకి నీరు చేరడం,రహదారులు, చప్టాలపై నీరు వచ్చి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి విశాఖలో పలుచోట్ల వర్షం పడింది. విశాఖ నగరంలోని గాజువాక, కూర్మన్నపాలెం ప్రాంతంలో ఏకధాటిగా రెండు గంటలపాటు కురిసిన వర్షానికి డ్రెయినేజీల్లోని మురుగునీరు రోడ్లపైకి చేరింది. అనకాపల్లి జిల్లాలోని కె కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో జోరు వాన కురిసింది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 22నఈ నెల 23న అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. 24న అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.

## తోతాపురి మామిడి రైతుకు భారీ ఊరట

>> అవకాశం ఉంది.రైతులకు లాభాలు భారీగా లభించకున్న పెట్టుబడి చేతికి వస్తుందంటున్నారు.ప్రధాని నరేంద్ర మోడీ, వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ చర్య ధరల పతనాల నుండి రైతులను కాపాడటానికి అవకాశం లభించిందన్నారు. ఈ చర్య న్యాయమైన రాబడిని నిర్ధారించడంతో పాటూ గ్రామీణ జీవనోపాధిని బలోపేతం చేస్తుందని కేంద్ర మంత్రి పెమ్మసాని పేర్కొన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సిఎం చంద్రబాబు,డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రంలో భూసేకరణ దశలో 13 ఇఎస్ఐ ఆస్పత్రుల మంజూరు

- లోక్‌సభలో వెల్లడించిన కేంద్రం

**విజయవాడ,జులై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం 13 ఈఎస్ఐ ఆసుపత్రులు మంజూరు చేసినట్లు కేంద్ర కార్మిక శాఖ మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. అందులో ఇప్పటికే ఐదు పనిచేస్తున్నాయని, 4 నిర్మాణ దశలో,మరో నాలుగు భూసేకరణ దశలో ఉన్నాయని చెప్పారు. వీటిలో మొత్తం131 పోస్టులు ఖాళీగా ఉండగా,వాటిలో 93 పోస్టులె కాంట్రాక్ట్ పద్దతిలో భర్తీచేసినట్లు చెప్పారు. ఈ ఐదు ఆస్పత్రుల్లో గత ఐదేళ్ళలో 10.29 లక్షల మంది ఓపీ,43,205 మంది ఐపీ రోగులకు వైద్యసేవలందించినట్లు తెలిపారు.లోక్‌సభలో ఒంగోలు టిడిపి సభ్యులు మాగుంట శ్రీనివాసుల రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆమె ఈ మేరకు సమాధానమిచ్చారు. కాకినాడ,విశాఖపట్నం,రాజమహేంద్రవరం,తిరుపతి,విజయవాడ ఆస్పత్రులు ప్రస్తుతం వైద్యసేవలందిస్తున్నట్లు తెలిపారు. మరో వైపు విజయనగరం ఆస్పత్రి 50% విశాఖపట న్నం ఆస్పత్రి 56%,అచ్యుతాపురం ఆస్పత్రి 25% నిర్మాణ పనులు పూర్తయినట్లు వివరించారు. నెల్లూరు ఆస్పత్రి నిర్మాణ భాధ్యతలు కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు వెల్లడించారు. మిగిలిన గుంటూరు, కర్నూలు,శ్రీకాకుళం ,శ్రీసిటీలకు మంజూరు చేసిన ఆస్పత్రులు భూసేకరణ దశలో ఉన్నట్లు తెలిపారు.

## రైల్వేలో 30వేల ఖాళీల భర్తీకి త్వరలో నోటిఫికేషన్

**గుంతకల్లు రైల్వే, జూలై 22,ప్రభాతవార్త** భారతీయ రైల్వేలో ఖాళీగా ఉన్న 30వేలకుపైగా ఎన్‌టిపిసి కేటగిరి పోస్టులను భర్తీ చేసేందుకు రైల్వే శాఖ శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా ఉన్న రైల్వే జోన్‌లలో నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీ గ్రాడ్యుయేట్ లెవెల్ (ఎన్‌టిపిసి) చీఫ్ కమర్షియల్ టిక్కెట్ సూపర్‌వైజర్ కేటగిరీలో 6,235 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే స్టేషన్ మాస్టర్-5,623పోస్టులు,గూడ్స్ ట్రైన్ మేనేజర్(గూడ్స్ గార్డ్)-3,562పోస్టులు,అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్-7,520పోస్టులు, సీనియర్ క్లార్ z కమ్ టైపిస్ట్ కేటగిరికి సంబంధించి-7,367చొప్పున మొత్తం 30,307 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని ఆర్‌ఆర్‌బిల ద్వారా భర్తీ చేసేందుకు నియామకాల ప్రక్రియను చేపట్టాలని రైల్వే శాఖ ఈ మేరకు నిర్ణయించినట్లు అధికార వర్గాల సమాచారం.

## ఖతర్ నుంచి విడుదలై స్వస్థలాలకు చేరుకున్న తెలుగు పాస్టర్లు

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** ఖతర్ దేశంలో చట్ట నిబంధనలకు విరుద్ధంగా మతప్రచారం చేస్తున్నారనే అభియోగంపై పోలీసులు అదుపులోకి తీసుకున్న 9 మంది ప్రవాస క్రైస్తవ పాస్టర్లకు ఊరట లభించింది. వీరిలో ముగ్గురు ఏపీకి చెందిన వారు కాగా, దేశం విడిచి వెళ్లకుండా వీరిపై ఉన్న నిషేధాన్ని తొలగించడంతో వీరంతా ఖతర్ నుంచి విడుదలై స్వస్థలాలకు చేరుకున్నారు. పశ్చిమ గోదావరి, విజయనగరం, కృష్ణా జిల్లాలకు చెందిన ఈ ముగ్గురూ క్రైస్తవ ప్రముఖ బోధకులు.



## శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఆలయాల నిర్మాణానికి నిధులు పెంపు

- అమలవుతున్న రూ.10లక్షలు స్థానంలో మూడు కేటగిరీల్లో చెల్లింపులు
- పాతబడిన భవనాలు తొలగింపునకుబోర్డు నిర్ణయం

**తిరుమల,జూలై 22ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతోబాటు ఇతర ప్రాంతాల్లోనూ సనాతన హిందూ ధర్మాన్ని మరింత విస్తృతంగా జనబాహుళ్యంలోనికి తీసుకెళ్ళేందుకు ,మతమార్పిడులను అరికట్టేందుకు శ్రీవాణిట్రస్ట్ ద్వారా నిర్మించే ఆలయాలకు నిధులు మూడు కేటగిరీలుగా విడుదల చేయనున్నారు .ఇందుకు దీనిపై సుదీర్ఘంగానే చర్చించిన ప్రస్తుత టిటిడి పాలకమండలి పూర్తిస్థాయిలో నిర్ణయం తీసుకుంది. మారుమూలగ్రామాల్లోనేగాక ఎస్సీ,ఎస్టీ వెనుక బడిన ప్రాంతాలు, గిరిజన తాండాల్లో శ్రీవారి ఆలయాలను నిర్మించాలని టిటిడి ఇప్పటికే ఆమోదించింది. ఈ ఆలయాల నిర్మాణాలు పక్కాగా నిర్వహించేందుకు శ్రీవాణి ట్రస్ట్ నిధులు ఇది వరకు 10లక్షలు రూపాయలు మాత్రమే విడుదలయ్యేది. ఈ నిధులు విడుదల ఇప్పుడు మూడు కేటగిరీల్లో చేపట్టనున్నారు. మంగళవారం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి పాలకమండలి సమావేశం జరిగింది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి నేతృత్వంలో శ్రీవాణిట్రస్ట్ ద్వారా ఆలయాల నిర్మాణంపై సమీక్షించి అనుగుణంగా నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో నిరాదరణకు గురైన ఆలయాల ధూప దీపనైవేద్యాల నిర్వహణకు ప్రణాళికలు, వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మించిన ఆలయాలకు అవసరమైన నిదులు కేటాయింపుపై సమీక్షించారు. శ్రీవాణి ట్రస్ట్‌లో ప్రస్తుతం ఉన్న నిబంధనలను పునఃసమీక్షించి 10లక్షలు రూపాయలకు బదులు మూడు కేటగిరీల్లో 10లక్షలు రూపాయలు, 15లక్షలు, 20లక్షల రూపాయలుగా నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు ఒకే కేటగిరి క్రింద చెల్లించే 10లక్షల రూపాయల్లో మార్పుచేశారు. సనాతనధర్మాన్ని జనంలోకి తీసుకెళ్ళేందుకు ఆలయాల నిర్మాణాలు పునాదుల్లాంటివని, ఆలయాల నిర్మాణాలతో దైవచింతన, ఆధ్యాత్మికత, సేవాభావం సమభావంతో మానవ సంబంధాలు పెరుగుతాయని బోర్డు అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇప్పటికే సమరసత సేవా ఫౌండేషన్, దేవాదాయశాఖ సంయుక్తంగా నిర్మితమవుతున్న ఆలయాల ప్రస్తుత స్థితి, జీర్ణోద్ధారణ పనులు ఏ దశలో ఉన్నాయోనని కూడా చర్చించారు. రాష్ట్రదేవాదాయశాఖ ఆదేశాలతో శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్సీ,ఎస్టీ వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మించే శ్రీవారి ఆలయాలు ,భజన మందిరాలకు నిధులు చెల్లించేందుకు ఈ మూడు కేటగిరీలు దోహదపడుతాయి. ఇప్పటి వరకు నిర్మించిన 320 ఆలయాలకు 79.82 లక్షల రూపాయలతో మైక్‌సెట్లను ఉచితంగా అందించేందుకు నిర్ణయించారు. వివిధ దేశాల్లోనూ ఆలయాలను నిర్మించాలని ఇందుకు సబ్‌కమిటీ ఏర్పాటుచేయాలని ఆమోదించారు. తిరుమలలో పాతబడిన పురాతన విశ్రాంతి భవనాలు, కాటేజీలను ఐఐటి నిపుణుల సూచనలతో తొలగించి ఆ స్థానంలో పునఃనిర్మాణం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. తిరుమల విజన్ 2047 అమలులో భాగంగా వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం దేశం నలుమూలల నుండేగాక విదేశాల నుండి విచ్చేస్తున్న భక్తులకు వసతి,దర్శన సదుపాయాలు మరింత సులభం చేయడానికి వీలుగా అలిపిరి వద్ద బేస్‌క్యాంపు ఏర్పాటుకు టిటిడి బోర్డు నిర్ణయించింది. భక్తులకు వసతి సౌకర్యంతో బాటు దర్శన టిక్కెట్లు, టోకెన్లు జారీచేసే కౌంటర్ల ఏర్పాటు చేయాలని ఆలోచనకు శ్రీకారం చుట్టనున్నారు. ఆధ్యాత్మిక, ఆహ్లాద వాతావరణం నెలకొల్పేలాచూడనున్నారు. ఈ బోర్డు సమావేశంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, బోర్డుసభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సుచిత్ర ఎల్లా, శాంతారాం. జాస్తిపూర్ణసాంబశివరావు, సదాశివరావు, ఎన్.నర్సి రెడ్డి, జ్యోతులనెహ్రూ, ఎంఎస్ రాజు, పనబాక లక్ష్మి, మునికోటేశ్వర రావు, దర్శన్ ,టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ ,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి తదితరులు పాల్గొన్నారు.

## నానో ఎరువుల వినియోగానికి సబ్సిడీ ప్రతిపాదనలేదు

**రాజ్యసభలో కేంద్రం స్పష్టం - వైసిపి ఎంపి మేడా రఘునాథరెడ్డి వెల్లడి**



**రాజంపేట, జూలై 22 ప్రభాతవార్త** దేశంలో నానో ఎరువుల వాణిజ్య వినియోగాన్ని వేగవంతం చేయడానికి సబ్సి డీ ఇవ్వాలన్న ప్రతిపాదన ఏది లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.ప్రోత్సాహక పథకం కూడా ఏది ఇప్పటివరకు పరిశీలనలేదని రాజ్యసభలో వైసీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి అడిగిన ప్రశ్నకు సమానంగా లిఖిత పూర్వకంగా పేర్కొంది. నానో ఎరువుల వాణిజ్య వినియోగాన్ని వేగవంతం చేయడానికి తీసుకున్న చర్యలు, ఎరువుల వినియోగాన్ని ప్రోత్స హించడానికి ప్రభుత్వం వాటి ఉత్పత్తికి సబ్సిడీ ఇవ్వాలని భావిస్తుందా అని ఎంపీ ప్రశ్నించారు. నానో ఎరువుల వినియోగానికి తీసుకున్న చర్యల గురించి ప్రస్తావించారు. అందుకు మంగళవారం కేంద్ర రసాయనాలు,ఎరువుల మంత్రిత్వ శాఖ మంత్రి స్మాత్ అనుప్రియ పటేల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. నాను ఇరువుల వినియోగానికి అవగాహన శిబిరాలు, వెబ్‌నార్లు, నుక్కడ్ నాటకాలు, క్షేత్ర ప్రదర్శనలు, కిసాన్ సమ్మేళన్‌లు,ప్రాంతీయ భాషలలో చలనచిత్రాలు వంటి వివిధ కార్యకలాపాల ద్వారా నానో ఎరువుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.నానో ఎరువులను సంబంధిత కంపెనీలు ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలలో అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు.ఎరువుల శాఖ క్రమం తప్పకుండా జారీ చేసే నెలవారీ సరఫరా ప్రణాళికలో నానో ఎరువులు చేర్చినట్లు వివరించారు. నానో యూరియా వంటి నానో ఎరువులను ఆకులపై వేయడం ద్వారా సులభంగా ఉపయోగించడం కోసం ఖిసాన్ డ్రోన్స్‌ఖి వంటి వినూత్న స్ప్రేయింగ్ ఎంపికలు , రిటైల్ పాయింట్ల వద్ద బ్యాటరీతో పనిచేసే స్ప్రేయర్ల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అందుకు గ్రామ స్థాయి వ్యవస్థాపకుల ద్వారా పైలట్ శిక్షణ మరియు కస్టమ్ నియామక స్ప్రేయింగ్ సేవలను చురుకుగా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఎరువుల కంపెనీలతో కలిసి డిఒఎఫ్ దేశంలోని 15 వ్యవసాయ వాతావరణ మండలాల్లో సంప్రదింపులు, క్షేత్ర స్థాయి ప్రదర్శనల ద్వారా నానో డిఏపిని స్వీకరించడానికి మహా అభియాన్ ను ప్రారంభించిందన్నారు.నానో ఎరువులకు ఎటువంటి సబ్సిడీని అందించడం లేదని పేర్కొన్నారు. అయితే, శాఖ తన ప్రభుత్వ రంగ సంస్థలను (శిశీగేలు) నానో ఎరువుల ఉత్పత్తి ప్లాంట్లను స్థాపించడానికి చురుకుగా ప్రోత్సహిస్తోందన్నారు.డ్రోన్లను ఉపయోగించి నానో ఎరువుల వాడకం ఖర్చుతో కూడుకున్న సాంకేతికతగా ఉద్భవించిందన్నారు. వ్యవసాయం రైతు సంక్షేమ శాఖ , నమో డ్రోన్ దీదీ పథకాన్ని అమలు చేసిందన్నారు.



## ఆహారపదార్థాల తనిఖీకి అత్యాధునిక పరిశోధనశాల

**తిరుమల,జూలై 22ప్రభాతవార్తప్రతినిది:** అత్యాధునిక పరికరాలతో తిరుమలలో ఏర్పాటుచేసిన ఆహార నాణ్యాత పరీక్ష పరిశోధనశాల ద్వారా ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సిన అవసరంలేదని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. గతంలో స్వామివారి ప్రసాదాలు,నెయ్యి తదితర వస్తువుల నాణ్యతను పరీక్షించేందుకు తిరుమలలో నూతనంగా ఏర్పాటుచేసిన ఆహార పరిశోధనశాలను మంగళవారం సాయంత్రం ఈ ముగ్గురు కలిసి ప్రారంభించారు. 75 లక్షలు రూపాయలు విలువైన ఈ పరికరాలను గుజరాత్ లోని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు విరాళంగా అందజేసిందని వివరించారు. ఇందులో పనిచేసే సిబ్బంది మైసూర్‌లోని సిఎఫ్‌టిఆర్ఐలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు శాంతారామ్, సదాశివరావు, నరేష్ ,సిఈ సత్యనారాయణ, డిప్యూటీ ఇఒలు భాస్కర్, సోమన్నారాయణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి అధికారులు పాల్గొన్నారు.

## ఎపి నుంచి వారానికి 1,194 విమానాల రాకపోకలు

- కుప్పం ఎయిర్‌పోర్టు స్థలానుమతి కోసం దరఖాస్తు - 11 చోట్ల నుంచి సీప్లేన్ నిర్వహణకు ఎల్‌ఓఐల జారీ - రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

**విజయవాడ,జులై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రస్తుతం వారానికి 1,194 విమానాలు రాకపోకలు సాగిస్తున్నట్లు కేంద్ర విమానయాన శాఖ సహాయమంత్రి మురళీధర్ మొహోల్ తెలిపారు. రాజ్యసభలో టిడిపి సభ్యుడు బీద మస్తాన్‌రావు అడిగిన ప్రశ్నకు ఈ మేరకు బదులిచ్చారు. రాష్ట్రంలో 2021లో ఓర్వకల్లు విమానాశ్రయం అందుబాటులోకి వచ్చిందని, ప్రస్తుతం భోగాపురం విమానాశ్రయ నిర్మాణం పురోగతిలో ఉందన్నారు. గతదర్తి విమానాశ్రయం నిర్మాణం కోసం 2018లో కుదుర్చుకున్న కన్సెప్షన్ అగ్రిమెంట్‌ను ఆ తర్వాత రాష్ర ప్రభుత్వం రద్దు చేసిందని పేర్కొన్నారు. 2008 గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్స్ పాలసీ ప్రకారం ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేయాలంటే కొత్త ఎయిర్‌పోర్టు డెవలపర్‌ను ఎంచుకోవడంతో పాటు భూసేకరణ,చట్టబద్ధమైన అనుమతులు,ఆర్థిక వనరులను సమకూర్చుకోవాల్సి ఉంటుందన్నారు. కుప్పంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి అనసవరమైన స్థలానుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వం గత జూన్‌లో ధరఖాస్తు పంపిందని చెప్పారు.ఉడాన్ 5.5కింద అరకు,గండికోట,కాకినాడ, కోనసీమ, లంబసింగ్, నర్సాపూర్,ప్రకాశం బ్యారేజీ, రుషికొండ, శ్రీశైలం, తిరుపతి, నాగార్జునసాగర్ ల నుంచి సీప్లేన్‌ల నిర్వహణక అవసరమైన బిడ్డింగ్‌లు దాకలు చేసుకోవాడానికి వీలుగా ఎయిర్‌లైన్ ఆపరేటర్లకు లెటర్ ఆఫ్ ఇండెం ట్(ఎల్‌ఓఐ)లు జారీ చేసినట్లు వైకాపా సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అడిగిన మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. సీ ప్లేన్‌ల నిర్వహణ కోసం డిజీసీఏ భద్రతా నిబంధనల్లో సవరణలు చేసిందని, దీని ప్రకారం శిక్షణావసరాలు, అనుమతుల ప్రక్రియ,స్థలం ఎంపిక సరళంగా ఉంటుం దన్నారు. కేంద్ర ప్రభుత్వ రక్షణలో 135 పురాతన స్మారక కేంద్రాలు కేంద్ర ప్రభుత్వ రక్షణలో ఆంధ్రప్రదేశ్‌లో 135 పురాతన సా మ్రరక కేంద్రాలు ఉన్నట్లు కేంద్ర పర్యాటక,

సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ తెలిపారు. ఆయన లోక్‌సభలో టిడిపి సభ్యుడు జీఎం హరీష్ మాథుర్

అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. వీటి కోసం గత నాలుగేళ్ళలో రూ.36 కోట్లు కేటాయించగా, అందులో రూ.35 కోట్లు ఖర్చుయినట్లు వెల్లడించారు.

## యూరియాను వ్యవసాయేతర రంగాల్లో వినియోగిస్తే కఠిన చర్యలు

- వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు



**విజయవాడ, జూలై 22, ప్రభాత వార్త ప్రతినిధి:** యూరియాను వ్యవసా యే తర రంగాల్లో అక్రమంగా వినియోగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఏపీ వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. యూరియా వినియోగం ఏటా 15 నుంచి 20 శాతం పెరుగుతుండటం గమనించినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీపై అందిస్తున్న యూరియా పక్కదారి పడుతున్నట్లు కేంద్ర నిఘా సంస్థలు తెలిపాయని వెల్లడించారు.

రైతుల కోసం కేటాయించిన యూరియాను ఆక్వా, చేపల చెరువులకు, పశువుల దాణా పరిశ్రమకు, నాటుసారా తయారీకి, ప్లాస్టిక్, ప్లైవుడ్, రసాయనిక పరిశ్రమలకు, కల్తీ పాల తయారీ, అమ్మోనియం నైట్రేట్ వంటి పేలుడు పదార్థాల తయారీకి వినియోగిస్తున్నట్లు నిఘా సంస్థలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు రైతులు సిఫార్సు చేసిన మోతాదుకు మించి వినియోగించడం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రెండోసారి విత్తనాలు వేసుకోవాల్సి రావడం వల్ల యూరియా వాడకం అధికమవుతుందని చెప్పారు.

యూరియా అక్రమ వినియోగం నిరోధించడంపై జిల్లా అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు.

## భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వైకుంఠమ్ 3 కాంప్లెక్స్

- అన్యమత ఉద్యోగులను ఎవరినీ వదలిపెట్టం
- టిటిడి బోర్డులో చర్చ
- 'వార్త' కథనాలపై సమీక్ష

**తిరుమల,జూలై 22ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం రోజురోజుకూ భక్తుల సంఖ్య అనూహ్యంగా రెట్టింపవుతున్న నేపథ్యంలో తిరుమల వెలుపల కిలోమీటర్ల క్యూలైన్లకు స్వస్తిపలకడానికి వైకుంఠమ్ క్యూ కాంప్లెక్స్-3 నిర్మాణం చేపట్టేందుకు నిపుణుల కమిటీని టిటిడి బోర్డు ఏర్పాటు చేసింది. ఈ కమిటీ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నివేదికలిస్తే వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేందుకు బ్రహ్మోత్సవాల్లోపు నిర్ణయం తీసుకునే దిశగా అడుగులేస్తోంది. అలాగే హిందూ ధార్మికసంస్థ టిటిడిలో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులపై నిఘా పెట్టామని, ,అలాంటి ఉద్యోగులను ఎవరినీ వదలిపెట్టే ప్రసక్తేలేదని కూడా బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు స్పష్టం చేశారు. ఈ రెండు అంశాలపై ఈనెల 13వతేదీన 'వార్త'దినపత్రికలో "వెలుపల క్యూలైన్ల నియంత్రణకు వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్-3 నిర్మాణంతోనే !2000లో వైకుంఠమ్ -2 కాంప్లెక్స్ నిర్మాణం"శీర్షికతో ప్రత్యేక కథనం, మూడురోజుల క్రిందట "అన్యమత ఉద్యోగులపై చర్యలేవీ!?"కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ కథనాలపై టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు మంగళవారం సమావేశంలో కీలకంగా చర్చించి అభిప్రాయాలు వెలువడించారు. వేలాదిమంది భక్తుల వెలుపల క్యూలైన్ల నియంత్రణకు వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ నిర్మాణం శరణ్యమనే అభిప్రాయాలపై ఏకీభవించారు. వైకుంఠమ్ 1, వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్ లలో 62కంపార్టుమెంట్లు నిండిపోతున్నాయి. ఒక్కోకంపార్టుమెంట్‌లో 400మంది లెక్కన 25వేలమంది వరకు భక్తులు కూర్చునేందుకు సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం తిరుమలలో 40వేలమంది భక్తులు వస్తేనే వైకుంఠమ్ -1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి నారాయణగిరిషెడ్లు నిండి ఆలయం వెలుపల మూడుకిలోమీటర్లు దూరం శిలాతోరణం వరకు భక్తుల లైన్లు వ్యాపిస్తున్నాయి. 1980లో భక్తులకు అప్పటి సంఖ్యకు తగ్గట్లు అవసరాలకు కనీసం తలదాచుకునేందుకు వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు.

# తిరుమల సమాచారం

## ఆగస్ట్ 8న టిటిడి ఆలయాల్లో సౌభాగ్యం

- 28న సద్గమయ కార్యక్రమం
- హెచ్‌డిపిపి నూతన కార్యక్రమాల బ్రోచర్ ఆవిష్కరణ



**తిరుమల,జూలై 22ప్రభాత వార ప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలోని అన్ని ఆలయాల్లో ఆగస్ట్ 8వతేదీ శుక్రవారం సౌభాగ్యం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆలయా లను సందర్శించే మహిళలకు గాజులు, పూలు,పసుపు,కుంకుమ,అక్షతలు సమర్పించే ప్రత్యేక కార్యక్రమంగా దీన్ని రూపొందించారు. సనాతన ధర్మాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్ళేందుకు ,విద్యార్థులకు మానవీయ విలువలు నేర్పేందుకు ఈనెల 28న సద్గమయ కార్యక్రమం ప్రారంభం కానుంది. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఏడాదిపాటు చేపట్టే పలు కార్యక్రమాలతో రూపొందించిన బ్రోచర్‌ను మంగళవారం మధ్యాహ్నం అన్నమయ్యభవనంలో ఆవిష్కరించారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడిఇ ఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, పనబాకలక్ష్మి,శాంతారాం, నర్సి రెడ్డి పలువురు బోర్డు సభ్యులతో కలసి ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఛైర్మన్ నాయుడు మాట్లాడుతూ టిటిడి .ధర్మప్రచారపరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన కార్యక్రమాలు సనాతన హిందూ ధర్మవ్యాప్తికి దోహదపడుతాయన్నారు. సనాతన ధర్మాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్ళేందుకుఈ బ్రోచర్ ఉపయోగపడుతుందన్నారు. ఆగస్ట్ 8న సౌభాగ్యం, అక్టోబర్ 2వతేదీ మన వారసత్వం, ఆగస్ట్ 15న సన్మార్గం, ఆగస్ట్ 31న హరికథవైభవం, అక్టోబర్ 12న అక్షరగోవిందం, డిసెంబర్ 1వతేదీ భగవద్గీతానుష్టానం,బోధన, 2026 వేసవిసెలవుల్లో 16సంవత్సరాల లోపు పిల్లలకు సంప్రదాయ భజనపై భజే శ్రీనివాసం, సంప్రదాయ భజన శిక్షణ కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. వీటితో బాటు వన నిధి, గిరిజనార్ధనం వంటి కార్యక్రమాలను రూపొందించడం చక్కగా ఉందన్నారు.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అంతా శుభాలు

- స్వామివారిసేవలో తరించడం అదృష్టం
- మైసూరు మహారాణి రాజమాత ప్రమోదాదేవి



**తిరుమల,జూలై 22 ప్రభాతవార్తప్రతినిధి:** మైసూరు మహారాజు సంస్థానంకు చెందిన తామంతా కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనంతో ఆనందంగా ఉన్నామని మైసూరు సంస్థానం రాజమాత ప్రమోదాదేవి, మహారాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ్ వడియార్‌లు తెలిపారు. స్వామివారిసేవలో పాల్గోని స్వామి వారికి పల్లవోత్సవంతో ఆతిధ్యం ఇవ్వడం మా అదృష్టమన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సు లతో దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. మంగళవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్న మైసూరు సంస్థానం కుటుంబం దేవదేవుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వెంకన్న దర్శనంతో ఆనందం : ప్రముఖులు



**తిరుమల,జూలై 22ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడంతో మనసు ఆనందంగా ఉంటుందని పలువురు ప్రముఖులు విశ్వాసం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం విఐపి బ్రేక్‌లో తెలంగాణ ఎమ్మెల్యే గడ్డం వివేక్, ఎమ్మెల్యే సూర్యనారాయణ, నటుడు నందు తిరుమలకు చేరుకుని దేవదేవుడిని దర్శించుకున్నాడు. టిటిడి అధికారులు చక్కటి ఏర్పాట్లుచేసి తనకు స్వామివారి దర్శనం కల్పించారని ఆనందం వ్యక్తం చేశారు.

## వేగంగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు

- సుందరంగా సిద్ధమవుతున్న ఏడుకొండలు!

**తిరుమల,జూలై 22ప్రభాత వార్తప్రతినిధి:** ఏడుకొండల శ్రీవేంకటేశ్వర స్వామికి సెప్టెంబర్ 23నుండి మొదలు కానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు తిరుమ లలో ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. తొమ్మిది రోజులుపాటు జరిగే దేవుని ఉత్సవాలకు దేశవిదేశాల ఉండి అశేషంగా భక్తులు తరలివస్తారనే ముందుచూపుతో అన్ని విధాలా అవసరమైన ఏర్పాట్లు, సౌకర్యాలు,గ్యాలరీలు నిర్మాణం, ఆలయానికి ఎదురుగా చలువపందిళ్ళు, జర్మన్‌షెడ్లు,ఆస్థాన మండపం వద్ద భక్తులు వానకు తడవకుండా ఉండేలా షెడ్లు నిర్మాణం జరుగుతోంది. మాఢవీధుల్లో ఎండకు.వానకు రక్షణగా గ్యాలరీలు నిర్మితమవుతున్నాయి. ఇంజనీరింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది సాలకట్ల బ్రహ్మోత్సవాలు మాత్రమే జరగనున్నాయి.ఈ వాహనసేవలను భక్తుల మధ్య జరిపించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం సిద్ధమవుతోంది. ఆలయం పరిసరాలు ,మాఢవీధుల్లో గ్యాలరీలు, ఇనుప పైపులతో నింపేస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు కొండను సర్వాంగసుందరంగా ముస్తాబుచేసే పనులు ఆరంభమయ్యాయి.

## నూతన శ్రీవాణి దర్శన టికెట్ల కేంద్రంతో భక్తులకు మరింత సౌలభ్యం



**తిరుమల,జూలై 22 ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి భక్తులకు మరింత సౌకర్యవంతంగా శ్రీవాణి దర్శన టికెట్లు జారీ చేసేందుకు తిరుమల అన్నమయ్య భవనం ఎదురుగా నూతన శ్రీవాణి దర్శన టికెట్ల కేంద్రం సిద్ధమైంది.ఈ కేంద్రాన్ని మంగళ వారం సాయంత్రం టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇఓ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరితోకలసి ప్రారంభించారు. అత్యాధునిక మౌలిక సదుపాయాలతో రూ. 60 లక్షల వ్యయంతో కొత్త కౌంటర్లను నిర్మించినట్లు తెలిపారు. నేటి నుంచి కౌంటర్ల ద్వారా భక్తులకు టికెట్ల పంపిణీ ప్రారంభమవుతుందని, భక్తులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అనంతరం హెచ్‌వీసీ, ఏఎన్సీ ప్రాంతాల్లో భక్తుల సౌలభ్యం కోసం నూతనంగా ఆధునీకరించిన ఉప విచారణ కార్యాలయాలను టిటిడి ఛైర్మన్ ప్రారంభించి భక్తుల కోసం ఏర్పాటు చేసిన మౌలిక సదుపాలయాలను పరిశీలించారు.

## సమాచార కమిషనర్ల పోస్టులకు నోటిఫికేషన్

**విజయవాడ,జూలై 22,ప్రభాతవార్త ప్రతినిధి:**రాష్ట్ర ముఖ్య సమాచార కమీషనర్,సమాచార కమీషనర్ పోస్టుల బర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన జారీ చేసింది. న్యాయ,శాస్త్ర సాంకేతిక సామాజిక సేవ,పాత్రికేయం,మాస్ మీడియా,ప్రభుత్వ పాలన రంగాల్లో విశేష పరిజ్ఞానం,అనుభవం ఉన్నవారు ధరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఔత్సాహికులు తమ వివరాల్ని ఆగస్టు నాలుగో తేదీ సాయంత్రం 55.30 లోపు రిజిష్టర్ పోస్టు ద్వారా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి,సాధారణ పరిపాలన శాఖ,రాష్ట్ర సచివాలయం,వెలగపూడి,అమరావతి' చిరునామాకు పంపాలని సూచించింది.వివరాలను ఈ-మెయిల్ ఐడీ జీఎడి.ఎఆర్‌సెక్షన్ అట్ ది రేట్ ఆఫ్ జిమెయిల్.కాం ద్వారా కూడ పంపొచ్చంది.

వార్త


ఆకారాన్ని మాత్రమే చూసి మంచి చెడ్డలు నిర్ణయించుకునేవారు సంకుచిత స్వభావులు మాత్రమే.

-ఆస్కార్ వైల్డ్

# కీలుబొమ్మలుగా మారొద్దు!

స్వతంత్ర ప్రతిపత్తితో నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన కేంద్ర దర్యాప్తు సంస్థలు సిబిఐ, ఈడీలు రాజకీయ క్రీడలో పావులుగా మారి తమకు సంబంధం లేని విషయాల్లో తలదూర్చి దూకుడు ప్రదర్శించినప్పుడల్లా న్యాయస్థానాల చేత మొట్టికాయలు తింటూనే ఉన్నాయి. ఇలాంటి అంశాలను క్రోడీకరిస్తే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ తమ అధికారాలను, విధులను దుర్వినియోగం చేస్తోందని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్‌గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం తీవ్ర ఆగ్రహాంవ్యక్తం చేసింది. ఇది తాజా అంశం ఇంతకు ముందు ఎన్నోసార్లు ఈ కేంద్ర దర్యాప్తు సంస్థల రాజ కీయ ఒత్తిడులకులొంగి చేసిన నిర్వాకాలను సుప్రీంకోర్టు తీవ్రంగానే మందలించింది. ప్రస్తుత 'ముడా' (మైసూరు పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ)భూ కేటాయింపుల కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య శ్రీమతి బిఎం పార్వతికి వ్యతిరేకంగా ఈడీ జారీ చేసిన సమన్లను కొట్టివేస్తూ కర్ణాటక హైకోర్టులోని ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సోమవారం నాడు సుప్రీంకోర్టు ధర్మా సనం సమర్థించింది. హైకోర్టులో వచ్చిన తీర్పుకు సవాల్ చేస్తూ ఈడీ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌లో ఉన్నత ధర్మాసనం తమ పరిశీలనకు లోబడే కొన్ని విమర్శలు చేసింది. అవే కేంద్ర దర్యాప్తు సంస్థల నిర్వాకాన్ని,వాటిని తమకనుకూలంగా వాడుకోజూసిన పార్టీల ఆలోచనలను సుప్రీం ధర్మాసనం ఎండగట్టింది. ఈసారి అక్షింతలు వేయించుకునే వంతు 'ఈడీ'దయ్యింది. ఇంతక్రితం 2013లో సిబిఐని 'పంజరంలో చిలక'గా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్నది మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం. కేంద్రంలో ఏ పార్టీ, ఎవరు అధికారంలో ఉన్నా సుప్రీంకోర్టు ఒకే రకంగా వ్యాఖ్యానిస్తోందంటే వ్యవస్థలో ఉన్న లోపం ఇప్పటికీ సరికానట్లే! ప్రజాస్వామ్యానికి ప్రధాన స్తంభంగా వినుతికెక్కిన న్యాయవ్యవస్థ ఇతర వ్యవస్థల్లోని లోపాలను ఎత్తిచూపి న్యాయబద్ధంగా చట్టబద్ధంగా పనిచేసేందుకు ఓ 'మలుకర్ర' లా వ్యవహరిస్తుంటుంది. సిబిఐ ఈడి కేంద్ర దర్యాప్తు సంస్థలు నియమబద్ధంగా చట్టాలు,న్యాయ విధానాలకు లోబడి తమ దర్యాప్తులో ఎవరి జోక్యం లేకుండా పనిచేయాలి. రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి. వీటన్నిటినీ వదిలిపెట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చిచ్చు రాజేసే పనులకు తోడ్పడుతున్నాయనో, రాజకీయ ప్రమేయంతోనో కేసుల వ్యవహారాలను ముందుకు తీసుకుపోతున్నాయనో ఆరోపణలు ఎదుర్కోవాల్సి వస్తోంది. తాజాగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య కుటుంబాన్ని అప్రతిష్ట చేసే కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్‌ను దురద్దేశపూర్వకంగా తమ రాజకీయ పోరాటాలను వాడుకుంటోందని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఒకరోజు ముందు మరో కేసులోఈడీని మద్రాసు హైకోర్టు కూడా ఇదేమాదిరి మందలించింది. కర్ణాటక ఎస్ఎల్‌పిలో అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీరాజు సుప్రీంకోర్టు వేసిన ప్రశ్నలకు సరైన సమాధానాలు రాకపోవడంతో 'రాజకీయ స్వప్రయోజనాల కోసం, విపక్ష పార్టీలపై కక్ష సాధింపు కోసమే ఈడిని దుర్వినియోగం చేస్తున్నట్లు అనిపిస్తోందని సుప్రీం స్పష్టంగానే వ్యాఖ్యానించింది. దేశమంతటా ఈడిని ప్రత్యర్థులపై ఉసికొల్పే 'రాజకీయ' క్రీడకు ఆస్కారమివ్వద్దని గట్టిగానే హితవు చెప్పింది. రాజకీయ యుద్ధాలు ఎన్నికల వేదికల మీదనే తప్ప బయట వేసే ధోరణి మంచిదికాదని, ఇదే కొనసాగితే తాము కఠిన చర్యలు తీసుకుంటామని ఈడిని హెచ్చరించారు. ఇలా కోర్టుల్లో కేంద్ర దర్యాప్తు సంస్థలకు చీవాట్లుపడినప్పుడల్లా ప్రత్యర్థి పార్టీలు తమవంతుగా తీర్పులను వ్యాఖ్యలను స్వాగతిస్తుంటారు. ఇప్పుడూ అదే జరిగింది. అటు వారు ఇటైనా, ఇటువారు అటైనా అధికార, విపక్షపార్టీలస్పందన ఇలాగే ఉంటుంది. ఆ సంస్థ కార్యకలాపాల్లో అనవసర జోక్యాలు,అధికార దుర్వినియోగాలు బయటపడ్తుంటాయి. అంతవరకు మీమాంసలతో చర్చించుకునే పజాబాహుళ్యానికి అసలు విషయాలు తేటతెల్లమవుతుంటాయి. న్యాయ సమ్మతంగా వ్యవహరించి ఉంటే గతంలో ఎన్నో సందర్భాల్లో 'కోర్టు మంద లింపు'లకు గురైన 'ఈడీ' వ్యవహారం మరోసారి ఇప్పుడు కోర్టు ముందు నవ్వులపాలు కాదు. గతంలో మహారాష్ట్ర లో జరిగిన అనుభవాన్ని కూడా జస్టిస్ బిఆర్‌గవాయ్ ఈ కేసు సందర్భంగా ఉటంకించారు. అంటే 'చర్వితచరణం'గా తప్పులు చేసే పద్ధతి మారాలని సూచించినట్లే. కక్షిదారులకు చట్టపరమైన సలహాలిచ్చే న్యాయవాదులకు కూడా ఈడి నోటీసులందించి మరో అద్భుతం సృష్టించింది. ఈ కేసును కూడా సుప్రీం ధర్మాసనం సుమోటోగా విచారణకు స్వీకరించి, ఈ అంశంపై 'అమికస్ క్యూరీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ప్రభావితం చేసే వర్గాలపై ఈడీ నోటీసుల వ్యవహారాన్ని కూడా ధర్మాసనం సీరియస్‌గా తీసుకొంది. తమ దృష్టికి వచ్చిన ప్రతి విషయాన్నీ దర్యాప్తు చేయడానికి మీరేం సూపర్ కాప్‌కాదు. డ్రోన్‌లా ఎగిరిపోనక్కర్లేదని ఈడీని మద్రాస్ హైకోర్టు అంతకుముందు రోజే హెచ్చరించింది. మనీలాండరింగ్ కేసులో ఈడీ చెన్నైకి చెందిన ఓ పవర్ జనరేషన్ సంస్థకు చెందిన రూ. 901 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను సీజ్‌చేసిన విషయంలో కాస్త తీవ్రంగానే మందలించింది. రాజకీయ ఉద్దేశ్యాల ప్రేరణతో చేపట్టేవన్నీ తాత్కాలిక వేధింపులకే తప్ప తుదకంటా నిలవవని ఎన్నో సందర్భాల్లో తేలినందున స్వచ్ఛమైన నియమనిబద్ధమైన ఆలోచనలతో కేసులు స్వీకరించిదర్యాప్తు చేయలేకపోతే ఆయా సంస్థలు నవ్వులపాలు కాక తప్పదు.

మిక్కిలి ధనం కానీ, గొప్ప విద్యకానీ, గొప్ప అధికారం కానీ పొందినప్పటికీ గర్వం లేక ఏ వ్యక్తి ప్రవర్తిస్తాడో అతడే పండితుడు.



ప్లినీ

శత్రువుల నుంచి కాపాడుకోవాలంటే వాళ్లని మిత్రులుగా మార్చుకోవడమే ఉత్తమమైన మార్గం.



స్వామి వివేకానంద

# ప్రజావాక్కు



### సమన్వయంతో పని చేయాలి

జూన్ 2025లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతానికి తగ్గినట్టు ప్రభుత్వ గణాంకాలు వెల్లడించడం కొంత ఊరట కలిగించినా, ఇది తాత్కాలిక ఉపశమనంగా మాత్రమే పరిగణించాలి. గత నెలల్లో ఆహారధరలు, నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా పెరగడంతో మధ్య తరగతి, పేదవర్గాలు తీవ్ర ఆర్థికఒత్తిడిని ఎదుర్కొన్నారు. బియ్యం, కూరగాయలు,పాలు వంటిమౌలికావసరాలధరలు సామాన్యుడికి అధిక భారం మోపుతున్నాయి. ఇది ఆరోగ్యంపై, విద్యపై, జీవన నాణ్యతపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. చిన్నారులు,మహిళలు పోషకాహారం నుండి దూరమవుతున్నారు. ఇది ప్రభుత్వాన్ని ఆందోళనకు గురిచేయాల్సిన అంశం. ధరల నియంత్రణకు సరఫరా గొలుసును బలోపేతం చేయాలి.వృద్ధి లక్ష్యాలను కొనసాగిస్తూ ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### జాలర్ల జీవితాలకు కొత్తబాట వేయాలి

కచ్చతీవు వివాదం ఎన్నికలమ్యానిఫెస్టోకు పరిమితం కావడంవిషాదం.ఎప్పుడో ఇందిరాగాంధీ పీరియడ్‌లో కుదిరిన ఒప్పందం పైన ఇప్పుడు వివాదాలు రేపడం జాలర్ల జీవితాలకు సంబంధించిన అంశం కావడం బాధాకరం. నేడు అది రాజకీయ అస్త్రంగా మారడం విషాదం. బిజెపి ప్రభుత్వం కొత్తతరహా విదేశాంగ విధానానికి రూపకల్పన చేశామని చెపుతున్నారు కదా. విదేశాంగ నిపుణులను ఆర్థిక వేత్తలను, కోస్టల్ ఏరియా నిపుణులను, ఇరు దేశాల పౌర హక్కుల ఉద్యమ కారులను, నియమించి వేలాది జాలరుల జీవితాలకు కొత్త బాట వేయాలి.

- భారత అవినాష్, జనగామ

### సంప్రదాయాన్ని పాటించాలి

ఈకాలంలో ఆడపిల్లలు బాగా చదువు కోవడం, ఉద్యోగాలు చేయడం మొదలైన తరువాత వారికి వంట చేయడం చేత కావట్లేదు. వివాహమైన తరువాత చాలా శ్రమపడవలసి వస్తోంది. ఏకూర ఎలా చేయాలనేది తెలియక చరవాణిలోవంటలు యాప్‌లనుచూసిచేస్తున్నారు.లేదా బయటనుంచి ఆర్డర్లు పెడుతున్నారు. ఆడపిల్లలకు అన్ని రకాల వంటలను చిన్నప్పటి నుండే నేర్పడం మొదలు పెట్టాలి.

- కె. రామకృష్ణ, సికింద్రాబాద్

### విత్తనాలను సరఫరా చేయాలి

రోజు రోజుకు కూరగాయలు,పండ్ల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి.రాష్ట్రప్రభుత్వం అన్నిగ్రామాల్లో,పట్టణాల్లోప్రతి ఇంట్లో, అపార్ట్మెంట్ లలో కూరగాయలు, పండ్ల చెట్లను నాటేవిధంగా ప్రభుత్వమే కూరగాయల విత్తనాలు,పండ్ల చెట్లను నామమాత్రపు ధరకు పంపిణీ చేయాలి.అలా పంపిణీ చేయడానికి పట్టణాల్లో,గ్రామాల్లో చెత్త సేకరణకు ఉపయోగించే వాహనాల ద్వారా ప్రచారంచేయాలి. చెత్తసేకరించే వారిద్వారా ప్రతి ఇంటికి కూరగాయల విత్తనాలను,పండ్ల చెట్లను పంపిణీ చేయాలి. మున్సిపల్ శాఖ,గ్రామ పంచాయతీలు సేకరించిన చెత్త ద్వారా తయారుచేసినవర్మికంపోస్ట్‌ను నామమాత్రపు ధరకుపంపిణీ చేయాలి. తద్వారా తెలంగాణ రాష్ట్రం కూరగాయలు, పండ్లు పండించడం, ప్రజలందరికీ చౌక ధరలకు నాణ్యమైన కూరగాయలు, పండ్లు అందేవిధంగా చేయవచ్చు. ప్రజలు తమకు సరిపోను మిగిలిన కూరగాయలు పండ్లను తక్కువ ధరకు మున్సిపల్ శాఖ, గ్రామ పంచాయతీల ద్వారా సేకరించి మార్కెట్‌కు తరలించవచ్చు. దీనిపై ప్రజలలో అవగాహన కల్పించాలి.

-సింగు లక్ష్మీనారాయణ, కరీంనగర్

### పార్కింగ్ ఏరియా ఉండాలి

మన పట్టణాలు, నగరాలలోని కాలనీలలో అనేక మంది తన కార్లను తమ ఇళ్ళలో కాకుండా రోడ్డుపై నిలుపు చేస్తున్నారు. దీని వల్ల రోడ్లు ఇరుకై నడిచే వారికి, వాహనాలు నడిపే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కార్లను కొనుక్కొని తమ ఇంటిలో కాకుండా రోడ్ల మీద పార్క్ చేయటం ఇతరులను ఇబ్బందులకు గురి చేయటమే అవుతుంది. వినియోగదారులు కార్లు కొనేటప్పుడు కానీ, రిజిస్ట్రేషన్ చేసుకునేటప్పుడు కానీ, కారు కొనుక్కునే సదరు వినియోగదారునికి తమ ఇంటిలో పార్కింగ్ సదుపాయం ఉందని చూపే ఋజువు ఉంటేనే వాహానాన్ని రిజిస్టర్ చేయాలనే విధానం ప్రభుత్వాలు వెంటనే ప్రవేశపెట్టాలి.ప్రభుత్వాలు ఈ దిశగా ఆలోచించాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### సమయపాలన పాటించని ఆర్టీసీ బస్సులు

టీఎస్ఆర్టీసీ బస్సుల సంఖ్య రాష్ట్రంలో పెరుగుతుంది. బస్సులు తప్పకుండా సమయపాలన పాటించాలి. బస్టాండులో టైమ్ టేబుల్ బోర్డు లు ఏర్పాటు చేయాలి. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రయాణికులు సరి అయిన సమయంలో సురక్షితంగా వెళ్లడానికి బస్సుల సమయ పాలన అవసరం.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# ఇ-దర్శన్ కేంద్రాలతో ప్రయోజనమే..

**తిరుమల శ్రీవారిదర్శనం అనేది ఒక పవిత్ర ఆధ్యాత్మిక అనుభవం మాత్రమే కాదు అది కోట్లాది మందికి విశ్వాసం, భద్రత, ధైర్యానికి నిలయంగా ఉంది. అలాంటి దర్శనాన్ని అందరికీ అందుబాటులోకి తేవడం అనేది టీటీడీ ప్రభుత్వాల బాధ్యత. ఈ బాధ్యతను నెరవేర్చడంలో ఈదర్శన్ కేంద్రాల పునఃప్రారంభం ఒక ముఖ్యమైన చర్య. సాంకేతికతను నమ్మడం మంచిదే అయినా, అది సమానంగా అందరికీ ఉపయోగపడేలా ఉండాలి. అందుకే, తిరిగి ఈ కేంద్రాలను ప్రారంభించి, భక్తుల అవసరాలకు స్పందించే విధంగా ఒక ప్రజాభిమాన వ్యవస్థను ఏర్పరచాలి. టీటీడీ ధర్మకర్తల మండలి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలి.**

అప్పన్న గొనప

తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం అనేది కోట్లాది మంది హిందూ భక్తుల జీవిత లక్ష్యంగా మారిన పవిత్రతతో కూడిన ఆధ్యాత్మిక యాత్ర. ఈ యాత్రలో ప్రతి ఒక్కరూ శ్రద్ధతో, నమ్మకంతో పాల్గొంటారు. దేశమంతటా, ప్రపంచవ్యాప్తంగా అనేక మంది భక్తులు తిరుమలకు వచ్చి శ్రీవారి కృపను పొందాలనుకుంటారు. ఈ ఆధ్యాత్మిక యాత్రను సులభతరం చేయడం, భక్తులకు ఏ విధంగానైనా ఇబ్బందులు కలగకుండా చూడడం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రధాన బాధ్యత. ఈ క్రమంలో ఒకప్పుడు ప్రారంభించిన 'ఈదర్శన్' కేంద్రాలు ఎంతో కాలం పాటు భక్తులకు సహాయకరంగా నిలిచాయి.కానీ గత ఏడు సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా 100కు పైగా ముఖ్య ప్రాంతాల్లో ఉన్న ఈ కేంద్రాలను పూర్తిగా మూసివేయడం వల్ల లక్షలాది సామాన్య భక్తులకు అనేక అడ్డంకులు ఏర్పడ్డాయి. భక్తుల ప్రయాణం ఆధ్యాత్మిక పథంగా కాకుండా ఒక నిరాశాజనకమైన సమస్యల యాత్రగా మారుతోంది. 'ఈదర్శన్' కేంద్రాల మూసివేత అనేది సాధారణమైన పరిపాలనా చర్యకాదు. ఇది లక్షలాది మంది సామాన్య ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష ప్రభావాన్ని చూపే నిర్ణయం. గతంలో ఈ కేంద్రాల ద్వారా భక్తులు స్వయంగా తమ పట్టణ, జిల్లా కేంద్రాల ద్వారా దర్శన టికెట్లు, ఆర్జిత సేవల టికెట్లు వసతి గదుల బుకింగ్ చేసుకునే సదుపాయం కలిగి ఉండేవారు. అంతేకాదు,ఇందులో పని చేసే టీటీడీ సిబ్బంది భక్తులకు సహాయంగా ఉండి అవసరమైన సమాచారం అందించేవారు. పెద్దవారికి, వికలాంగులకు, టెక్నాలజీపై అవగాహనలేని వారికి ఇది ఒక దైవ ప్రసాదంగా భావించవచ్చు. అయితే ప్రస్తుతం టీటీడీ టికెట్లను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో మాత్రమే అందిస్తోంది. అంటే భక్తులు తిరుమల దర్శనానికి ముందు మూడు నెలల పాటు వేచి ఉండి, ఆన్‌లైన్‌లో టికెట్ పొందాల్సిన అవసరం ఏర్పడింది. ఇది సాంకేతికంగా అందరికీ సాధ్యపడే పనికాదు. స్మార్ట్‌ఫోన్లు లేని వారు, ఇంటర్నెట్ బాగా వాడలేని వారు, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారు, లేదా చదువురాని వృద్ధులు - వీరంతా తిరుమల దర్శనం పొందేందుకు ఇప్పుడు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. ఈ పరిస్థితిలో, చాలా మంది భక్తులు స్థానికంగా ఉన్న ఇంటర్నెట్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. కానీ అక్కడ వారు అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మరికొంతమంది దళారుల చేతుల్లో మోసపోతున్నారు. దర్శనానికి ఉచితంగా లేదా తక్కువ ధరకు లభించాల్సిన టికెట్ల కోసం వేల రూపాయలు చెల్లించే పరిస్థితులు కనబడుతున్నాయి. వీటితో పాటు వికలాంగులు, వృద్ధులు, గర్భిణులు వంటి ప్రత్యేక వర్గాల భక్తులకు కూడా టికెట్లను పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే అందించడం వల్ల వారు ప్రత్యక్షంగా తిరుమల కొండపైకి వచ్చి టికెట్ల కోసం వేచిఉండాల్సి వస్తోంది. ఇది వారి ఆరోగ్యానికే కాకుండా భక్తి భావనకూ ఎదురుదెబ్బలాంటిదే. టీటీడీ తమ సేవలన్నింటిని ఆన్‌లైన్‌లోకి మార్చడం ఒక ఆధునీకీకరణ చర్యగా భావించవచ్చు. కానీ ప్రతి ఆధునికతను ప్రజల అవసరాలకు అనుగుణంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. అన్ని వర్గాల ప్రజలు



ఒకే స్థాయిలో డిజిటల్ ప్రపంచాన్ని వాడలేరు. భక్తులలో చాలా మంది పేదలు, గ్రామీణ ప్రాంతాలవారు, వృద్ధులు, నిరక్షరాస్యులు ఉంటారు. వీరందరికీ ఆన్‌లైన్ టికెట్లప్రక్రియ పూర్తి చేయడం చాలా కష్టంగా మారుతుంది. వారు అవసరమైన సమాచారం పొందడానికే కాదు, సరైన విధంగా గది బుకింగ్ చేసుకోవడానికి కూడా ఇతరులపై ఆధారపడుతున్నారు.ఇది వారిని ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తోంది. భక్తుల ఈ పరిస్థితిని గుర్తించి, తిరిగి ప్రత్యక్ష సేవల విధానాన్ని అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది.ఈ నేపథ్యంలో, ఒక ప్రత్యేకమైన పథకాన్ని రూపొందించి, భక్తులందరికీ టికెట్లను పునరుద్ధరించిన ఈదర్శన్ కేంద్రాల ద్వారా అందించే విధంగా టీటీడీ కార్యాచరణ రూపొందించాలి. ప్రతి జిల్లాలో కనీసం ఒకటి, ప్రధాన పట్టణాల్లో మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా భక్తుల సమస్యలకు పరిష్కారం చూపవచ్చు. తిరుమల యాత్ర అనేది ఒక ఆధ్యాత్మిక యాత్ర. భక్తులు తమ మనోభావాలను, శ్రద్ధను తీసుకొని స్వామివారి సన్నిధికి చేరుకుంటారు. అలాంటి యాత్రను ఆధునిక సాంకేతికత పేరుతో ఒక టెక్నికల్ కాంప్లికేషన్‌గా మార్చకూడదు. ప్రతి భక్తుడూ సమానంగా స్వామివారి దర్శనం పొందేహక్కు కలిగి ఉన్నాడు. ప్రత్యక్ష టికెట్ల విక్రయ కేంద్రాలు లేకుండా, భక్తులను ఆన్‌లైన్‌కు పరిమితం చేయడంవల్ల, వారి ఆధ్యాత్మిక యాత్ర అర్థరహితంగా మారుతోంది.కొన్ని నిమిషాల్లోనే అన్నిటికెట్లు బుక్ అయిపోవడం, సర్వర్లు డౌన్ కావడం, ఫోన్లో సిగ్నల్స్ రాకపోవడం వంటి సమస్యలు ప్రతిరోజు ఎదురవుతున్నాయి. అలాంటి సమయంలో భక్తులుస్వామిని దర్శించాలన్న ఆకాంక్షను వదులుకుంటున్నారు. ఇది అత్యంత బాధాకరమైన స్థితి. ఈపరిస్థితి మారాలంటే తిరిగి ప్రత్య క్ష సేవల అందుబాటు రావాలి. ఈదర్శన్ కేంద్రాలను తిరిగి తెరవడం ఒక ముఖ్యమైన పరిష్కారమార్గం. వీటి ద్వారాభక్తులు భద్రతగా, సులభంగా, నమ్మకంగా తమ సేవలను పొందగలుగుతారు.ప్రభుత్వం టీటీడీ సంయుక్తంగా చర్యలు తీసుకోవాలి. ఈ సమస్యపట్ల టీటీడీ ధర్మకర్తల మండలి, అలాగే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. ఇది భక్తుల విజ్ఞప్తి మాత్రమే కాదు,ఒక సామాజిక బాధ్యత. లక్షలాదిమంది సామాన్యులు భగవంతుని దర్శించుకోవాలనుకుంటే, వారిని ఆన్‌లైన్ పద్ధతిలోనే బంధించడం సమంజసంగా ఉండదు. ప్రత్యక్ష సేవల ద్వారా భక్తులకు మరింత మానవీయత, నైతికత, నిబద్ధతతో కూడిన అనుభవం లభిస్తుంది. ప్రతి పట్టణంలో తిరిగి ప్రారంభించదగ్గ ఈదర్శన్ కేంద్రాలద్వారా భక్తుల ఆర్థికభద్రత కూడా కాపాడబడుతుంది. దళారులచేతుల్లో మోసపోవడం తగ్గుతుంది. అందువల్ల, ఈ సమస్యపై టీటీడీ ఒకకార్యాచరణ ప్రణాళిక రూపొందించి, సమీక్ష చేసి, భక్తులకు ప్రత్యక్ష సేవలు అందించే దిశగా ముందడుగు వేయాలి. ఈ కేంద్రాలను తిరిగి తెరిచి భక్తుల కష్టాలను తీర్చడంద్వారా టీటీడీ తనధర్మాన్ని నిర్వర్తించగలదు. తిరుమల శ్రీవారిదర్శనం అనేది ఒక పవిత్ర ఆధ్యాత్మిక అనుభవం మాత్రమే కాదు అది కోట్లాది మందికి విశ్వాసం, భద్రత, ధైర్యానికి నిలయంగా ఉంది. అలాంటి దర్శనాన్ని అందరికీ అందుబాటులోకి తేవడం అనేది టీటీడి ప్రభుత్వాల బాధ్యత.ఈబాధ్యతను నెరవేర్చడంలో ఈదర్శన్ కేంద్రాల పునఃప్రారంభం ఒక ముఖ్యమైన చర్య. సాంకేతికతను నమ్మడం మంచిదే అయినా, అది సమానంగా అందరికీ ఉపయోగపడేలా ఉండాలి. అందుకే, తిరిగి ఈ కేంద్రాలను ప్రారంభించి, భక్తుల అవసరాలకు స్పందించే విధంగా ఒకప్రజాభిమాన వ్యవస్థను ఏర్పరచాలి. టీటీడీ ధర్మకర్తల మండలి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలి. •

# మద్యం విక్రయాలపై ఉక్కుపాదం మోపాలి

కామిడి సతీష్ రెడ్డి

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో, పట్టణాలలో పుట్టగొడుగుల్లా బెల్టు దుకాణాలు మద్యాన్ని విక్రయిస్తున్నాయి. మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతూ వున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా ఏరులై పారుతున్నా అన్నీ తెలిసినా అటువైపు కన్నెత్తి చూడకుండా ఎక్సైజ్ అధికారులు వ్యవహరించడం జరుగుతుందని ఆరోపణలు వినవస్తున్నాయి. అన్ని జిల్లాలలో బెల్టుషాపుల దందా జోరుగా సాగుతోంది. కిరాణాదుకాణం నుంచి మొదలుకొని నివాసగృహాలు, పాన్‌షాపులు, కల్లు కాంపౌండ్‌ల సమీపంలో మద్యం ఏరులై పారుతోంది. భవననిర్మాణ కార్మికులు, కూలీలు, హోటల్‌లు, ఇసుక రవాణా కార్మికులకు తెల్లవారు జామునే మద్యం అందిస్తూ బెల్టు దందాను మూడు క్వార్టర్లు, ఆరు ఆఫ్‌లుగా సాగిస్తున్నారు. గతంలో వైన్ షాపుల పరిసరాలలో కొనసాగిన ఈ దందా ప్రస్తుతం గల్లీకొకటి ఏర్పాటు కావడంతో మద్యం ప్రియులు ఉదయం టీ, కాఫీలకు బదులుగా మద్యాన్ని తాగుతూ ఎక్కడపడితే అక్కడ పడిపోతూ గాయాలపాలవుతున్నారు. కొన్ని ప్రాంతాలలో ప్రత్యేకంగా ఉదయం పూట వాహనాలలో తీసుకువచ్చి, ఆ ప్రాంతంలోనే ఓ కల్లు కాంపౌండ్ పరిసరాలలో పలువురు పాన్ షాపులు ఏర్పాటుచేసి అందులో బెల్టుదుకాణం నడిపిస్తున్నారు. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు తెలిసినా అటువైపు కన్నెతి చూడడం లేదనే విమర్శలు ఉన్నాయి. గుడుంబా విక్రయాలు మానేసిన వారికి ప్రభుత్వం ఓవైపు స్వయం ఉపాధి మార్గాలతో జీవనోపాధి కల్పిస్తుంటే, మరో వైపు బెల్టు దుకాణాలు పల్లెలు, పట్టణ ప్రజలను మత్తులో ముంచుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో బెల్టు దుకాణాలు కొనసాగుతున్నా చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. లిక్కర్ డాన్లు వివిధ జిల్లాల్లో కమీషన్లకు బెల్టు షాపుల వారికి మద్యం సరఫరా చేస్తున్నారు. రోజుకు ఎంత అమ్మితే అంత కమీషన్లు అందిస్తుండడంతో బెల్టుషాపుల నిర్వాహకులు ఒకరిని చూసి మరొకరు ఈ దందాను జీవనోపాధిగా చేసుకుంటున్నారు. ఉదయం




నుంచి సాయంత్రం వరకు ఈ దందాను బహిరంగంగా కొనసాగిస్తూ ప్రజలను మత్తులో ముంచుతున్నారు. ఆ మద్యం తాగిన వ్యక్తులు వాటికి బానిసలై తమ ఆరోగ్యాలను పాడుచేసుకుంటున్నారు. ఒకప్పుడు నగరాలు,పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఈ దందా ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోనూ విచ్చలవిడిగా కొనసాగుతోంది. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో బెల్టు దుకాణాలపై ఉక్కుపాదం మోపుతున్నామని అధికారులు ప్రకటిస్తుంటే మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో యథేచ్చగా బెల్టుదుకాణాలు కొనసాగుతున్నాయి. కొత్త మద్యం విధానం అమల్లోకి వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే గ్రామాల్లో బెల్టుదుకాణాలు జోరందుకున్నాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలోనే మద్యం షాపులు కొనసాగుతున్నాయి. వివిధ మండలంలలోని కొన్ని గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని గ్రామస్థులు ఏకగ్రీవ తీర్మానం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రెండు లక్షల బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని తెలుస్తుంది. అందులో బాటిళ్లను ఎంఆర్‌పీ కంటే రూ.50 నుంచి రూ.100 వరకు ఎక్కువకు విక్రయిస్తున్నారు. కొందరైతే వాహనాలను ఉదయం సమయంలో తీసుకువచ్చి అడ్డకూలీలకు, ఇసుక ట్రాక్టర్ల మీద వెళ్లే కూలీలకు అమ్మకాలు జరుపుతున్నారు. వివిధ ప్రాంతాల్లోని కల్లు కాంపౌండ్ల వద్ద గల కిరాణా దుకాణాలలో కల్తీమద్యం అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని తెలుస్తోంది. అన్ని జిల్లాలలో ఈ దందా సంగతి తెలిసిన సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నిరేత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. కొందరు సిబ్బందికి ప్రత్యేకంగా వారం, నెలకు చొప్పున ముడుపులు అందుతుండడంతో ఏదైనా ఫిర్యాదు రాగానే బెల్టు షాపుల నిర్వాహకులకు సమాచారం అందించి తనిఖీల విషయాలను చేరవేస్తున్నారు. దీంతో అప్రమత్తం అవుతున్న బెల్టు షాపుల వారు తనిఖీలలో ఏమీ దొరకకుండా జాగ్రత్త పడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే ఈ బెల్టుదందాకు అడ్డుకట్ట పడడమే కాకుండా ప్రజల ఆరోగ్యాలకు రక్షణ కల్పించిన వారవుతారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.యువత మాత్రం నిత్యం వీటికి బానిసై ఒళ్లు గుల్ల చేసుకుని భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారు.ప్రజల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుంది.ఇకనయినా ప్రభుత్వం, సంబంధిత అధికారులు దృష్టి సారించాలి.బెల్ట్ షాప్ నిర్వాహకుల మీద ఉక్కుపాదం మోపాలి. •

# ట్రంప్ వాణిజ్య పన్నుల వార్ డైలాగ్‌లకే పరిమితమా?

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ఇటీవల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్ ఉక్రెయిన్, రష్యా దేశాల మధ్య యుద్ధ విరమణకు మధ్యవర్తిత్వానికి చేసిన పరిస్థితులు అనుకూలించకపోవడంతో, అత్యంత శక్తివంతమైన రష్యా దేశాన్ని ఒప్పించలేక చివరకు అమెరికా ఉత్పత్తులపై అంతర్జాతీయంగా వాణిజ్య వ్యాపార ఎగుమతులు దిగుమతులపై అధిక శాతం సుంకం(టారిఫ్ ) విధిస్తున్నట్లు ప్రకటించడం, రష్యా ఆర్థిక వ్యవస్థనీ పరోక్షంగా దెబ్బతీసే విధంగా ఇలాంటి వ్యాఖ్యలు చేసినట్టు ఉన్నాయా అనేవాదనలు తెరపైకి వస్తున్నాయి. అంతేకాదు రష్యాతో ప్రత్యక్ష, పరోక్ష వ్యాపార వాణిజ్య సంబంధాలు కలిగిన భారత్, బ్రెజిల్, చైనా తదితర దేశాలు ఉక్రెయిన్ రష్యా మధ్య జరుగుతున్న యుద్ధం ముగించే విధంగా రష్యాపై ఒత్తిడి చేయాలని, లేకుంటే భారత్, బ్రెజిల్, చైనా దేశాలపై వాణిజ్య సుంకాలు వంద శాతం విధిస్తామని బెదిరించే రీతిలో ట్రంప్ వ్యాఖ్యలు చేయడం విమర్శలకు తావు ఇచ్చే విధంగా లేకపోలేదు. ప్రపంచ దేశాలకు అమెరికానే పెద్ద దిక్కు అన్నట్టు ట్రంప్ అప్పుడప్పుడు దేశాల మధ్య నెలకొన్న వివాదాల్లో మధ్యవర్తిత్వం వహిస్తూ సమస్య పరిష్కారానికి తాను అనుకునే రీతిలో ప్రయత్నించి, చెప్పితే వినని దేశాలపై అమెరికా ఉత్పత్తులపై పన్ను (టారిఫ్) అధికంగా విధిస్తామని, చెప్పినట్టు వినే దేశాలకు పన్నురాయితో పాటు ఆయుధ సంపత్తిని విక్రయిస్తామని ఏమైనా చేసుకోండి అనే రీతిలో ట్రంప్ వ్యవహార శైలి ఉంటుందా అనే సందేహాలు కలగక మానవు. తరచుగా అమెరికా అధ్యక్షుడు నుండి వస్తున్న పదం టారిఫ్ అంటే అంతర్జాతీయంగా వ్యాపార వాణిజ్య రంగాలలో తమ దేశ ఉత్పత్తుల్లో ఎగుమతులు దిగుమతులలో విధించే సుంకం లేదా పన్ను. ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవిని పొందిన అనంతరం వాణిజ్య వ్యాపార సంబంధాల్లో అంతర్జాతీయంగా ఉన్న అమెరికా ఉత్పత్తుల ఎగుమతి దిగుమతుల విషయంలో తమకు అనుకూలంగా లేని దేశాలపై ఒక రకమైన టారిఫ్, అనుకూలంగా ఉన్న దేశాలపై తక్కువ శాతంటారిఫ్ విధానాన్ని అవలంబిస్తూ, దేశాల వాణిజ్యాన్ని నియంత్రించడానికి ద్వంద వైఖరితో ప్రత్యక్షంగా పరోక్షంగా అంతర్జాతీయంగా ప్రపంచ దేశాలపై అమెరికా ఆధిపత్యాన్ని ప్రతిబింబించేలా ట్రంప్ ప్రయత్నిస్తున్నడా అనే సంశయం కలగక మానదు. అయితే రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని నివారించడానికి భారత్ ,బ్రెజిల్ ,చైనాలు తప్పనిసరిగా రష్యాను ఒప్పించాలని లేనిపక్షంలో అధిక టారిఫ్‌కు సంబంధించిన దేశాలపై అధిక శాతం విధిస్తామనడం ట్రంప్ వైఖరి ముమ్మాటికి సరి అయినదా కాదా అనే భిన్న వాదనలు లేకపోలేదు. భారత్, బ్రెజిల్, చైనా లాంటి స్వతంత్ర దేశాలు స్వయంగా నిర్ణయాలు తీసుకుంటాయి కానీ, అమెరికా ఒత్తిళ్లకు బెదరింపులకో తలొగ్గవనే విషయాన్నిఅమెరికా గ్రహించాల్సి వస్తుందేమో. అవసరమైతే భారత్ లాంటి దేశాలు అమెరికా ఉత్పత్తుల దిగుమతులను సాధ్య మైనంతగా తగ్గించి, స్వదేశీ ఉత్పత్తులను పెంచుకొని తమ దేశ




ఆర్థిక వ్యవస్థపై అమెరికా ఆంక్షల ప్రభావం చూపకుండా తమ దేశ ప్రయోజనాల కొరకు తమకు సహకరించే దేశాలతో వాణిజ్య వ్యాపారాలు కొనసాగిస్తాయి. అంతేకానీ అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని దేశాల మధ్య అంతర్గత యుద్ధాల్లో అనవసరంగా ఏకపక్షంగా ఎలాంటి సూచనలు సలహాలు చేయవలసిన అవసరం లేదనే అభిప్రాయాన్ని భారత్ లాంటి దేశాలు పరోక్షంగా వ్యక్తపరుస్తుండడం విశేషం. అమెరికా ఏమి అనుకున్నదో ఏమోకానీ ఎవరు ఏది చెప్తే అది వినడానికి రష్యాదేశం ఏమైనాఇజ్రాయిల్, ఇరాన్, పాకిస్థాన్ లాంటి దేశాలవలె కాదు కదా.ఆసియా ఖండంలో బలమైన దేశాలుగా ఉన్న భారత్ లాంటి దేశాలు తమ దేశ ప్రయోజనాల కోసం సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఉంటుంది. అవసరమైతే తప్ప ఇతరుల జోక్యాన్ని పూర్తిగా తోసిపుచ్చే విధానం నిర్దిష్టమైన విదేశాంగ విధానం భారత్ లాంటి దేశాలకు ఉన్నదని అమెరికాకు తెలియదా ఏమి. అలాంటప్పుడు అమెరికా ఒత్తిడితో భారత్ లాంటి దేశాలు అనవసరంగా వేరొక దేశ అంతర్గత విషయాల్లో జోక్యానికి ఎందుకు ప్రయత్నిస్తాయి అనే ప్రశ్నలు తలెత్తక మానవు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విదేశాంగ విధానంలో సరికొత్తపోకడలకు భాష్యాన్ని ఇస్తున్నట్టు, ప్రతి విషయాన్ని వాణిజ్య వ్యాపారంలో అధిక పనుల విధానంతో ముడి పెడుతుండడం విశేషం. అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికల ముందు డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రావడానికి ఏకంగా తనకేవ్వరు ప్రపంచంలో శత్రువులు లేనట్లు తన మాటను వినేవారే అధికమంటూ, యుద్ధాలను అధికారంలోకి రాగానే క్రమంగా ఆపిస్తానని రష్యా అధ్యక్షునితో తనకు మంచి సంభాషణే ఉన్నట్లుఅప్పట్లో వార్తలువచ్చాయి. అయితే డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవి కైవసం చేసుకున్న తర్వాత ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలను ఆపడమేమో గానీ, ఇజ్రాయిల్ పాలస్తీనా హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపించే ప్రయత్నంలో ఏకంగా ఇజ్రాయిల్‌తో కలిసి ఇరాన్‌పై అమెరికా దాడి చేయవలసిన ఆవశ్యకత ఏర్పడింది. అనంతరం జరిగిన పరిణామాలలో ఇజ్రాయిల్ ఇరాన్ మధ్య కాల్పుల విరమణకు తానే కారకున్ని అని చెప్పుకుంటూ వచ్చిన డోనాల్డ్ ట్రంప్ టెర్రరిస్టులకు బహిరంగంగానే ఆశ్రయం ఇస్తున్న పాకిస్థాన్ పైభారత్ తీసుకున్న చర్యలు నిర్దిష్టంగా ఉన్నప్పటికీ భారత్ పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపించానని యుద్ధం ఆపకుంటే వాణిజ్యపరమైన ఆంక్షలు విధిస్తాం అనగానే యుద్ధం ఆగిపోయిందని ట్రంప్ అంతర్జాతీయ వేదికలపై చెప్పిన విషయం విధితమే. ఏది ఏమైనప్పటికీ ట్రంప్ రష్యా. ఉక్రెయిన్‌మధ్య యుద్ధం ఆగిపోవాలని కోరుకోవడం సహజమే. నిజానికి ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాల వల్ల భారీగా ప్రాణ ధన నష్టాలను ప్రత్యక్షంగా చూస్తున్న ప్రజలకు డోనాల్డ్ ట్రంప్ వ్యవహార శైలి కొంత ఆశాజనకంగా గోచరించవచ్చు కానీ ప్రపంచ శాంతికి తానే ముందు వరుసలో ఉన్నట్లు వ్యవహరించాలనుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచంలో దేశాల మధ్య యుద్ధ వాతావరణాన్ని నివారించడానికి టారిఫ్ విధానాన్ని ఆయుధంగా మలచుకొని సామవేద దండోపాయలతో దేశాలపై ఒత్తిడి పెంచి యుద్ధాలను ఆపాలని చేస్తున్న ప్రయత్నాలు ఏ మేరకు సఫలీకృతం అవుతాయో లేదో వేచి చూడాల్సిందే. •

# ఉభయ సభల్లో విపక్షాల ఆందోళనలు

## గందరగోళంతో సభ నేటికి వాయిదా!

## ధన్‌ఖడ్ రాజీనామా, బీహార్ ఓటర్ల జాబితాల సవరణపై చర్చకు పట్టుపట్టిన విపక్షాలు

### విపక్షాల వాయిదా నోటీసులను తిరస్కరించిన హరివంశ్



**న్యూఢిల్లీ, జూలై 22:** ఆపరేషన్ సిందూర్ తదితర అంశాలపై చర్చించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీలు నిరసనలు వ్యక్తం చేయడంతో మంగళవారం లోక్‌సభ కార్యకలాపాలు వాయిదా పడ్డాయి. కాంగ్రెస్ సహా ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ, ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళనలు చేయడంతో, దిగువ సభ కార్యకలాపాలను తొలుత మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. అయితే తిరిగి సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు నిరసనలు కొనసాగించడంతో, స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. ప్రతిపక్ష పార్టీల ఆందోళనల మధ్య రాజ్యసభ కార్యకలాపాలు మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా పడ్డాయి. రాజ్యసభ ఛైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సోమవారం రాత్రి ఆకస్మిక రాజీనామా చేయడంపై ప్రతిపక్ష సభ్యులు ఆందోళన మధ్య ఎగువ సభ ఉదయం కార్యకలాపాలు మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడ్డాయి. తరువాత కూడా నిరసనలు కొనసాగడంతో మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ సమావేశాలకు అధ్యక్షత వహించారు. ధన్‌ఖడ్ రాజీనామా, బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ అంశాలపై చర్చ చేపట్టడానికి ప్రతిపక్షాలు ఇచ్చిన వాయిదా నోటీసులను హరివంశ్ తిరస్కరించారు.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రెండో రోజు ప్రారంభమయ్యాయి. అయితేఉభయ సభల్లోనూ ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగడంతో గందరగోళం నెలకొంది. తొలిరోజున ప్రతిపక్షాలు పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు డిమండ్ చేయడంతో ఉభయసభలు వాయిదా పడిన సంగతి తెలిసిందే. తొలిరోజు నిరసనల మధ్యనే రాజ్యసభ షిప్పింగ్ డాక్యుమెంటేషన్ చట్టాలను ఆధునీకరించే లాడింగ్ బిల్లును విజయవంతంగా ఆమోదించింది. ఈ బిల్లు లోక్‌సభలో ఇప్పటికే ఆమోదం పొందింది. సమావేశాల మొదటి రోజున హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్‌సిన్హాపై మోపిన అభిశంసనపై రాజ్యసభలో ప్రసంగించిన అనంతరం ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. జులై 21న ప్రారంభమైన వర్షాకాల సమావేశాలు ఆగస్టు 21 వరకు జరగనున్నాయి. ఆగస్టు 12 నుండి ఆగస్టు 17 వరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల విరామం ఉంటుంది. ఆగస్టు 18న తిరిగి సమావేశాలు ప్రారంభం కానున్నాయి.

ఇదిలా ఉండగా తాజాగా జస్టిస్ యశ్వంత్ వర్మపై మోపిన అభిశంసన తీర్మానంపై ఐయుఎంఎల్ ఎంపిఇటి మహ్మద్ బషీర్ మాట్లాడుతూ, ఈ అభిశంసన చాలా ముఖ్యమైనది. ఆ న్యాయమూర్తి వ్యవహారాల కారణంగా భారత న్యాయ వ్యవస్థ స్థితి మరింత దిగజారింది. అందుకే తాము దీనిపై మెమోరాండంను స్పీకర్‌కు సమర్పించామన్నారు. ప్రభుత్వం దీనిపై స్పందిస్తుందని ఆశిస్తున్నామని బషీర్ పేర్కొన్నారు.



# గాజాలో యుద్ధం ఆగాల్సిందే

## 25 దేశాల సంయుక్త ప్రకటన

### 59 వేలు దాటిన పాలస్తీనియన్ల మరణాలు

**లండన్, జూలై 22 :** గాజాలో యుద్ధం ఆగి తీరాలని, అంతర్జాతీయ చట్టాలను ఇజ్రాయెల్ గౌరవించాలని బ్రిటన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, కెనడా, జపాన్‌లతో సహా మొత్తం 25 దేశాలు సోమవారం ఒక సంయుక్త ప్రకటన వెలువరించాయి. కొనసాగుతున్న దాడుల కారణంగా గాజాలో సామాన్యుల కష్టాలు మరింతగా పెరిగాయని ఆయా దేశాల విదేశాంగ మంత్రులు పేర్కొన్నారు. చాలీచాలని సాయం అందించడమే కాక, కనీస అవసరాలైన ఆహారం, నీళ్ల కోసం వేచి వున్న అమాయక ప్రజలను, మహిళలు, పిల్లలను విచక్షణారిహతంగా హతమార్చడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. 'ఇజ్రాయెల్ ప్రభుత్వం అనుసరిస్తున్న సహాయ పంపిణీ విధానం అత్యంత ప్రమాదకరం. ఇది అస్థిరతను పెంపొందించడంతోపాటు గాజా వాసుల కనీస మానవ గౌరవాన్ని హరిస్తోంది' అని సంయుక్త ప్రకటన తెలియజేసింది.

గాజాలోని అన్నార్తుల పట్ల ఇజ్రాయెల్ అనుసరిస్తున్న వైఖరిని ఐరాస తీవ్రంగా ఖండించింది. ఆహార కేంద్రాల వద్ద వచ్చే వారిపై ఇజ్రాయెల్ ఆర్మీ యథేచ్ఛగా కాల్పులు జరుపుతోందంటూ మండిపడింది.

ఆదివారం ఒక్కరోజే 80 మంది ఉసురు తీయడాన్ని ప్రస్తావించిన ఐరాస ఆహార విభాగం (డబ్ల్యుఎఫ్‌పి).. పాలస్తీనియన్ల పాలిట భయంకరమైన రోజుల్లో ఒకటని అభివర్ణించింది.

సెంట్రల్ గాజాలోని నెట్‌జరిమ్ కారిడార్ వద్ద గుంపుగాచేరిన పాలస్తీనియన్లపైజరిపిన కాల్పుల్లో ఇద్దరు చనిపోయారు. హమాస్‌శ్రేణులు లక్ష్యంగా 21 నెలలుగా యథేచ్ఛగా ఇజ్రాయెల్ ఆర్మీ సాగిస్తున్న దాడుల్లో మరణాలు 59 వేలు దాటాయని గాజా ఆరోగ్య విభాగం సోమవారం తెలిపింది. 2023 అక్టోబరు 7 నుంచి సాగిస్తున్న దాడుల్లో క్షతగాత్రుల సంఖ్య 1,42,135కు చేరుకుందని వివరించింది.

# ఎట్టకేలకు కేరళను వీడిన బ్రిటన్ ఫైటర్ జెట్

**తిరువనంతపురం, జూలై 22:** సాంకేతిక సమస్యల కారణంగా కేరళలోని తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో నెల రోజులుగా నిలిచిపోయిన బ్రిటిష్ రాయల్ నేవీ ఎఫ్-35 బి స్టెల్త్ యుద్ధ విమానం ఎట్టకేలకు టేకాఫ్ అయ్యింది. మంగళవారం ఉదయం కేరళను వీడింది. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన యుద్ధ విమానాల్లో ఒకటైన బ్రిటన్ దేశానికి చెందిన ఎఫ్-35 బి 40 రోజులుగా కేరళలోని తిరువనంతపురం ఎయిర్‌పోర్టులోనే నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఇండో-యుకె నేవీ విన్యాసాల్లో పాల్గొన్న ఈ ఎఫ్-35బి విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దాంతో ఆ విమానాన్ని జూన్ 14న అర్థరాత్రి తర్వాత తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో దించేశారు. తొలుత ప్రతికూల వాతావరణం, ఇంధన కొరత కారణంగా విమానాన్ని అత్యవసరంగా దించినట్లు వార్తలు వచ్చాయి. కానీ ఆ ఫైటర్ జెట్‌లో ఇంజినీరింగ్ సమస్య తలెత్తినట్లు ఆ తర్వాతే యుకె అధికారులు వెల్లడించారు.

ఈ ఫైటర్ జెట్‌కు ఇక్కడ మరమ్మతులు చేయడానికి వీలుకాకపోవడంతో బ్రిటన్ నుంచి నిపుణులను రప్పించారు. 24 మంది స్పెషల్ ఎక్స్‌పర్ట్స్ బృందం వచ్చి విమానానికి మరమ్మతులు చేపట్టింది. విమానంలోని లోపాలను సరిచేసింది. దీంతో విమానం ఎట్టకేలకు గాల్లోకి ఎగిరింది. దాదాపు ఐదు వారాల తర్వాత మంగళవారం ఉదయం కేరళ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయి బ్రిటన్‌కు బయల్దేరి వెళ్లింది.



# భారత్-పాక్ సరిహద్దుల్లో బిఎస్ఎఫ్ 'డ్రోన్ స్క్వాడ్రన్'

**న్యూఢిల్లీ, జూలై 22:** ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పిఓకెతోపాటు పాక్‌లోని ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అటునుంచి దాయాది దేశం కూడా మనపై డ్రోన్లతో దాడులకు యత్నించింది. దీంతో భారత బలగాలు అప్రమత్తమయ్యాయి. భవిష్యత్తులో ఇటువంటి ప్రయత్నాలను దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా భారత్-పాక్ సరిహద్దులో గస్తీ పెంచడంతోపాటు 'డ్రోన్ స్క్వాడ్రన్'లను ముమ్మరంగా మోహరించే పనిలో నిమగ్నమయ్యాయి. సరిహద్దులో నిర్దిష్ట ఔట్ పోస్టుల్లో ఉండే డ్రోన్ దళాల్లో నిఘాకు సంబంధించి అనేక వ్యవస్థలు ఉంటాయి. ఈ స్క్వాడ్రన్‌లో నిఘాతోపాటు మానవరహిత విమానాలు లేదా డ్రోన్లు ఉంటాయి. ఈ పరికరాలను ఆపరేట్ చేసేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన సిబ్బంది ఇక్కడ విధులు నిర్వర్తిస్తారు. చండీగఢ్‌లోని బిఎస్ఎఫ్ వెస్టర్న్ కమాండ్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఈ బృందాలకు దిశానిర్దేశం చేస్తుంది. రక్షణ పరిశోధన, నిఘా సంస్థలతో ఈబృందాలు కీలకవివరాలను పంచుకుంటాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆపరేషన్ సిందూర్ వంటి పరిస్థితులు తలెత్తి నప్పుడు శత్రు డ్రోన్లపై దీటుగా విరుచుకు పడతాయి.

# గడ్చిరోలిపై అర్బన్ నక్సల్స్ దుష్ప్రచారం

## మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్



**గడ్చిరౌలి, జూలై 22:** విదేశీ నిధులతో గడ్చిరౌలిపై అర్బన్ నక్సల్స్ దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధికి దూరం చేస్తున్నారని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఆరోపించారు. లాయిడ్స్ అండ్ ఎనర్జీ లిమిటెట్ సంస్థ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గడ్చిరౌలి జిల్లాలో జరిగిన వేర్వేరు ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. గడ్చిరౌలిలో నక్సలిజం తగ్గుతోందని, ప్రస్తుతం కొంతమంది నక్సలైట్లు మాత్రమే ఉన్నారని, వాళ్లను వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు అని, ఇక్కడి అడువుల్లో వాళ్లు ఉన్నారని ఆయన అన్నారు. హింసను వీడాలని నక్సలైట్లకు విజ్ఞప్తి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ఫడ్నవీస్ తెలిపారు. ప్రధాన జీవనస్రవంతిలో కలవాలని కోరుతున్నట్లు తెలిపారు.

అయితే తుపాకీ పట్టుకుని తిరిగే నక్సలైట్లు తగ్గుతున్న దశలో.. అర్బన్ నక్సల్స్ సంఖ్య పెరుగుతోందని సిఎం ఫడ్నవీస్ పేర్కొన్నారు. అర్బన్ నక్సల్స్‌పట్ల అలర్ట్‌గా ఉండాలని, వాళ్లు తప్పుడు సమాచారాన్ని చేరవేస్తున్నారని, గడ్చిరౌలిలో స్టీల్ ప్లాంట్ కోసం శంకుస్థాపన చేయగా, మరుసటి రోజే సోషల్ మీడియాలో దుష్ప్రచారం మొదలుపెట్టారని, గిరిజనులను చంపుతున్నారని ప్రచారం చేస్తున్నట్లు సిఎం ఆరోపించారు. భారీ స్థాయిలో అడవుల్ని నరికివేస్తున్నట్లు ప్రచారంచేస్తున్నారని ఆయన అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం ప్రభుత్వం పని చేస్తుంటే.. ఎలా వ్యతిరేక ప్రచారం చేపడుతున్నారని ఆయన అడిగారు.

మహారాష్ట్రకు సంబంధం లేని వ్యక్తులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని, ఇద్దరు కోల్‌కతాలో ఉన్నారని, మరో ఇద్దరు బెంగళూరులో ఉన్నారని, వాళ్లు విదేశీ నిధులతో.. సోషల్ మీడియా పోస్టులతో ప్రజల్ని రెచ్చగొడుతున్నారని సిఎం ఫడ్నవీస్ పేర్కొన్నారు. అబద్ధాలు చెబుతూ అర్బన్ నక్సల్స్ గడ్చిరౌలిని అభివృద్ధికి దూరం చేస్తున్నారని ఆయన తెలిపారు.

# ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 9.74 లక్షల టన్నుల డిఎపి దిగుమతి

## ఎరువుల లభ్యతపై రాజ్యసభలో కేంద్రమంత్రి అనుప్రియ పటేల్ ప్రకటన



**న్యూఢిల్లీ, జూలై 22:** దేశీయ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారతదేశం 9.74 లక్షల టన్నుల డై-అమ్మోనియం ఫాస్ఫేట్ (డిఎపి)ని దిగుమతి చేసుకుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుత సంవత్సరానికి డిఎపి దిగుమతికి గణాంకాలను కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియపటేల్ రాజ్యసభలో వెల్లడించారు. దేశం ఏప్రిల్‌లో 2.89 లక్షల టన్నులు, మేలో 2.36 లక్షల టన్నులు, జూన్‌లో 4.49 టన్నులు దిగుమతి చేసుకుందని చెప్పారు.

2024-25 ఆర్థికసంవత్సరంలో 45.69 లక్షల టన్నులు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 55.67 లక్షల టన్నులు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 65.83 లక్షల టన్నులు, 2021-22 ఆర్థిక సంవత్సంలో 54.62 లక్షల టన్నులు, 2020-21 ఆర్థిక సంవత్సరంలో 48.82 లక్షల టన్నులు దిగుమతి చేసుకుందని వివరించారు. యూరియాను 2024-25లో 56.47 లక్షల టన్నులు, 2023-24లో 70.42 లక్షల టన్నులు, 2022-23లో 75.80 లక్షల టన్నులు, 2021-22లో 91.36 లక్షల టన్నులు, 2020-21లో 98.28 లక్షల టన్నులు దిగుమతి చేసుకున్నట్లు వివరించింది.

ఖరీఫ్ నేపథ్యంలో రైతుల అవసరాలను తీర్చేందుకు అవసరమైన ఎరువులు ఉన్నాయని తెలిపారు.

ఖరీఫ్ సీజన్‌లో రసాయన ఎరువుల అవసరం గతేడాది కంటే ఎక్కువగా ఉందన్నారు. రుతుపవనాలతోపాటు సాగు విస్తీర్ణం పెరిగింది. ఏప్రిల్ 2010 నుంచి కేంద్రం ఫాస్ఫేటిక్, పొటాసిక్ (పిఅండ్‌కె) ఎరువుల కోసం పోషక ఆధారిత సబ్సిడీ (ఎన్‌బిఎస్) విధానాన్ని అమలుచేసింది.

ఎరువుల డిమాండ్, ఉత్పత్తి మధ్య అంతరాన్ని దిగుమతుల ద్వారా తీరుస్తామని కేంద్రమంత్రి అనుప్రియ పటేల్ చెప్పారు. భౌగోళిక రాజకీయ కారణంగా సరఫరా గొలుసులో ఎదురైన అంతరాయాల ప్రభావాన్ని తగ్గించేందుకు.. ఎరువుల కంపెనీలు నిరంతరాయంగా సరఫరాను చేసేలా డిఎపి ఉత్పత్తి చేసే దేశాలతో దీర్ఘకాలిక ఒప్పందాలను కుదుర్చుకున్నాయి.

# ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన మహిళ

## ఇంట్లో గొయ్యితీసి పూడ్చేసి పరార్

**ముంబై, జూలై 22:** ప్రియుడి సాయంతో భర్తను చంపి, ఇంట్లోనే పూడ్చిపెట్టిన ఓ మహిళ .. ఆ తర్వాత గుట్టుచప్పుడు కాకుండా ప్రియుడితో పారిపోయింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ దారుణ ఘటన మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధనివ్‌బాగ్ ప్రాంతానికి చెందిన విజయ్ చౌహాన్ (34), చమన్ అలియాస్ గుడియాదేవి (32) పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం వారికి రెండేళ్ల కుమారుడు ఉన్నారు. అయితే గుడియాదేవి తమ పొరుగునే ఉన్న మోనువిశ్వకర్మ (33)తో వివాహేతర సంబంధాన్ని ఏర్పరుచుకుంది. దీంతో వారిద్దరూ తమకు అడ్డుగా ఉన్న విజయ్ చౌహాన్‌ను చంపడానికి ప్రణాళిక వేసుకున్నారు. దాదాపు 15 రోజుల క్రితం వీరిద్దరూ విజయ్‌ను హత్యచేసి, అతని ఇంట్లోనే గొయ్యి తీసి పాతిపెట్టారు. తర్వాత ఎవరికీ అనుమానం రాకుండా ఉండడానికి అక్కడ కొత్త టైల్స్‌తో కప్పి ఏమీ తెలియనట్లుగా ఉన్నారు.

అయితే ఈ కేసు ఎలా వెలుగులోని వచ్చిదంటే.. విజయ్ తోబుట్టువులు ఓ ఇల్లు కొనాలని అనుకుని డబ్బులకోసం వారు విజయ్‌కు ఫోన్ చేయగా, ఎన్నిసార్లు ఫోన్ చేసినా విజయ్ స్పందించలేదు. దీంతో వారు తమ సోదరుడి ఇంటికి వెళ్లి ఆరా తీయగా, తన భర్త పని కోసం కుర్లాకు వెళ్లాడని గుడియా చెప్పింది. దీనితో వారు వెళ్లిపోయారు. ఆ తర్వాత విజయ్ తిరిగి ఇంటికి వచ్చాడో, లేదో తెలుసుకోవడానికి ఈ నెల 19న మళ్లీ గుడియాకు ఫోన్ చేశారు. కానీ ఆమె ఫోన్‌ను స్విచ్ ఆఫ్‌చేసి ఉంది. దీంతో విజయ్ సోదరులకు అనుమానం వచ్చి ఇంటికి వెళ్లిచూశారు. ఆమె కనిపించకపో వడంతో పెల్హార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దీంతో రంగంలోకి దిగిన పోలీసులు విజయ్ ఇంటిని పరిశీలించగా, అక్కడ కొత్తగా వేసిన టైల్స్ కనిపించాయి. వాటిని తొలగించి చూడగా, దుర్వాసనవచ్చింది. దీనితో అక్కడ తవ్విచూడగా కుళ్లిపోయిన స్థితిలో విజయ్ మృతదేహం కనిపించింది. ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ముంబయిలోని జెజె ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు.

# ధన్‌ఖడ్ రాజ్యాంగ విలువలను కాపాడారు

## ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ, జూలై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాపై ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాన్ స్పందించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'మీ పదవీ కాలంలో ఉప రాష్ట్రపతి పదవి గౌరవాన్ని అచంచలమైన నిబద్ధతతో నిలబెట్టారు. రాజ్యాంగ విలువలను కాపాడుతూ దయ,నిష్పాక్షికత,సమగ్రతతో భాధ్యతలు నిర్వహించారు. రాజకీయ ఒత్తిడి లేకుండా నిర్భయంగా మీ అభిప్రాయాలను వ్యక్తీకరించారు.గౌరవనీయమైన పాత్ర నుంచి వైదొలగుతున్న మీకు మంచి ఆరోగ్యం, ప్రశాంతమైన జీవనం ఉండాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియచేస్తున్నా' అని పవన్ పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ గత రాత్రి రాజీనామా చేశారు. రాజ్యసభ ఛైర్మన్ హోదాలో పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలిరోజున కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ఆయన రాత్రికల్లా అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు పంపారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి వైదొలగుతున్నట్లు అందులో పేర్కొన్నారు. ఆయన రాజీనామాతో రాజ్యసభ సమావేశాలను ప్రస్తుతానికి డిప్యూటీ ఛైర్మన్‌గా ఉన్న జెడియూ నేత హరివంశ్ నడిపించనున్నారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా భాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే రెండేళ్ళ 344 రోజులకే ఆయన వైదొలగాలని నిర్ణయించుకున్నారు. ధన్‌ఖడ్ ఆదర్శనీయ రాజకీయ వేత్తని పవన్ అన్నారు.

# హాకీ క్రీడాకారిణిపై సామూహిక అత్యాచారంకేసులో నలుగురు కోచ్‌ల అరెస్టు

## ఒడిశా 'సాయ్' సెంటర్‌లో శిక్షణ పొందుతున్న ప్లేయర్

**భువనేశ్వర్, జూలై 22:** ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లాలో 15 యేళ్ల టీనేజ్ హాకీ క్రీడాకారిణిపై కోచ్‌లే సామూహికంగా అత్యాచారానికి పాల్పడిన ఘటన నివ్వెరపరుస్తోంది. ఈ కేసులో నలుగురు హాకీ కోచ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ దారుణం రూర్కెలాలోని సాయ్ (స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా) సెంటర్‌లో చోటుచేసుకుంది. బాధితురాలు గత రెండేళ్లుగా ఈ కేంద్రంలో శిక్షణ పొందుతోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న సాయంత్రం స్థానిక స్టేడియంలో కోచింగ్ సెషన్ ముగిసిన తర్వాత నలుగురు కోచ్‌లు .. ఆ క్రీడాకారిణిని ఒక లాడ్జికి తీసుకెళ్లారు. అక్కడ వారు తనపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు ఆరోపించారు. ఈ విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదరించినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీ రాత్రి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. భువనేశ్వర్ డిసిపి ప్రతీక్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు చర్యలు తీసుకుని నలుగురు శిక్షకులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని వివిధ సెక్షన్లతోపాటు సామూహిక అత్యాచారం, పోక్సో చట్టం సెక్షన్ 6 కింద కేసులు నమోదు చేశారు. సోమవారం కోర్టులో బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఈ సంఘటన క్రీడా వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

# సంక్షిప్తంగా..

## అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదరింపు



**గాంధీనగర్, జూలై 22:** దేశంలో బాంబు బెదిరింపులు కొనసాగుతున్నాయి. తాజాగా అహ్మదాబాద్ విమానాశ్రయానికి ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు సోదాలు చేపట్టారు. విమానాశ్రయంలో బాంబు పెట్టినట్లు అహ్మదాబాద్ క్రైంబ్రాంచ్‌కు మంగళవారం ఉదయం బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఎయిర్‌పోర్ట్‌లో సోదాలు చేపట్టారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికిచేరుకుని బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. అయితే ఇప్పటివరకు జరిపిన సోదాల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ కనిపించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అహ్మదాబాద్ క్రైంబ్రాంచ్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శరద్ సింఘాల్ తెలిపారు.

## రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం, ఐదుగురు మృతి

**జైపూర్, జూలై 22:** రాజస్థాన్‌లో ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. బికనీర్ జిల్లాలోని సిఖ్వాల్ ప్రాంతంలో రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో అయిదుగురు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి 11 గంటల సమయంలో జాతీయ రహదారి 11పై ఈ ఘటన చోటుచేసుకుంది. రాజస్థాన్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు రెండు కార్లలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఖతుష్యం ఆలయ సందర్శనకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వీరు ప్రయాణిస్తున్న కార్లు ప్రమాదానికి గురయ్యాయి. ప్రమాదం తీవ్రంగా ఉండటంతో కార్లు రెండూ నుజ్జునుజ్జు అయ్యాయి. కార్లలో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు విద్యుత్ కట్టర్లను ఉపయోగించాల్సి వచ్చింది. కార్లలో ఉన్న మృతదేహాలను బయటకు తీసేందుకు దాదాపు గంట సమయం పట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మరణించగా మరో వ్యక్తి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు.

## భారత్‌కు అపాచీ ఎటాక్ హెలికాప్టర్లు



**న్యూఢిల్లీ, జూలై 22:** భారత ఆర్మీ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అపాచీ ఎటాక్ హెలికాప్టర్లు చేరుకున్నాయి. హిండన్ ఎయిర్‌బేస్‌లో తొలి విడితగా మూడు హెలికాప్టర్లు అమెరికా మిలిటరీ ట్రాన్స్‌పోర్టు ప్లేన్‌లో హిండన్ ఎయిర్‌బేస్‌కు చేరుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వీటిని పూర్తిస్థాయిలో అసెంబుల్ చేసి తనిఖీలు నిర్వహించాక సైన్యానికి చెందిన ఏవియేషన్ కోర్ విభాగానికి అందించనున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాక వీటిని జోధ్‌పూర్‌కు తరలిస్తారు. అపాచీ హెలికాప్టర్‌లు భారత్‌కు చేరుకోవడంపై సైన్యం హర్షం వ్యక్తంచేసింది. ఇదో ముఖ్యమైలు రాయి అని వ్యాఖ్యానించింది. భారత అమ్ములపొదిలో అత్యాధునిక హెలికాప్టర్ల చేరికతో కార్యనిర్వాహకసామర్థ్యాలు మరింతపెరిగాయని పేర్కొంది. అపాచీ హెలికాప్టర్‌లతోకూడిన ప్రత్యేక స్క్వాడ్రన్‌ను గతేడాది మార్చిలోనే జోధ్‌పూర్‌లో ఏర్పాటు చేశారు.అపాచీ ఎహెచ్-64ఇ అటాక్ హెలికాప్టర్ల కోసం 2020లో అమెరికాతో భారత ఆర్మీ 600 మిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది.

## బీహార్ ఓటర్ లిస్టు నుంచి 51 లక్షల పేర్లు తొలగింపు

**పాట్నా, జూలై 22:** బీహార్ ఎన్నికల జాబితా నుంచి 51 లక్షల పేర్లు తొలగించినట్లు ఎన్నికల కమిషన్ మంగళవారం ప్రకటించింది. ఓటర్లు మరణించడం, వలస వెళ్లడం ఇందుకు కారణాలుగా తెలిపింది. ముసాయితా ఎన్నికల జాబితాలో అర్హులైన ఓటర్లను చేరుస్తామని హామీ ఇచ్చింది. ఆగస్టు 1న ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని ఒక ప్రకటనలో తెలిపింది. 'బీహార్ ఎస్ఐఆర్ ఇంతవరకూ వెల్లడైన నిజాలు' అనే పేరుతో ఎన్నికల కమిషన్ ఇక నోట్ విడుదల చేసింది. ఇంతవరకూ నిర్వహించిన బీహార్ స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో 18 లక్షల మంది ఓటర్లు చనిపోయినట్లు తమ దృష్టికి రాగా, 26 లక్షల మంది వివిధ నియోజకవర్గాలకు మారిపోయారని, రెండుచోట్ల పేరు నమోదు చేసుకున్న వారు 7 లక్షల మంది ఉన్నారని వివరించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజ్యాంగ బాధ్యతగా ఎస్ఐఆర్‌ను నిర్వహిస్తున్నామని ఇసి తెలిపింది.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# తాగునీటి పథకాలకు తక్షణమే పనులు ప్రారంభించాలి

## రూ. 250 కోట్లు జలజీవన్ మిషన్ నిధులు -అధికారులతో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సమీక్ష

**తణుకు, జూలై 22 ( ప్రభాత వార్త)** : తణుకు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తాగునీటి పథకాలకు సంబంధించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్షణమే పనులు చేపట్టాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామీణ మంచినీటి సరఫరా, పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే రాధాకృష్ణ సమీక్ష నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ గ్రాంటులో వాటర్ గ్రిడ్ పనులకు సంబంధించి రూ. 1400 కోట్లు అంచనా వేయగా సుమారు రూ. 250 కోట్లుతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. అత్తిలి మండలంలో సుమారు రూ. 4.50 కోట్లు, ఇరగవరం మండలంలో రూ. 49 లక్షలతో జలజీవన్ మిషన్ ద్వారా పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ. 3.56 కోట్లు నిధులతో సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు అంచనాలు తయారు చేయాలన్నారు. జిల్లా పరిషత్ నిధుల్లో సుమారు రూ. కోటి వ్యయంతో పనులు త్వరితగతిన పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఏఈలు పాల్గొన్నారు.



# లక్ష్యాలు సాధించని

## పి. హెచ్.సి. వైద్యాధికారులపై కలెక్టర్ ఆగ్రహం.

### - జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం జులై 22 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ మంగళవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖల పని తీరుపై వైద్యాధికారులు, ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, పి హెచ్ సి డాక్టర్లు, సూపర్వైజర్లు, సిడిపిఓలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో రోగులకు ప్రభుత్వ ఆసుపత్రులలో అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రుల్లో ప్రసవాలు, మాత –శిశు ఆరోగ్యం, గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న పౌష్టికాహారం, మౌలిక సదుపాయాలు, ఆపరేషన్లు, ల్యాబ్ పరీక్షలు తదితర అంశాలపై సమీక్షించారు. సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.జి.గీతాబాయి, డి సి హెచ్ ఎస్ డా.పి.సూర్యనారాయణ, ఐసిడిఎస్ పిడి డి.లక్ష్మి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ తొలుత పిహెచ్సి ల వారీగా ఎక్కడ



లక్ష్యాలు, సాధన పై సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రతినెల సమీక్షిస్తున్న లక్ష్యసాధనలో కొన్ని పీహెచ్సీలు వెనుకబడటంపై తీవ్ర అసహనాన్ని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లు, వైద్యులు, ఆసుపత్రి సూపరింటెండెంట్లు, సిడిపిఓలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితర్లు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా చాగరపల్లి వంతెన

- గోతులు ఏర్పడి, స్లాబ్ ఊసలు బయటికి కనిపించిన వైనం
- ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్న ప్రయాణికులు
- పాపికొండల విహారయాత్ర ప్రయాణము ప్రమాదమే






**వేలేరుపాడు, జులై 22,ప్రభాత వార్త :** వేలేరుపాడు మండలం చాగరపల్లి, బుర్రతోగు గ్రామాల మధ్య ఉన్న సుమారు ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెన దెబ్బ తినడం వలన గోతులు ఏర్పడి స్లాబు ఊసలు బయటికి తేలి ప్రమాదకర స్థాయికి వంతెన చేరింది. బ్రిడ్జి పైన ఉన్న గోతులను తప్పించుకునే ప్రయత్నంలో ఇరుకు అంచున ప్రయాణం చేస్తున్నారు, ఆదమరిస్తే పెను ప్రమాదం సంభవించే విధంగా పరిస్థితి ఉంది. ఏ సమయంలో ఏం ప్రమాదం జరుగుతుందో అనే భయాందోళనలో ప్రయాణికులు ఆందోళన చెందుతు ప్రయాణం సాగిస్తున్నారు. పాపికొండల విహారయాత్రకు ఈ వంతెన ద్వారానే ప్రయాణం సాగించాల్సి ఉంటుంది. అవగాహన లేని ఈ దారిలో ప్రయాణం చేయడం వల్ల పాపికొండల విహారయాత్రికులు సైతం ప్రమాదాల బారిన పడే అవకాశం ఎక్కువగా కనిపిస్తుంది . నిత్యం వాహనాలు రాకపోకలు జరుగుతూ ఉండే ఈ దారిలో ప్రమాదం సంభవించక ముందే మరమ్మత్తులు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. సంబంధిత అధికారులు ఈ వంతెన పైన దృష్టి సారించాలని, ప్రమాదం జరిగి నిండు జీవితాలు కోల్పోక ముందే వంతెన కి మరమ్మతులు చేయాలని మండల ప్రజలు వాహనదారులు కోరుచున్నారు.

# ఏలూరు జిల్లా బీజేపీ నూతన కార్యవర్గం

**జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త:** ఏలూరు జిల్లా కు నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్ చౌటపల్లి ప్రకటించారు.జిల్లాలోని ఏలూరు నియోజకవర్గంకు ప్రాతినిధ్యం కల్పించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా నెర్సు నాగరాజు(ఏలూరు),బోసు అప్పారావు(నూజివీడు), పిసుపాటి రామ లక్ష్మి (చింతలపూడి),శివ రాజు వసుంధర దేవి(నూజివీడు), వేమూరి శ్రీనివాస్ (చింతలపూడి), గుమ్మడి విష్ణు చైతన్య (దెందులూరు),సహాయం ఏసు బాబు (కైకలూరు), జిల్లా జనరల్ సెక్రటరీలుగా నగరపాటి వి. సత్య నారాయణ (ఉంగుటూరు),గడ్డి రాంబాబు(ఏలూరు), వీరవరపు దుర్గా నివాస్(పోలవరం) జిల్లా సెక్రటరీలుగా సమ్మెట పెద్దింట్లమ్మ (కైకలూరు),ఘంట శ్రీనివాస్ (పోలవరం), గొంటెన సర్వేశ్వరరావు (ఏలూరు), కుర్రా వరప్రసాద్ (చింతలపూడి),చేకూరి గణపతిదేవ వర్మ(ఏలూరు),బార్మాపు దేవి (ఏలూరు),మిద్దె రామలక్ష్మి (ఉంగుటూరు), జిల్లా ట్రెజరర్ గా మాటూరి రవికాంత్(నూజివీడు), జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ గా తోట వరప్రసాద్ (ఏలూరు), జిల్లా ఐటి కన్వీనర్ గా సరణాల దత్త త్రాయ రమణ లను నియమించారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా 37 మందిని ఆయన నిర్వహించారు.

# దశాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు

**మొగల్తూరు జూలై 22 (ప్రభాతవార్త) :**216 నేషనల్ హైవే ఆనుకుని, మొగల్తూరు గ్రామపంచాయతీ పరిధి పెద పల్లవ పాలెం సమీపంలో లాంచీల రేవుకు వెళ్లే రహదారి ప్రక్కన గ్రామస్తులు మరియు పురజను లు చే నిర్మించబడిన శ్రీ దశాంజనేయ స్వామి వారి ఆలయమునందు మంగళవారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా చుట్టుప్రక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు, ఆలయ ఆవరణలో సాయంత్రం 6 గంటల నుండి 9 భజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ వారు తెలియజేసారు



# పాలకొల్లు ను సుందరవణంగా తీర్చిదిద్దేలా కృషి- మంత్రి రామానాయుడు.



**పాలకొల్లు ప్రభాతవార్త :**పాలకొల్లు పట్టణంలో పలు అభివృద్ధి పనులను త్వరితగతిగా పూర్తి చేసి సుందరవణంగా తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆయన మంగళవారం సాయంత్రం పట్నంలో బొండాడ వెంకటరాజు గుప్తా ఎన్టీఆర్ కళాక్షేత్రం, నారా చంద్రబాబు నాయుడు ఉద్యానవనం, హిందూ కైలాస వనం లలో జరుగుతున్న పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయా పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు వారం వారం పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. ప్రధానంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్, గౌడ శెట్టిబలిజ కళ్యాణమండపం, టిడ్కో గృహాలు, ఎన్టీఆర్ కళాక్షేత్రం, రామగుండం పార్కు, అబ్దుల్ కలాం పార్కు, హిందూ కైలాస వనం తదితర పనులను పూర్తి చేసి ప్రజలకు అంకితం ఇవ్వనన్నట్లు మంత్రి రామానాయుడు తెలిపారు. ఆయనతోపాటు మున్సిపల్ కమిషనర్ విజయ సారథి,



మున్సిపల్ ఇంజనీర్ రాజకుమార్, ఏఈ కృష్ణమూర్తి, నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, బోనం నాని, మామిడి శెట్టి పెద్దిరాజు, పొట్నూరి శ్రీనివాసరావు, వట్టం గణేష్, బిరుదుకోట శేఖర్, బేరం శ్రీరామచంద్రమూర్తి, గాది సుబ్బారావు, నాళం బాబి తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పుటేరు వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కామినేని

**కైకలూరు జూలై 21 (ప్రభాతవార్త):** మండలంలోని ఆలపాడు శివారు ఉప్పుటేరు వద్ద కొల్లేరు నుంచి వస్తున్న వర్షపు నీటి ప్రవాహాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ కూటమి నాయకులతో కలిసి సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రపు డెక్క నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా ఉండేటట్టు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నూతన రైల్వే బ్రిడ్జి నిర్మాణం కోసం ఉప్పుటేరులో ఏర్పాటు చేసిన భారీ పునాదుల వల్ల నీటి ప్రవాహం తగ్గుతుందని ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని త్వరలోనే సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో భలే యేసు రాజు, కొల్లి వరప్రసాద్, పూల రాజి,



తాడినాడ బాబు, జై మంగళ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహ ఏర్పాటు పట్ల ఆర్యవైశ్య సంఘం హర్షం....

## -మంత్రి రామానాయుడు ని కలిసి కృతజ్ఞతలు తెలిపిన ప్రతినిధులు



**పాలకొల్లు జులై 22 (ప్రభాతవార్త) :**అమరావతిలో ఆర్యవైశ్య ముద్దుబిడ్డ అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం ఏర్పాటుకు మరియు స్మృతి వనం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వము 6. 5 ఎకరాలు కేటాయించి జి వో ఇచ్చిన సందర్భంగా పాలకొల్లు శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం హర్షం తెలిపింది. ఈ సందర్భంగా పాలకొల్లులో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ను సంఘ ప్రతినిధులు కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్య వైశ్యల కులదైవం శ్రీ వాసవి మాత ఆత్మర్పణ దినోత్సవం రాష్ట్ర ప్రభుత్వం అధికారంగా గుర్తించి ప్రభుత్వం తరుపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం పట్ల మరియు పొట్టి శ్రీరాములు గారి జయంతి ని రాష్ట్ర ప్రభుత్వం అధికారక కార్యక్రమం గా ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వం ఒక పెద్ద పండుగగా రాష్ట్రం అంతా నిర్వహించి ఆర్య వైశ్యులు పట్ల రాష్ట్ర ప్రభుత్వం కు వున్న చిత్తశుద్ధి తెలియజేసినందుకు మంత్రివర్యులు కు కృత్షతలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, మున్సిపల్ శాఖ మంత్రివర్యులు నారాయణ లకు ధన్యవాదములు తెలపడమైనది ఈ కార్యక్రమం లో ఆర్య వైశ్య సంఘ అధ్యక్షులు రేపాక ప్రవీణ్ భాను, ప్రధాన కార్యదర్శి సనిశెట్టి లీలా భవన్నారాయణ, గౌరవ సలహాదారు భోగవిల్లి నాగ భూషణం, ఆంధ్రప్రదేశ్ మహా సభ ఉపాధ్యక్షులు మాటూరి నరసింహామూర్తి, సంఘ ఉపాధ్యక్షురాలు శ్రీఖకొల్లు మైథిలి, ఉపాధ్యక్షులు గమిని శ్రీను, జవ్వాజి రాజ, పల్లంపాటి నాగేశ్వరావు, ఖండవిల్లి రఘు, బచ్చు వెలుగొండయ్య, బోడా కనకరాజు, రేపాక మహేష్, అన్నం జగదీష్, ఇమ్మిడి శ్రీనివాస్, శ్రీఘాకొలపు నరసింహారావు, తదితరులు ఆర్య వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

# మొగల్తూరు పి ఎ సి సి సొసైటీ ప్రత్యేక సమావేశం కోరం లేక వాయిదా

**మొగల్తూరు జులై 22(ప్రభాతవార్త) :**పిఎ సిసి సొసైటీ కార్యాలయం నందు మంగళవారం మధ్యాహ్నం నాలుగు గంటలకు సంఘం పర్సన్ ఇన్చార్జ్ లక్ష్మీ లత అధ్యక్షతన ప్రత్యేక మహాజన సభ సమావేశం ఏర్పాటు చేశారు, ఈ సమావేశానికి కొరం సభ్యులు హాజరు కాకపోవడంతో లక్ష్మీ లత మహాజన సభ సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు, ఈ సందర్భంగా సంఘ సీఈవో కొత్త పల్లి గోవింద రాజులు, గట్టెం శ్రీనివాస్, దాసరి మాణిక్యాలరావు, పడవల సూర్యనారాయణ,




నిప్పులేటి తారక రామారావు, సత్తినేని శ్రీనివాస్ తాతాజీ, సో డం ఏడుకొండలు, తో పాటు పలువురు రైతులు హాజరయ్యారు

# ఒకే రోజు 9 మంది ప్రాణాలు కాపాడిన ఘనత డాక్టర్ కృష్ణ చంద్ కే దక్కింది

## బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురజాడ

**మండవల్లి జులై 22 (ప్రభాతవార్త) :**ఇటీవల కాలంలో ఒకేరోజు రికార్డు స్థాయిలో 18 మందికి యాంజియో గ్రాములు చేసి అందులో అవసరమైన 9 మందికి ఆపరేషన్ చేసి వారి ప్రాణాలను కాపాడిన ఘనత ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కాగిత కృష్ణచంద్ కే దక్కిందని,అలాంటి వ్యక్తికి సత్కారం చేయడం మనందరి అదృష్టమని కైకలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు, దత్తాశ్రమం ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గురజాడ ఉదయ్ శంకర్ ప్రశంసించారు. మంగళవారం మండవల్లి మండలం లోకుమూడి దత్తాశ్రమం నందు అబ్దుల్ కలాం అవార్డ్ గ్రహీత,ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కాగిత కృష్ణచంద్ కి చిరు సత్కారం చేశారు. ముందుగా ఆయనకు శాలువా కప్పి పూలమాలవేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గురజాడ ఉదయ శంకర్ మాట్లాడుతూ వైద్యులు కృష్ణ చంద్ మన ఆంధ్రప్రదేశ్లోనే కాక తెలంగాణ, కర్ణాటక, తమిళ్నడు రాష్ట్రాల నుండి వచ్చిన క్రిటికల్ గుండె సంబంధిత పేషెంట్లకు సత్వర ఆపరేషన్లు చేశారన్నారు.ఇతర అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, లండన్, సింగపూర్ మరియు బంగ్లాదేశ్ నుంచి వచ్చిన క్రిటికల్ గుండె సంబంధిత వ్యాధులైన గుండెలో రంధ్రం లాంటి అనేక ఇతర మొండి జబ్బులకు ట్రీట్మెంట్ ఇచ్చి మెరుగైన వైద్యం అందించారని డాక్టర్ కృష్ణచంద్ సేవలను కొనియాడారు.కార్యక్రమంలో రుద్రపాక రత్నారావు, బండి తులసిరావు, వేంద్ర నాగరాజు, బొల్లా శ్యామల రాజు గౌడ్, బొర్రా సత్యనారాయణ, బొక్కా వెంకటరావు, చిట్టి బొమ్మల కనకదుర్గ, దాసరి శ్రీను,సింహాద్రి కేదార్, వీరంకి సత్యనారాయణ,నాగబాబు,శివ, మామిడి శెట్టి నాగముని,



గెద్దాడ సూర్య ప్రకాష్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైమరీ స్కూల్ కి లయన్స్ క్లబ్ వితరణ

**ఆగిరిపల్లి, జూలై 22 ప్రభాతవార్త :**మండల పరిధిలోని నెక్కలం గొల్లగూడెం ప్రైమరీ స్కూల్ కి లయన్స్ క్లబ్ ఆఫ్ ఇమేజ్ ఆధ్వర్యంలో మంగళవారం ఇమేజ్ లయన్స్ మల్టీ ట్రస్ట్ నాలుగు టేబుల్స్ ను వితరణ గా అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుని చూడమణి తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్బు అధ్యక్షులు పి. శశిధర్ మాట్లాడుతూ ట్రస్ట్ చేసే సేవా కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలకు టేబుల్స్ బహుకరించినట్లు తెలిపారు. ప్రతిభను కనుబరిచిన విద్యార్థులకు మంచి ప్రోత్సాహకాలు కూడా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి టూ కొవ్వలి ఆనంద్ కుమార్, పాఠశాల చైర్మన్ వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు కమరున్నిసా,



వేణు, చౌటుపల్లి సురేష్ కుమార్, లయన్స్ ట్రస్ట్ ట్రెజరర్ శ్రీనివాసచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

# రసాబసాగా గ్రామ టిడిపి అధ్యక్ష ఎన్నికలు



జీలుగుమిల్లి, జూలై–22, ప్రభాతవార్త: మండల కేంద్రం జీలుగుమిల్లిలో మంగళవారం జరిగిన టిడిపి గ్రామ కమిటీ అధ్యక్ష ఎంపికలు తెలుగు తమ్ముళ్ల మధ్య రసభసాగా జరిగాయి మండలంలో 12 పంచాయతీలకు గాను వాటిలో ఏడు పంచాయతీలకు గ్రామ టిడిపి అధ్యక్షులుగా ఏకగ్రీవం కాగా, ఐదు పంచాయతీలు అభ్యంతరాల మధ్య పెండింగ్ పడ్డాయి. మంగళవారం స్థానిక శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద టిడిపి గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పరిశీలకులు రావూరి కృష్ణ, అయినపర్తి వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహణ చేపట్టామని నిర్వహించిన ఎన్నికలలో 12 గ్రామపంచాయతీలకు ఏడు గ్రామపంచాయతీల ఏకగ్రీవం కాగా ఐదు గ్రామపంచాయతీలలో కార్యకర్తల బేదాభిప్రాయాలతో ఎన్నికలు వాయిదా పడినట్లు తెలిపారు. త్వరలో కార్యకర్తల సమన్వయంతో వాటిని పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సంకుపల్లి సాయి, తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షులు ఉండవల్లి సోమ సుందరం, మాజీ జెడ్పిటిసి బాసిన రాజబాబు, ఎంపీటీసీ నాలి శ్రీనివాస్, టిడిపి బీసీ సెల్ మండల అధ్యక్షులు తోట బాలు, ఆకిరెడ్డి ప్రసాద్, చిర్రి వెంకటేశ్వరరావు, బుడిపిటి చిరంజీవి, జాస్తి సత్యనారాయణ, గుడెల్లి లక్ష్మీనారాయణ, తమ్మిన సాంబ, సోయం శేఖర్, అచ్యుతరావు, ఆకిరెడ్డి ప్రసాద్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దంతుపల్లికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తా : ఎమ్మెల్యే ఆరిమిల్లి.

అత్తిలి –జూలై 22 (ప్రభాతవార్త)బీసీల వల్లనే తాను గెలిచానని గొప్పలు చెప్పుకునే మాజీ మంత్రి కారుమూరి బీసీ కాలనీలను అభివృద్ధి చేయలేదని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా అత్తిలి మండలం దంతుపల్లి గ్రామంలో ఇంటింటికీ పర్యటించిన ఎమ్మెల్యే రాధాకృష్ణ గత ఏడాదిగా అందుతున్న సంక్షేమం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీ సర్పంచులను ఎరవేసి పార్టీలో చేర్చుకుని అయిదేళ్లు గడిపేసి కనీసం ఎలాంటి పనులు చేయకుండా వదిలేశారని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీకు కంచుకోటగా అత్తిలి మండలం దంతుపల్లి గ్రామం నిలిచిందని అన్నారు. ఇటీవల ఎన్నికల్లో దాదాపు 70శాతం ఓటర్లు కూటమికి ఓట్లు వేశారని అన్నారు. గ్రామ ప్రజల రుణం తీర్చుకోవడానికి ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలో అనే విషయంపై ప్రణాళికలు చేస్తున్నట్లు చెప్పారు. మొదటి ఏడాదిలోనే రూ. 15 లక్షలు



కేటాయించినట్లు చెప్పారు. అత్తిలి మండలంలో అభివృద్ధిలో మొదటి ప్రాధాన్యత దంతుపల్లి గ్రామానికే ఇస్తానని ఎమ్మెల్యే రాధాకృష్ణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు కదలి రామాంజనేయులు, అత్తిలి ఎంపీపి మక్కా సూర్యారావు, మండల టిడిపి అధ్యక్షులు పోలిశెట్టి చందు, ఆనాల ఆదినారాయణ రావు, బోడపాటి సూర్యచంద్రరావు, శిరగాని నాగేశ్వరరావు, మెంతు రాజకుమార్, ఎంపీడీవో పి. శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## వరిని సరైన పద్ధతిలో నాటి దిగుబడి పెంచుకోండి.

ఆగిరిపల్లి జూలై 22 ప్రభాతవార్త : వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కొత్త ఈదర గ్రామంలో మండల వ్యవసాయ అధికారి అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారంనిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భవాని మాట్లాడుతూ వరి నాట్లు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. వరి నారును సరైన పద్ధతిలో నాటక పోతే వివిధ తెగుళ్లు పురుగుల ఉధృతి పెరిగి పంట దిగుబడుల పై ప్రభావం చూపుతుంది అన్నారు. శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించి ఆరోగ్యవంతమైన నారును తయారు చేసుకొని చదరపు మీటరుకు 33 కుదుళ్ళు చొప్పున నాటినట్లయితే గాలి వెలుతురు బాగా సోకి మొక్క అధిక పిండి పదార్థాలను తయారు చేసుకుంటుంది తద్వారా అధిక దిగుబడులు లభిస్తాయి. నాట్లు వేయడానికి 15 రోజుల ముందే పొలాన్ని దమ్ము చేయడం మొదలుపెట్టి రెండు మూడు దఫాలుగా మురగ దమ్ము చేయాలి పొలమంత సమానంగా దమ్ము చెక్కతో గాని అడ్డతో గాని చదును చేయాలి. నారు తీసేటప్పుడు మొక్కలు లేత పచ్చగా ఉంటేనే మూన త్వరగా తిరుగుతుంది. నాలుగు నుంచి ఆరు ఆకులు ఉన్న నారును ఉపయోగించాలి. నారు వేసేటప్పుడు నారు కొనలను తుంచి నాటుకోవలెను. ముదురు నారు నాటితే దిగుబడి తగ్గుతుంది. నాటు పై పైన వేస్తే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశం ఉంటుంది. నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని బట్టి ఖరీఫ్ లో చ.మీ.కు 33 మూనలు ఉండేలా చూడాలి. బాగా మెత్తగా/ బరువైన నేలల్లో దమ్ము చేసిన 2-10 రోజుల్లోపు నాట్లు వేయడం ముగించాలి. నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్లు బాటలు తీయడం వల్ల పైరుకు గాలి , వెలుతురు బాగా సోకి చీడపీడలు ఉధృతి కొంతవరకు అదుపు చేయవచ్చు. ఎరువులు ,పురుగు మందులు , కలుపు మందులు వేయడానికి ఇంకా పైరు పరిస్థితిని గమనించడానికి ఈ బాటలు బాగా ఉపయోగపడతాయి. అలాగే వరి పండించే రైతులందరూ భీమా చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజగోపాల్ , వ్యవసాయం మరియు ఉద్యాన సహాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

## కృత్రిమ కాళ్ళతో దివ్యాంగులకు పునర్జీవం



ఆగిరిపల్లి జూలై 22 ప్రభాత వార్త : పుట్టుకతో గానీ ప్రమాదంలో గానీ కాళ్ళు పోగొట్టుకున్న దివ్యాంగులకు హీల్ సంస్థ ద్వారా ఉచితముగా లభించే హైటెక్ కృత్రిమ కాళ్ళు పునర్జీవం ఇస్తాయని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెన్షనర్స్ క్లబ్ 200 – విజయవాడ ముఖ్య బాధ్యులు ఎస్. రామకృష్ణ అన్నారు. మండలం లోని తోటపల్లి హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో ఎస్.బి.ఐ. పెన్షనర్స్ క్లబ్ ఆర్థిక సహాయంతో ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పదమూడు మంది దివ్యాంగులకు గాను పద్నాలుగు కృత్రిమ కాళ్ళను క్లబ్ ప్రతినిధుల చేతుల మీదుగా అందచేసిన సందర్భముగా ఆయన మాట్లాడారు. హీల్ సి.ఈ.ఓ. కూరపాటి అజయ్ కుమార్ మాట్లాడుతూ ఎస్.బి.ఐ. పెన్షనర్స్ క్లబ్ వారి ఆర్థిక సహాయంతో ఇప్పటి వరకు 21 మందికి కృత్రిమ కాళ్ళు అమర్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరు రాష్ట్రాలనుండి విచ్చేసిన ముప్పై మంది సభ్యులతో పాటు క్లబ్ కార్యవర్గ సభ్యులు కె.ఆర్.లక్ష్మిపతి రావు, ఎం.ఎస్. దీక్షితులు, జి.కృష్ణమూర్తి, హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

భీమవరం జులై 22 ప్రభాతవార్త :ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రజలు క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా అవగాహన కల్పించడం గొప్ప విశేషమని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి కమలాకర్ అన్నారు. ప్రభుత్వ ప్లాస్టిక్ నిషేధ కమిటీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ ను నిషేధించాలంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమలాకర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్లాస్టిక్‌ను పారదోలి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపు నిచ్చారు. ప్లాస్టిక్ నిషేధ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ గత 4 నెలలుగా పట్టణంలో ప్లాస్టిక్ నిషేధంపై విస్తృతంగా ప్రచారాలు, హెచ్చరికలు



చేస్తున్నామని, కొంతమంది వ్యాపారస్తులకు జరిమానాలు జరిగిందన్నారు. అనంతరం కళాశాల నుంచి గంగులమ్మ అమ్మవారి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారిణి వి లక్ష్మిఎం విద్యార్థులు పాల్గొన్నారు.

## వరిలో యాజమాన్య పద్ధతులు పాటించండి

### - వ్యవసాయ అధికారి శివశంకర్

చాట్రాయి, జూలై 22, ప్రభాతవార్త : వరి నాట్లు వేసేటప్పుడు రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయ అధికారి శివశంకర్ చెప్పారు. మంగళవారం మండలంలోని చనుబండ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వరి నాట్లు వేసే పొలాలను పరిశీలించి రైతులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. వరి నాట్లు వేసే సమయంలో రైతులు వరి పంటకు సూర్యరశ్మి తగిలే విధంగా ప్రతి రెండు మీటర్లకు 20 సెంటిమీటర్లు కాలి బాటలు వేసుకోవాలని తెలిపారు. దూరం ఉండటం వలన గాలి వెలుతురు పంటకు బాగా సోకి వరి దుబ్బు బలంగా కట్టుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. అంతేకాకుండా దీనివల్ల చీడపీడల పీడల బెడద తగ్గుతుందని ఆయన తెలిపారు. పంట రుణాలు తీసుకున్న రైతులు, కౌలు రైతులు కచ్చితంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యువజన పథకం వర్తించే విధంగా ఇన్సూరెన్స్ పైకం చెల్లించాలని ఆయన చెప్పారు. వరి పంటకు ఒక ఎకరానికి 840 రూపాయిలు ఆగస్టు 15వ తేదీ లోపు చెల్లించాలని మినుము పంటకు ఎకరాకు 300 రూపాయలు జులై 31 లోపు చెల్లించాలని ఆయన కోరారు. దీనివల్ల రైతులకు ఎంతగానో లాభం ఉందని ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటకు నష్టం జరిగితే బీమా వర్తిస్తుందని



రైతులు నష్టపోకుండా ఉండే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. పంట నష్టపోయాక రైతులు లబోదిబో అనటం కన్నా ముందుగానే బీమా చెల్లించి ఉంటే రైతుకు భరోసా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చనుబండ సహకార సంఘం అధ్యక్షులు మోరంపూడి శ్రీనివాసరావు, జక్కంపూడి ప్రదీప్, రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలి.

### - డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు

భీమవరం జులై 22 ప్రభాతవార్త : కాంట్రాక్టు లెక్చర్ల సర్వీసు కొనసాగింపుపై తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు అటానమస్ బాలికల కళాశాల, భీమవరం, గణపవరం, దుంపగడప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ తో డి.ఆర్.ఒ.మొగిలి వెంకటేశ్వర్లు సమీక్షించారు. ఐదు సంవత్సరములలోపు సర్వీసు ఉన్న కాంట్రాక్టు లెక్చరర్ లను వారు పని చేస్తున్న కళాశాలలోనే కొనసాగించేలా నిర్ణయించడం జరిగిందన్నారు. అలాగే ఐదు సంవత్సరాలు పైబడి సర్వీసులు పూర్తి చేసుకున్న అధ్యాపకులను ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ అభ్యర్థన మేరకు అదే కళాశాలలో తిరిగి కొనసాగేలా నిర్ణయించడం జరిగిందన్నారు. పేద,



మధ్యతరగతి వర్గాల ప్రజలు చదువుకునే ప్రభుత్వ కళాశాలలోని అధ్యాపకులు వారికి మంచి చదువుని అందించి ప్రయోజకులను చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ సమావేశంలో ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

## జగన్మోహన్ రెడ్డిని తిరిగి సీఎంగా ఎన్నిక అవటం ఖాయం

జంగారెడ్డిగూడెం,ప్రభాత వార్త: వై యస్సార్ సిపి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అయ్యేవరకు పార్టీ శ్రేణులంతా ఐకమత్యంగా కృషి చేయాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెం లోని రాజా రాణి కళ్యాణ మండపంలో మంగళవారం వైసిపి జంగారెడ్డిగూడెం మండల పట్టణ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంనకు చింతలపూడి నియోజకవర్గం పార్టీ ఇంచార్జ్ కంభం విజయరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ కారుమూరి సునీల్ కుమార్,మచిలీపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జ్ జెట్టి గురునాధరావులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది కూటమి పాలనలో సంక్షేమ కార్యక్రమాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. ఈ ఏడాది వైసిపి శ్రేణులపై ఎన్నో తప్పుడు కేసులు పెడుతున్న నాయకులు,కార్యకర్తలు భయపడకుండా పార్టీలోనే ఉన్నారని అభినందించారు. బాబు షూరిటీ మోసం గ్యారెంటీ గురించి పలు ఉదాహరణలు వివరిస్తూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా పోరాటం ఆందోళన చేపట్టాలని కోరారు. తిరిగి జగన్ సీఎం అవ్వటం ఖాయం అన్నారు. సమావేశానికి నాయకులు ముప్పిడి



శ్రీనివాసరావు, చిటికెల అచ్చిరాజు,కొరదమ జ్యోతి, కేసరి సరితా రెడ్డి,బివిఆర్ చౌదరి, మండవల్లి విజయ సారధి,ముప్పిడి వీరాంజనేయులు, కంచర్ల వాసవి రత్నం,మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి, పి.పి. ఎన్ చంద్ర రావు,తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఓరుగంటి నాగేంద్ర, పట్టణ అధ్యక్షులు కర్పూరం గుప్త, గ్రామ,వార్డులలో ఎన్నికైన నూతన కార్యవర్గాలను ప్రకటించి ముఖ్య అతిథితో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచ్ లు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు. సమావేశం విజయవంతం కావటానికి నాయకులు బత్తిన చిన్నా , వామిశెట్టి హరిబాబు,రమణమూర్తి, తదితరులు సహకరించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి పట్టణంలోని అన్ని వార్డుల నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## వాడపల్లిలో భక్తుల సౌకర్యంకోసం కంపార్ట్ మెంట్లు

### - దేవస్థానం డి.సి.నల్లం సూర్యచక్రధరరావు

భీమవరం జులై 22 ప్రభాతవార్త :కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం తిరుమల, షిర్డీ తరహాలో కంపార్ట్మెంట్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్ల సూర్య చక్రధరరావు తెలిపారు. భక్తుల నుండి సమస్యలను,సూచనలను,సలహాలను స్వీకరించేందుకు శుక్రవారం ఏర్పాటుచేసిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఈ అంశాన్ని వెల్లడించారు. భీమవరం నుంచి మురళి అనే భక్తుడు చేసిన ఫోన్ కాల్ కు స్పందించిన సందర్భంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ ఈ అంశాన్ని తెలిపారు. సుప్రభాత సేవకు సంబంధించి పలువురు భక్తులు అడిగిన ప్రశ్నలకు గాను ప్రతి శనివారం సుప్రభాత సేవ టికెట్లు ముందటి ఆదివారం ఉదయం 9 గంటలకు ఆన్లైన్లో ఉంచడం జరుగుతుందని చక్రధరరావు తెలిపారు. గతవారం రూ.200 టికెట్లు తీసుకున్న భక్తుల రద్దీ అధికంగా ఉండడం గమనించి మరిన్ని క్యూ లైన్ల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శనివారం వచ్చే లక్షలాది



భక్తుల కోసం తాగునీటి సౌకర్యం, చిన్నపిల్లలకు పాలు, క్యూలైన్లలో భక్తుల కోసం ఫ్యాన్ల ఏర్పాటు జరిగిందన్నారు. మరుగుదొడ్ల సంఖ్యను సైతం పెంచామన్నారు. లగేజ్ కౌంటర్ కు సంబంధించి గతంలో తాను ఎదుర్కొన్న సమస్యను జగ్గంపేట నుంచి సతీష్ అనే భక్తుడు తెలుపగా స్వయంగా తానే వెళ్లి సమస్యను పరిశీలించి పరిష్కరిస్తానన్నారు. మొత్తం 20 వరకు వచ్చిన ఫోన్ కాల్స్ లో భక్తులు అడిగిన అనేక ప్రశ్నలకు డిప్యూటీ కమిషనర్ సమాధానం ఇచ్చారు. వారు వెల్లడించిన సమస్యలను వెనువెంటనే పరిశీలించి పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ చక్రధరరావు మాట్లాడుతూ శనివారం ఉదయం 4.15కి మొదలయ్యే దర్శనాలు మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు జరుగుతాయని స్వామివారి నివేదన కోసం ఒక్క పావుగంట మాత్రమే నిలుపుదల చేస్తున్నామని ఆ తరువాత 12 గంటల 45 నిమిషాల నుంచి నుంచి మొదలుపెట్టి రాత్రి చివరి భక్తుడు దర్శనం చేసుకునే వరకు కొనసాగిస్తున్నామని తెలిపారు. డయల్ యువర్ ఈవో ద్వారా గాని లేదా నేరుగా గాని స్వామి వారి భక్తులు చెప్పే సమస్యలకు,ఇబ్బందులకు పరిష్కారం చూపడంతో పాటుగా సలహాలను తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు.

## మువ్వెన్నల జెండా ప్రతి భారతీయునిలో స్ఫూర్తినినింపింది



భీమవరం జులై 22 ప్రభాతవార్త : రెపరెపలాడే జాతీయజెండాను చూస్తే హృదయం ఉప్పొంగుతాదని, మన మువ్వెన్నల జెండా ప్రతి భారతీయునిలో నింపిన స్ఫూర్తి అని పలువురు వక్తలు అన్నారు. భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద మంగళవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జాతీయ జెండా స్వీకరణ దినోత్సవాన్ని నిర్వహించారు. భీమవరం పెన్షనర్లు అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ సత్యనారాయణ రాజు, ఎన్ సిసి మేజర్ డా ఏ వీరయ్య, అరసవల్లి సుబ్రహణ్యం, భట్టిప్రోలు శ్రీనివాస్ రావు మాట్లాడుతూ దేశ సమగ్రతను సౌర్వభౌమత్వాన్ని ప్రతిబింబింపజేసే త్రివర్ణ పతాకాన్ని 1947 జూలై 22న జరిగిన సమావేశంలో రాజ్యాంగ సభ ఆమోదించిందన్నారు కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మన జాతీయజెండాలోని కాషాయం - దైర్యం, త్యాగం, తెలుగు - శాంతి, సత్యం, స్వచ్ఛత, అశోక చక్రం - ధర్మాన్ని సూచిస్తాయని అన్నారు. అనంతరం జాతీయ జెండాలను పట్టుకుని పట్టణ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆదిత్య, శ్రీవిద్య, సర్ సివి రామాన్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## పంచారమ క్షేత్రం చైర్మన్ గా చింతలపాటి



భీమవరం జులై 22 ప్రభాతవార్త : జెులై 22 ప్రభాతవార్త : పంచారామాల్లో ఒకటిగా విరాజిల్లు తున్నసోమేశ్వర స్వామి దేవస్థానం గునుపూడి ట్రస్ట్ బోర్డు చైర్మన్ గా నియమితులైన చింతలపాటి బంగార్రాజు సోమవారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి అభిమానం తో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలుఅక్కడ ఉన్నారు.

## ఊడ్పుల దశలో కాంప్లెక్స్ ఎరువులు వాడాలి.



అత్తిలి -జూలై 22( ప్రభాతవార్త) రైతులు ఊడ్పు ల దశలోనే కాంప్లెక్స్ ఎరువులు దమ్ములో వేసుకోవాలని అత్తిలి వ్యవసాయ అధికారి టి.కే. రాజేష్ తెలిపారు. అత్తిలి మండలం కంచుమర్రు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆగస్టు 15లోగా భీమా చెల్లించాలని కోరారు. బ్యాంకు ద్వారా అప్పు తీసుకున్న వారు తప్ప మిగిలిన వారు రైతు సేవా కేంద్రం వద్ద గాని,మీసేవ కేంద్రం వద్ద గాని ప్రీమియం చెల్లించి ప్రయోజనం పొందాలని కోరారు. కంచు మర్రు సర్పంచి పెన్మెత్స వెంకట కృష్ణంరాజు, మంచిలి సొసైటీ అధ్యక్షుడు ఇందుకూరి వెంకట సుబ్బరాజు వి ఏ ఏ లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యాలయం జలమయం



జీలుగుమిల్లి-ప్రభాతవార్త : మండల కేంద్రం జీలుగుమిల్లిలో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి స్థానిక పంచాయతీ కార్యాలయం పూర్తిగా జలమయం అయింది. కార్యాలయం గదుల్లోకి నీరు పూర్తిగా చేరింది. దీంతో సిబ్బంది చేసేదిలేక అసౌకర్యానికి గురయ్యారు. కావున నిర్మాణంలో ఉన్న సచివాలయాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజల కోరుతున్నారు.

## చాట్రాయి జనసేనలో పెచ్చు మీరుతున్న వర్గ పోరు

### - నియోజకవర్గ ఇన్చార్జి ఉన్నా ప్రయోజనం సున్నా

ప్రభాతవార్త చాట్రాయి : చాట్రాయి మండల జనసేన పార్టీలో వర్గ పోరు రోజురోజుకు పెచ్చుమీరి పోతోంది. మండలంలో నాయకత్వం సరిగ్గా లేకపోవడంతో వర్గ పోరు రోజురోజుకు తారా స్థాయికి చేరుకుంటుంది. నూజివీడు నియోజకవర్గం జనసేన పార్టీకి ఇన్చార్జిగా బర్మా ఫణిబాబును ఆ పార్టీ నియమించినప్పటికీ వర్గపూరును నివారించడంలో పూర్తిగా విఫలమయ్యారని చెప్పాలి. చాట్రాయి మండలంలో జనసేన పార్టీని బలోపేతం చేయడానికి ఏనాడూ ఎటువంటి ప్రయత్నం చేసిన దాఖలాలు లేవు. అంతేకాకుండా మండలంలో ప్రతి గ్రామంలో వర్గాలుగా ఏర్పడి ఘర్షణలకు దిగుతున్నప్పటికీ ఇన్చార్జి ఫణి బాబు మాత్రం నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూ జనసేన పార్టీ ఏడాది కాలం పూర్తి చేసినప్పటికీ పార్టీకి బలం చేకూరిన దాఖలాలు మచ్చుకైనా కానరాని పరిస్థితి ఉంది. వర్గ విభేదాలు పెచ్చు మీరుతున్నప్పటికీ ఏనాడు మండల సమావేశం ఏర్పాటు చేసి కార్యకర్తల మనోభావాలను తెలుసుకునే పరిస్థితిలో ఫణి బాబు లేరని ఇన్చార్జిగా చెప్పుకొని ప్రయోజనం ఏమిటి అని కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. చాట్రాయి మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ఎన్నికల ముందే రాజీనామా చేసినా నేటికీ పార్టీ అధ్యక్షుడుని మాత్రం నియమించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువిరుస్తున్నాయి. పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానంటూ ఎన్నికలు ముందు తిరిగిన బర్మా ఫణి బాబు ఈ మండలానికి వచ్చిన దాఖలాలే లేవు. మండలంలో ఒక వర్గాన్ని భుజాన వేసుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని జనసేన అభిమానులు ఆరోపణలు చేస్తున్నారు. ఇన్చార్జిగా బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించట్లేదు అంటూ ఇప్పటికే మంగళగిరి జనసేన కార్యాలయంలో పలువురు చాట్రాయి మండలం నుండే కాకుండా నియోజకవర్గంలోని గ్రామాల నుండి

జనసేన

ఫిర్యాదులు చేసినట్టు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకసారి కూడా మండల పార్టీ సమావేశం ఏర్పాటు చేయలేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీని సమర్థవంతంగా నడపడం లేదని ఇన్చార్జి బాధ్యతలు తప్పించి సమర్థవంతమైన నాయకుడిని నూజివీడు నియోజకవర్గానికి పంపాలని పలువురు విజ్ఞాపనలు చేసినట్టు తెలుస్తోంది. ఇక చాట్రాయి మండలం విషయానికొస్తే సహకార సంఘ అధ్యక్ష ఎన్నిక వివాస్పదంగా మారింది. ఎప్పటినుండో వైసీపీలో ముఖ్య నాయకుడిగా ఉంటూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా వైసీపీకి పనిచేసిన వ్యక్తిని అధ్యక్షుడిగా నియమించాలని ఫణిబాబు సిఫార్సు చేయడంతో చాట్రాయి లో అగ్గిరాల్చుకుంది. పార్టీ ఆవిర్భావం నుండి పనిచేసిన కార్యకర్తలను పక్కనపెట్టి ఇటీవల పార్టీలోకి వచ్చిన వారికి పదవులు కట్టబెడుతున్నారని ఆరోపిస్తూ మంత్రి నాదెండ్ల మనోహర్ కు చాట్రాయి మండల కార్యకర్తలు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో చాట్రాయి సహకార సంఘం అధ్యక్షులు ఎన్నిక నిలిచిపోయింది. ఏదేమైనా జనసేన జిల్లా నాయకత్వం జోక్యం చేసుకొని నూజివీడు నియోజకవర్గం లో జనసేన పార్టీలో జరుగుతున్న పరిస్థితులను గమనించి పార్టీని బలోపేతం చేసేందుకు సరైన నిర్ణయాలు తీసుకొని పార్టీ ప్రతిష్టను పెంచే వ్యక్తికి ఇన్చార్జి బాధ్యతలు అప్పగించాలని పలువురు కోరుతున్నారు.

## పి-ఫోర్ బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలి

పెనుమంట్ర, జూలై-22, ప్రభాతవార్త: మండలంలోని బట్ల మగుటూరు గ్రామంలో పి-4 బంగారు కుటుంబాల గ్రామసభ గ్రామ స్థానిక పంచాయతీ వద్ద మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రభాకర రావు, తాసిల్దార్ రవికుమార్, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో పి-04 ద్వారా గ్రామాలలో పూర్తిగా పేదరికాన్ని నిర్మూలించ వచ్చు అని అన్నారు. మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గ్రామాలలో పేదరికం, ఆకలి బాధలు ఉండకూడదని చక్కటి ఆలోచన చేసి కార్యక్రమం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు జంగం చిట్టిబాబు,



జనసేన గ్రామ అధ్యక్షులు బయ్యే బాలాజీ, బిజెపి గ్రామ అధ్యక్షులు పేర్రాజు, పెనుమంట్ర మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పాలమూరు రాజేష్ టిడిపి, ప్రధాన కార్యదర్శి గంటా శ్రీను, గ్రామ పంచాయతీ కార్యదర్శి సుబ్బలక్ష్మి, సచివాలయం సిబ్బంది, వెలుగు సిసి, అంగన్వాడి టీచర్లు, నాయకులు పాల్గొన్నారు.

## స్వర్ణకార సంఘ నేత అనిల్ బస్ వర్ధంతి.



అత్తిలి - జులై 22( ప్రభాత వార్త): ఆల్ ఇండియా స్వర్ణకార సంఘ ప్రధాన కార్యదర్శి, బంగారు పని వారికోసం గోల్డ్ కంట్రోల్ యాక్టు కోసం అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి అనిల్ బస్ వర్ధంతి సందర్భంగా తణుకు స్వర్ణకార సంఘం అధ్యక్షుడు నాగమల్లి సాంబశివరావు అధ్యక్షతన స్వర్ణకార బజార్లో వర్ధంతి సభ నిర్వహించారు. అనిల్ బస్సు చిత్రపటానికి పూ లమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ స్వర్ణకార సంఘ కోశాధికారి వెండి శ్రీను మాట్లాడుతూ బంగారు వృత్తులో పనిచేసుకుంటున్నామంటే అది ఆయన చేసిన నిరాహార దీక్ష వల్లే సాధ్యమైనట్లు తెలిపారు. పట్టణ స్వర్ణకారుల గౌరవ అధ్యక్షులు శొంఠియానా లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి కోరుమిల్లి సుబ్బారావు, శీలమంతల వెంకట అప్పలరాజు, కడలి చిన్న బ్రహ్మజీ, శీలామంతుల ప్రసాద్,తామరాడ మోహన్,మండామల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## దళితులపై దాడులు తగవు.



అత్తిలి- జూలై 22 (ప్రభాతవార్త)రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి సామాన్య ప్రజల పై అత్యంత పాశవికమైన భౌతిక దాడులు జరుగుతున్నాయని వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అత్తిలి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కోరుకొల్లు వెంకట్రావు అన్నారు.. తూర్పుగోదావరి జిల్లాలో రాష్ట్ర మంత్రి అనుచరులు ఒక దళిత వర్గానికి చెందిన యువకుడిని అత్యంత దారుణంగా నడిరోడ్డు పై చావు దెబ్బలు కొట్టటం అమానుషం అని అన్నారు.కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని తెలపడానికి ఈ ఘటనే నిదర్శనం అని అన్నారు. ఉద్యోగం ఇప్పిస్తానని మంత్రి అనుచరులు బాధితుని దగ్గర భారీ మొత్తంలో నగదు కాజేశారని, అది తిరిగి ఇవ్వమని అడిగితే అధికార మదంతో అత్యంత దారుణంగా కొట్టారని తెలిపారు. దళిత వర్గాల ప్రజలు అందరూ ఐక్యతగా ఉంటేనే తరతరాలుగా అణగారిన వర్గాల పై జరుగుతున్న ఇటువంటి దుర్మార్గపు దాడులు ఎదుర్కోవచ్చునని ఈ సందర్భంగా దళిత వర్గాలకు వెంకట్రావు పిలుపునిచ్చారు.

## తాడు బిగుసుకుపోయి ఇబ్బంది పండుతున్న అంబోతుకు చికిత్స

భీమవరం జులై 22 ప్రభాతవార్త : భీమవరం - ఉండి రోడ్డు ప్రాంతంలోని ఒక ఆంబోతుకు ఏడాది కాలంగా దాని మెడకు ఉన్న తాడు బిగిసిపోయి గంగడోలు మొత్తం కట్ అయిపోతుందని గోసంరక్షణ అధ్యక్షులు సుంకరదాసు అన్నారు. మంగళవారం వాళ్ల మిత్రులు కొంతమంది వాస్తవ్యులు 16 మంది కలిసి ఆంబోతుని పట్టుకుని చికిత్స అందించామని అన్నారు. భీమవరం పశు ఆసుపత్రి వైద్యులచే అంబోతు ఉన్న గాయానికి ప్రథమ చికిత్స చేసారని తెలిపారు. లక్ష్మీపతి రాజుగారు రామకృష్ణరాజు, సీతారామరాజు, నాగేంద్ర వీళ్ళందరూ సహకారంతో ఆంబోతును పట్టుకొని దానిని రక్షించామని సుంకరదాసు తెలిపారు.



## జంగారెడ్డిగూడెం ఇంచార్జి ఆర్డీవో గా దేవకి దేవి

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: జంగారెడ్డిగూడెం రెవిన్యూ డివిజన్ కు ఇంచార్జి ఆర్డీవో గా సివిల్ సప్లయిస్ ఎస్ డిసి ఎల్ దేవకి దేవి నియమితులయ్యారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.వి.రమణ 15 రోజులపాటు సెలవు పెట్టారు. దీంతో రాష్ట్ర ఉన్నతాధికారులు దేవకి దేవి ని ఇంచార్జి గా నియమించారు. ఇంచార్జి ఆర్డీవో దేవకి దేవి సోమవారం విధుల్లో చేరారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని వినతులు స్వీకరించారు.

## విజయ్ కింగ్డమ్ కోసం సందీప్ వంగ?

టాలీవుడ్ సెన్సేషనల్ స్టార్ ది విజయ్ దేవరకొండ హీరోగా భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం కింగ్డమ్ కోసం అందరికీ తెలిసిందే. ఈ చిత్రం ఇంకొన్ని రోజుల్లోనే విడుదల కాబోతుండగా సాలిడ్ ప్రమోషన్స్ కోసం సినిమా సిద్ధం అవుతుంది. కింగ్డమ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తుండగా ఈ ప్రమోషన్స్‌లో విజయ్ బ్లాక్ బస్టర్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగ భాగం కానున్నట్టుగా తెలుస్తుంది. విజయ్‌తో ఒక స్పెషల్ ఇంటర్వ్యూని వీరు ప్లాన్ చేస్తున్నారని సమాచారం.

# తెర

# ప్రీమియర్ షో అ'ధర' హో..

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న హరి హర వీరమల్లు చిత్రం జూలై 24న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా రిలీజ్‌కు ఒకరోజు ముందుగానే ప్రీమియర్ షోలకు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లోని కొన్ని థియేటర్లలో హరి హర వీరమల్లు బుకింగ్స్ ప్రారంభమయ్యాయి.

బుక్‌మైషోలో మాత్రమే కాకుండా డిస్ట్రిక్ట్ యాప్, బ్రో యాప్ వంటివి వేదికలలో టికెట్లు అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. జూలై 23న రాత్రి 9 గంటలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలలో ప్రీమియర్ షోలు వేయనున్నారు. దీనికోసం బుకింగ్స్ ఇలా ఓపెన్ అయ్యాయో లేదో అలా సోల్డ్ అవుట్ చూపిస్తుండటం విశేషం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు హరి హర వీరమల్లు చిత్రానికి టికెట్ ధరలను పెంచుతూ ప్రత్యేక అనుమతులు మంజూరు చేశాయి.

ఏపీలో జూలై 23న పెయిడ్ ప్రీమియర్ షోల కోసం ఒక్కో టికెట్ ధరను రూ.600 వరకు నిర్ణయించారు. ఎంపిక చేసిన సింగిల్ స్క్రీన్, మల్టీప్లెక్స్‌లలో ప్రీమియర్ షోను ప్రదర్శించనున్నారు. రెక్లయినర్/సోఫా సదుపాయం కలిగిన టికెట్ ధర దాదాపు రూ.1000 దాటింది. అలాగే బాల్కనీ ధర రూ.830 దాటగా.. సెకండ్ క్లాస్ రూ.790 (బుకింగ్ ఛార్జీలు అదనం)గా ఉన్నాయి.

ఇక జులై 24 నుంచి మల్టీప్లెక్స్‌లలో పెంచిన ధరల ప్రకారం.. రాయల్ సీటింగ్‌లో రూ.495, ఎగ్జిక్యూటివ్ సీటింగ్‌లో రూ.377 ధర కనిపిస్తోంది. అదే సమయంలో సింగిల్ స్క్రీన్ థియేటర్‌లలో బాల్కనీ రూ.250 కాగా.. ఫస్ట్ క్లాస్ రూ.150గా నిర్ణయించారు. తెలంగాణ ప్రభుత్వం కూడా టికెట్ ధరల పెంపునకు ఆమోదం తెలిపింది. అయితే తెలంగాణలో పెయిడ్ ప్రీమియర్‌కు సంబంధించి ఇంకా బుకింగ్స్ ప్రారంభం కాలేదు. జూలై 24 నుంచి మల్టీప్లెక్స్‌లలో రాయల్ సీటింగ్ కోసం రూ.500గా నిర్ణయించారు. అలాగే ఎగ్జిక్యూటివ్ కోసం రూ.413 (బుకింగ్ ఛార్జీలు అదనం)గా ప్రముఖ టికెట్ బుకింగ్ యాప్ బుక్‌మై షోలో చూపిస్తోంది. అదే సమయంలో సింగిల్ స్క్రీన్‌లో బాల్కనీ రూ.300 కాగా, ఫ్రంట్ సర్కిల్‌లో రూ.200గా నిర్ణయించారు.

### 20 నిమిషాల తర్వాతే హరిహర ఎంట్రీ?

హరిహర వీరమల్లు సినిమాని నిర్మాత ఏ.ఎం.రత్నం, పవన్ కళ్యాణ్ కళ్యాణ్ కలిసి కొంతమంది స్నేహితులకు అలాగే రాజకీయవేత్తలకు, పారిశ్రామికవేత్తలకు చూపించినట్టు సమాచారం.



సినిమా చూశాక వాళ్ళు తమ అభిప్రాయాన్ని షేర్ చేసుకున్నారు. హరిహర వీరమల్లు మొదటి 15 నిమిషాలకే అందరూ కథలో ఇన్వాల్వ్ అయిపోతాం అని, దాదాపు 20 నిమిషాల తర్వాత పవన్ కళ్యాణ్ ఎంట్రీ ఉంటుందని, ఆ తర్వాత ప్రేమ కథ, కామెడీ సన్నివేశాలు వస్తాయని చెబుతున్నారు. సనాతన ధర్మం గురించి వచ్చే డైలాగులు పవన్ వీరాభిమానులు మెచ్చే విధంగా ఉంటాయని చెబుతున్నారు.

### వీరమల్లు వచ్చేది నిశ్శబ్దంగా కాదు

ప్రీ రిలీజ్ వేడుకలో రచయితగా క్రిష్‌కి పవన్ గౌరవం ఇస్తూ మాట్లాడిన నేపథ్యంలో ఇప్పటివరకు సైలెంట్‌గా ఉన్న క్రిష్ ఓపెన్ అయ్యాడు. 'ఈ ప్రాజెక్ట్ మరెవరి వల్ల సాధ్యపడదు. పవన్ కళ్యాణ్‌లోని ఫైర్‌ను ఏ కెమెరా క్యాప్చ్యూర్ చేయలేదు. ఏ.ఎం.రత్నం అకుంఠిత దీక్ష మాత్రమే ఈ సినిమా పూర్తవ్వడానికి కారణం. ఇప్పుడు వీరమల్లు ప్రపంచంలోకి అడుగు పెట్టబోతోంది. కానీ నిశ్శబ్దంగా కాదు ఈ సినిమాకి ఇద్దరు లెజెండ్స్ ఫ్యాషనేటెడ్ జర్నీతో వస్తోంది. ఈ చిత్రం చేయడం తన కెరీర్ లోనే ఒక ఉద్వేగభరితమైన యుద్ధాల్లో ఒకటి. సినిమా రిలీజ్ అయ్యి మంచి విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాన్ను అని పేర్కొన్నారు. అయితే.. క్రిష్ తన ట్వీట్‌లో ఎక్కడా ప్రస్తుత దర్శకుడు జ్యోతి కృష్ణ పేరును ప్రస్తావించకపోవడం గమనార్హం.



### కొట్టుకో.. కొట్టుకో.. తీన్ మార్

పవన్ కళ్యాణ్ సినిమాకు కీరవాణి పని చేయడం ఇదే మొదటిసారి. అందులోనూ పవన్ అంటే ఆయనకు విపరీతమైన అభిమానం. ఆ అభిమానాన్ని పవన్ సినామా టైటిళ్లతో ఓ పాట రూపంలో తీర్చిదిద్ది హరిహర వీరమల్లు పీ రిలీజ్ వేదికపై చాటుకొన్నారు. గోకులంలో సీత వెదికింది.. అత్తారింటికి దారేదని.. అక్కడ అమ్మాయికి ఇక్కడ అబ్బాయి దొరికితే ఖుషి.. తమ్ముదూ.. హే తమ్ముదూ ఎక్కడున్నాడు ఆ కాటమరాయుడు? తమ్ముదూ.. హే తమ్ముదూ ఆ అజ్ఞాతవాసిని వెదికి పట్టుకో.. నేడుపులి పంజాకైనా దొరకని గబ్బర్ సింగ్ వాడూ సర్దార్ గబ్బర్ సింగ్ వాడూ..బెదిరిస్తే వస్తాడా.. నెవ్వర్.. హీ హీజ్ గుడుంబా.. శంకర్ పెరిగి పోతోందిక్కడ.. ఫీవర్.. కొట్టుకో.. కొట్టుకో.. తీన్ మార్. మా బంగారానికి నీపై తొలిప్రేమ పుట్టింది బ్రో.. ఈ వకీలు సాబే తన లైఫ్‌లోన జానీ అంటోంది బ్రో. ఈ బాలుని.. ఈ బద్రిని.. ఈ భీమ్లా నాయక్‌ని గోపాల గోపాల మాంగళ్య మంత్రాల అన్నవరంలో పెళ్లాడు.. మంత్రాల జల్సాల వేదికకి సుస్వాగతం.. ఆ సునామికి సుస్వాగతం. ఇది అరాచకం.. ఇది అరాచకం రాంబాబూ.. నువ్వు రెడీ అయిపో.. నీ కెమెరాతో.. నువ్వు రెడీ అయిపో ఆ గంగతో.. ఇకరెచ్చిపో..వస్తున్నాడొస్తున్నా దొస్తున్నా దహో.. వచ్చేశాడొచ్చేశాడోచ్చేశాహో.. ఎవ్వడూ.. హరి హర వీర మల్లు..!




### సీక్వెల్ ఆశలు సజీవం

ఈ సినిమా సీక్వెల్‌ను ఉద్దేశించి పవన్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. హరిహర వీరమల్లు మొదటి భాగం చాలా బాగా వచ్చిందని. సినిమాలో మంచి మెసేజ్ ఉంటుందని, చరిత్రని కళ్ళకు కట్టినట్టు చూపించడానికి నిర్మాత ఏ.ఎం.రత్నం ముందుకొచ్చారని. 2వ భాగాన్ని కూడా జనాల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం ఆయన చేస్తున్నారని పవన్ అన్నారు.

## బుల్లితెర రాకుమారి




యాంకర్ శ్రీముఖి ఆరెంజ్ లెహంగాలో రాకుమారిలా ముస్తాబైన లేటెస్ట్ ఫొటో షూట్ సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షించింది. బుల్లితెర బ్యూటీ యాంకర్ శ్రీముఖి ప్రస్తుతం చేతి నిండా షోలు, ఈవెంట్లతో కెరీర్‌ని సక్సెస్ ఫుల్‌గా లీడ్ చేస్తోంది. ఓ వైపు షోలు ఈవెంట్లతో బిజీగా ఉన్నప్పటికీ తన యూట్యూబ్ ఛానెల్, ఇన్‌స్టాగ్రామ్‌లోనూ ఫుల్ యాక్టీవ్ కనిపిస్తుంది. వ్లాగ్స్, రీల్స్, లేటెస్ట్ ఫొటోషూట్లత్ ఎప్పటికప్పుడు ఫ్యాన్స్‌ని ఆకట్టుకుంటూ ఉంటుంది ఈ ముద్దుగుమ్మ. తాజాగా ఆరెంజ్ లెహంగాలో రాకుమారిలా ముస్తాబైన శ్రీముఖి అందాలు సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షించాయి. ఈ ఫొటోలపై అభిమానులతో సహా బుల్లితెర నటులు లైకులు వర్షం కురిపిస్తున్నారు. సూపర్, బ్యూటిఫుల్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. ప్రస్తుతం శ్రీముఖి స్టార్ మా ఛానెల్‌లో ఆదివారం విత్ స్టార్ మా పరివారం, కిర్రాక్ బాయ్స్ కిలాడీ గర్ల్స్ షోలు హోస్ట్ చేస్తుంది. వీటితో ప్రీ రిలీజ్ ఈవెంట్స్, స్పెషల్ ఈవెంట్స్‌తో బిజీగా ఉంటోంది. షోలు, హోస్టింగ్ మాత్రమే కాదు నటిగా కూడా తన టాలెంట్ ప్రూవ్ చేసుకుంది శ్రీముఖి. జులాయి, నేను శైలజ, భోళా శంకర్ వంటి సినిమాల్లో స్టార్ హీరోలతో నటించే అవకాశం దక్కించుకుంది. శ్రీముఖి పటాస్ కామెడీ షోతో ప్రేక్షకులకు బాగా దగ్గరైంది. ఆ తర్వాత బిగ్ బాస్ సీజన్ 3 రన్నరప్ మరింత పాపులారిటీ తెచ్చుకుంది. శ్రీముఖి డ్రామా జూనియర్స్, సరిగమపా, అదుర్స్ వంటి పాపులర్ షోస్ హోస్ట్ చేసింది.



## వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్



పవన్ కళ్యాణ్ డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబోలో రాబోతున్న ఉస్తాద్ భగత్ సింగ్ మూవీలో శ్రీలీలతో పాటు రాశీ ఖన్నా కూడా మరో ఫీమేల్ లీడ్‌గా కనిపించబోతున్నారని గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పుడీ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఉస్తాద్ భగత్ సింగ్‌లో రాశీ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో రాశీ శ్లోక అనే పాత్రలో కనిపించబోతున్నట్లు తెలిపారు. పోస్టర్ లో రాశీ మెడలో కెమెరా వేసుకొని స్టైలిష్ గా కనిపించింది. చూస్తుంటే.. సినిమాలో రాశీ ఓ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ అన్నట్లుగా అనిపిస్తోంది.

ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇటీవలే హైదరాబాద్ లో కొత్త షెడ్యూల్ ప్రారంభించారు.

మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాక్ స్టార్ డీఎస్పీ సంగీతం అందిస్తున్నారు. పవన్ ఫ్యాన్స్‌ని అలరించే మాస్ అంశాలు, ఎలివేషన్స్, విజిల్ మార్క్ సన్నివేశాలు ఈ సినిమాలో పుష్కలంగా ఉంటాయని తెలుస్తోంది.

అంతేగాదు కథ, కథనం పాత్రలు అన్నీ కొత్తగా ఉంటాయని, పవన్ ని ఇప్పటివరకు చూడని ఒక డిఫరెంట్ యాంగిల్‌లో చూడబోతున్నారని హరీష్ శంకర్ తెలిపారు.



## 25 వసంతాల వేళ..

జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ఇద్దరూ సినీ పరిశ్రమలో అడుగుపెట్టి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. జులై 25న ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వార్ 2 ట్రైలర్ విడుదల చేయాలని నిర్ణయించినట్లు మేకర్స్ ప్రకటించారు. మరోవైపు ఈ చిత్ర తెలుగు ప్రీరిలీజ్ ఈవెంట్‌ను విజయవాడలో ఘనంగా నిర్వహిస్తారని.. దీని కోసం ఎన్టీఆర్ స్వయంగా బాధ్యతలు తీసుకున్నాడని.. ఇక ఈ ఈవెంట్ కోసం హృతిక్ రోషన్ కూడా వస్తాడని సినీ సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తోంది. ఈ గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ను ఆగస్టు రెండో వారంలో నిర్వహించేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారని సమాచారం. అయితే, దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక ఈ సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుండగా ఈ చిత్రాన్ని ఆగస్టు 14న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలుచేస్తున్నారు. 2019 లో బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించిన వార్ సీక్వెల్‌గా వార్ 2 రూపొందించారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హృతిక్ కబీర్ పాత్రలో తిరిగి వస్తుండగా.. ఎన్టీఆర్ మరో కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇందులో బాలీవుడ్ నటి కియారా అద్వానీ ఫీమేల్ లీడ్‌గా నటించింది. జూనియర్ ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్న ఈ సినిమాను తెలుగు, తమిళ్, హిందీ, కన్నడ భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

## పరాశక్తికి రానా కీలకం?

తమిళ స్టార్ హీరో శివ కార్తికేయన్ హీరోగా నటిస్తన్న పరాశక్తి లేటెస్ట్ షెడ్యూల్‌ను తమిళనాడులోని కోయంబత్తూరు, పొల్లాచిలో నిర్వహిస్తున్నారు. హీరో శివ కార్తికేయన్, హీరోయిన్ శ్రీలీల..లపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో హీరో రానా కూడా పాల్గొన్నట్టు తెలుస్తోంది. రానాకి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇందులో మీసాలు పెంచి కనిపిస్తున్నాడు రానా. దాదాపు శివ కార్తికేయన్ లుక్ కూడా ఇలానే ఉంది. దీంతో ఈ సినిమాలో టాలీవుడ్ హీరో రానా కూడా కీలక పాత్ర పోషించనున్నారన్న వార్తలు వస్తున్నాయి. దీనిపై టీం అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. గురు ఆకాశం నీ హద్దురా వంటి సూపర్ హిట్ సినిమాలు అందించిన సుధా కొంగర ఈ చిత్రానికి దర్శకుడు. జయం రవి అలియాస్ రవి మోహన్ ఈ సినిమాలో విలన్‌గా నటిస్తుండగా శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది.



మరో తమిళ హీరో అథర్వ మురళి కూడా కీలక పాత్ర పోషిస్తున్నాడు. డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై తిరుచిరాపల్లి, ఆకాష్ భాస్కరన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే చాలా భాగం షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమా.. సెప్టెంబర్ 5కి రిలీజ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.



## వింత జంతువుల నుంచి ప్రతిఘటన

చాలా గ్యాప్ తర్వాత హాలీవుడ్ నుంచి ఓ ప్రిడేటర్ చిత్రం ప్రిడేటర్ బ్యాడ్ ల్యాండ్స్ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. గతంలో ప్రే, 10 కల్వర్ ఫీల్డ్ వంటి విజయవంతమైన చిత్రాలను రూపొందించిన డాన్ ట్రాచ్టెన్‌బర్గ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించగా 20 సెంచరీ స్టూడియోస్ నిర్మించింది. ఎల్లే ఫానింగ్, డిమిట్రియస్ షుస్టర్కో లోమాతంగి లీడ్ రోల్స్‌లో నటించారు. నవంబర్ 7న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా ఈ మూవీ ట్రైలర్ విడుదల చేశారు.

ఇక.. ఈ ట్రైలర్ విషయానికి వస్తే చూసే ప్రతిఒక్కరికి గూస్‌బంప్స్ వచ్చేలా ఉంది. ఇప్పటివరకు ఈ ప్రెడేటర్ సిరీస్ ఫ్రాంఛైజీలో ఆరు చిత్రాలు రాగా ఇది ఎడవ చిత్రం. అంతేగాక ఈ ఆరు చిత్రాలలో ప్రతీసారి మనుషులతోనే పోరాడిన ప్రెడేటర్..

ఈ సినిమాలో మాత్రం కథ భిన్నంగా ఉండనుంది. అనుకోకుండా ఓ గ్రహం పైకి వచ్చిన ప్రెడేటర్‌కు అక్కడి వింత, భయంకరమైన జంతువుల నుంచి ప్రతిఘటన ఎదురవుతుంది.

అంతేగాక అక్కడే ఉండే రోబోట్స్, హై లెవల్ టెక్నాలజీని ఉపయోగించే మనుషులతోనూ పోరాడాల్సిన పరిస్థితి వస్తుంది. ఈ పరిస్థితుల్లో మొండెం వరకు మాత్రమే ఉండే ఓ యువతి ఆ ప్రెడేటర్‌కు సాయం చేస్తుంది. ఈ క్రమంలో వారు అక్కడి నుంచి సురక్షితంగా బయట పడ్డారా లేదా, అక్కడి జంతువుల, రోబోట్స్‌ను ఎలా ఎదుర్కొన్నారనే స్టోరీతో ప్రెడేటర్ బ్యాడ్ ల్యాండ్స్ సినిమా ఉండనుంది.

ఈ నేపథ్యంలో.. తాజాగా విడుదల చేసిన ట్రైలర్‌ను చూస్తే ఇప్పటివరకు వచ్చిన చాలా హాలీవుడ్ సినిమాలను మించిన విజువల్స్, గ్రాఫిక్స్‌ను తలదన్నేలా ఉన్నాయి. ముఖ్యంగా యానిమల్స్ అయితే నెవర్ భిఫోర్ అనేలా ఉన్నాయి. ఒక్కసారి ట్రైలర్

## గుర్రం పాపిరెడ్డికి స్పెషల్ అట్రాక్షన్

నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా గుర్రం పాపిరెడ్డి. ఈ చిత్రాన్ని డా. సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేను సడ్డి, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు. డార్క్ కామెడీ కథతో ఇప్పటి వరకు మనం తెరపై చూడని కాన్సెప్ట్‌తో దర్శకుడు మురళీ మనోహర్ రూపొందిస్తున్నారు. త్వరలో గుర్రం పాపిరెడ్డి సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ సినిమా నుంచి ప్రముఖ నటుడు యోగిబాబుకు జన్మదిన శుభాకాంక్షలతో స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో యోగిబాబు ఉడ్రాజు అనే పాత్రలో సందడి చేయబోతున్నారు. ఆయన పర్‌ఫార్మెన్స్ ఈ చిత్రానికి అదనపు ఆకర్షణగా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. పర్ఫెక్ట్ డార్క్ కామెడీ మూవీగా గుర్రం పాపిరెడ్డి సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంలో డిఫరెంట్‌గా డిజైన్ చేసిన క్యారెక్టర్స్‌ను హైదరాబాద్ సిటీ బ్యాక్ డ్రాప్‌లో కాంటెంపరరీగా, స్టైలిష్‌గా ప్రెజెంట్ చేస్తున్నారు దర్శకుడు మురళీ మనోహర్. నటీనటులు నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా, బ్రహ్మానందం, యోగి బాబు, తదితరులున్నారు.



## వాళ్లు నన్ను అలా పిలవమనేవాళ్లు

అందాల హాట్ యాంకర్ అనసూయ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. జబర్దస్త్ ద్వారా గుర్తింపు తెచ్చుకున్న అనసూయ సినిమాల్లో కూడా బిజీ అయ్యింది. ఇక అనసూయ కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ అంటే రంగస్థలమే. రామ్ చరణ్, సమంత జంటగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో రంగమత్త పాత్రలో అనసూయ నటనకు ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. ఈ సినిమా హిట్ తరువాతనే టాలీవుడ్ అనసూయ బిజీగా మారింది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో రంగమత్త పాత్ర తనకు ఎలా వచ్చిందో అనసూయ చెప్పుకొచ్చింది. ఈ పాత్ర కోసం చాలామందిని ఆడిషన్ చేశారని, ఆడిషన్ జరిగిన 3 నెలల తరువాత తనను ఫైనల్ చేసినట్లు తెలిపింది. రంగస్థలంలో నన్ను సెలక్ట్ చేసే సమయానికి సుకుమార్ సార్.. నేను నటించిన క్షణం సినిమా కూడా చూడలేదు. సుక్కు సార్ తో పాటు ఆ సినిమాకు ముగ్గురు రైటర్స్ పనిచేశారు. ఇప్పుడు పెద్ది సినిమాకు డైరెక్షన్ చేస్తున్న బుచ్చిబాబు .. అప్పుడు రంగస్థలంకు ఒక రైటర్‌గా పనిచేశాడు. వారితో పాటు కాశీ, శ్రీనివాస్ అని ఉండేవారు. వారు ముగ్గురు నాచేత మాయ్యా అని పిలిపించుకొనేవారు. బుచ్చి మాయ్యా.. కాశీ మాయ్యా.. శ్రీనివాస్ మాయ్యా.. వాళ్ల ముగ్గురు చాలామందిని ఆడిషన్ చేశారు. కనీసం ఒక 20 మందిని ఆడిషన్ చేశారు. చిన్నవాళ్లు.. పెద్దవారు చాలామంది ఉన్నారు. ఆ తరువాత నాకు ఆడిషన్ కు రమ్మని కాల్ వచ్చింది. నేను వెళ్లి వచ్చిన మూడు నెలల తరువాత ఓకే అని చెప్పారు. అప్పటికీ ఆశలు వదిలేసుకున్నా.. నన్నెందుకు తీసుకుంటారులే అనుకున్నా... తరువాత షెడ్యూల్ ఇది అని చెప్పారు.



## మెగాఫోన్ అందుకున్న జోషీ

లెజెండరీ డైరెక్టర్ జోషీ ఓ హై-ఒక్టేన్ యాక్షన్ ఎంటర్టైనర్‌కి మెగాఫోన్ పట్టేందుకు సిద్ధం అయ్యారు. ఉన్ని ముకుందన్ ఫిలింస్ ఐన్స్టిన్ మీడియా బ్యానర్లపై ఈ సినిమా రాబోతోంది. జోషీ తన పుట్టినరోజు వేళ ఈ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. ఆయన డైరెక్షన్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్లు తర తరాలకు స్ఫూర్తిగా నిలిచాయి. ఇప్పుడు ఆ అనుభవంతో, ఈ తరం స్టోరీ టెల్లింగ్ పవర్‌తో, ఒక భారీ యాక్షన్ మూవీ తీసేందుకు రెడీ అవుతున్నారు. నేషనల్ అవార్డు గెలుచుకున్న మెప్పడియాన్ తర్వాత వంద కోట్ల గ్రాస్ కలెక్షన్‌తో దూసుకెళ్లిన మార్కో వంటి సినిమాలతో గేలీనీ స్టాండర్డ్‌ను నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్లింది. ఇప్పుడు జోషీ లాంటి మాస్టర్ డైరెక్టర్‌తో చేతులు కలపడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. అభిలాష్ ఎన్. చంద్రన్ ఈ సినిమాకి కథ స్క్రీన్‌ప్లే అందిస్తున్నాడు. పొరించు మరిఅమ్ జోస్ కింగ్ ఆఫ్ కొథా వంటి సినిమాలకు రాసిన ఈయన ఎమోషన్ డెప్త్ ఉన్న క్యారెక్టర్‌లు రాయడంలో మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ సినిమా కూడా యాక్షన్‌తో పాటు బలమైన భావోద్వేగాలుతో ఉండబోతోంది. హీరోగా ఉన్ని ముకుందన్ తన కెరీర్‌లో ఎప్పుడూ చూడని లుక్‌లో, మాస్ యాక్షన్ అవతారంలో కనిపించబోతున్నాడు. ఈ సినిమా నిర్మాణంలో భాగమైన ఐన్స్టిన్ మీడియా ఇటీవలే ఆంటోనీ, పురుష ప్రేతం వంటి యూనిక్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. డిఫరెంట్ కాన్సెప్ట్స్, క్వాలిటీ కంటెంట్‌కి పేరు తెచ్చుకున్న ఈ బ్యానర్ కూడా ఈ సినిమాతో సత్తా చాటబోతోంది.



# అందానికి గులాబీ..



రంగురంగుల గులాబీలను చూస్తే మనసుకు ఆహ్లాదంగా అనిపిస్తుంది. అయితే సౌందర్య పరిరక్షణలోనూ గులాబీల పాత్ర ఎంతో ఉందంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందామా?

నల్లటి వలయాలు దూరం... కళ్ల కింద వలయాల సమస్యకు చెక్ పెట్టడానికి గులాబీలను ఉపయోగించవచ్చు. కొద్దిగా రోజ్‌వాటర్‌ని తీసుకొని అందులో కాటన్‌ను ముంచి కళ్లకింద మృదువుగా మర్దన చేయాలి. ఇలా కనీసం రెండు రోజులకోసారి చేస్తే ఫలితం ఉంటుంది. గులాబీ రేకల్లో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చర్మంపై వచ్చే దురద, మంటను తగ్గిస్తాయి.

**క్లెన్సర్‌గానూ :..** గులాబీ మంచి క్లెన్సర్‌గా కూడా పని చేస్తుంది. రోజ్‌వాటర్ మన ముఖంపై ఉన్న జిడ్డుని, పేరుకుపోయిన మురికిని తొలగించి చర్మాన్ని తాజాగా మార్చుతుంది. అంతేకాదు.. గులాబీ రేకల్లోని సహజసిద్ధమైన నూనెలు చర్మాన్ని తేమగా ఉంచేందుకు సహకరిస్తాయి. అందుకే స్నానం చేసే నీటిలో కొద్దిగా రోజ్‌వాటర్ లేదా కొన్ని గులాబీ రేకలను వేసుకుంటే చర్మం మెరుపును సంతరించుకుంటుంది.

విటమిన్ 'సి' పుష్కలం... గులాబీల్లో విటమిన్ 'సి' శాతం ఎక్కువ. ఇది యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేసి అతినీల లోహిత కిరణాల నుంచి రక్షణ కల్పిస్తుంది. అందుకే ఎండలోకి వెళ్లేముందు రోజ్‌వాటర్ అప్లై చేసుకొని వెళ్లడం మంచి దంటున్నారు నిపుణులు. అంతేకాదు. గులాబీ ట్యాన్‌ని కూడా తొలగిస్తుంది. దీనికోసం కీరా దోస, గులాబీ, గ్లిజరిన్‌లు కలిపిన ప్యాక్‌ని వేసుకుంటే ఫలితం ఉంటుంది.

**జుట్టు ఆరోగ్యానికి ...** గులాబీల్లో ఉండే సహజ సిద్ధమైన కండిషనింగ్ గుణాలు జుట్టును పట్టుకుచ్చులా మెరిసేలా చేస్తాయి. దీనికోసం మీరు వాడే షాంపూ లేదా కండిషనర్‌లో కొన్ని చుక్క రోజ్ వాటర్ కలుపుకొంటే సరి లేదా గులాబీ రేకల పేస్ట్‌ను జుట్టుకు, కుదుళ్లకు పట్టించి కాసేపయ్యాక తలస్నానం చేస్తే జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుంది.



# జనాభా వృద్ధి స్థిరంగా ఉండాలంటే..



**జనాభా వరమా? శాపమా? జన భారత్ ఇకపైన ఎలా అడుగులు వేయాలి. దీన్లో మహిళల పాత్ర ఏంటి.. లాంటి సందేహాలెన్నో! వీటిపైన 'పాప్యులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పూనమ్ ముత్రేజా ఏం చెబుతున్నారో తెలుసుకుందాం.**

భారత్‌లో ప్రస్తుతం సంతాన సాఫల్య రేటు (టిఎఫ్ఆర్) రెండుగా ఉంది. అంటే సగటున ప్రతి మహిళా ఇద్దరు బిడ్డలకు జన్మనిస్తోంది జనాభా వృద్ధి స్థిరంగా ఉండాలంటే అది 2.1గా ఉండాలి. కానీ ఇలా తగ్గడం ఒకసారి మొదలైతే, క్రమంగా అది తగ్గుతూ పోతుంది. ఆ మార్పు ఇప్పుడు చూస్తున్నాం. అధిక జనాభాతో సవాళ్లూ ఉన్నాయి. తగు రీతిలో వనరులు అవకాశాల్ని అందించకపోతే సామాజిక, ఆర్థిక సమస్యలు పెరుగుతాయి. విద్య, ఉపాధి దక్కకుంటే యువత పక్కదారి పడుతుంది. అందుకే అధిక సంఖ్యలో స్కూళ్లు, కాలేజీలు, ఆసుపత్రులు తీసుకురావాలి. నైపుణ్య శిక్షణ ఇవ్వాలి. ఉపాధి అవకాశాలు పెరగాలి. ముఖ్యంగా మహిళలకు విద్య, పోషకాహారం, వైద్యం, ఆదాయ వనరుల్ని అందించాలి. జనాభా గురించి ఆందోళన చెందకుండా. ప్రతి భారతీయుడూ ఒక ఆస్తి అనుకొని ప్రణాళికలు రచించాలి.

**ఆ స్వేచ్ఛ ఇవ్వండి...** కొన్నిచోట్ల పిల్లలు కనడంపైన ఆంక్షలు పెడితే, ఇంకొన్నిచోట్ల ప్రోత్సాహకాలు చేస్తున్నారు. వీటి ప్రభావం ప్రత్యక్షంగా పడేది మహిళలపైనే. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలుంటే స్థానిక ఎన్నికల్లో పోటీకి అనర్హులని గతంలో కొన్ని రాష్ట్రాలు ప్రకటించాయి. వీటి కోసం కొందరు కాగితం మీద విడాకులు తీసుకున్నారు. దీంతో వివాహ బంధం అనిశ్చితిలోకి వెళ్తుంది. కొందరు పిల్లల్ని దత్తత ఇచ్చారు. అప్పుడూ బాధపడేది తల్లే కాబట్టి పిల్లల్ని ఎప్పుడు కనాలి, ఎంతమందిని కనాలనే నిర్ణయం మహిళలు తాముగా తీసుకునే స్వేచ్ఛ రావాలి. పిల్లల్ని కనాలని చెప్పడం. వద్దనడం.. మహిళల్ని అగౌరవ పరచడమే. పిల్లల్ని కనడమనేది స్విచ్ కాదు ఆన్ ఆఫ్ చేయడానికి కెరియర్, ఆర్థిక, సామాజిక కోణాల్లో ఆలోచించి పిల్లల విషయంలో మహిళలే నిర్ణయానికి వస్తారు.

**భారం మహిళలదేనా? ••**

1970 నాటికి దేశంలో 30 శాతం వాసెక్టమీ ఆపరేషన్లు జరిగేవి. ఇప్పుడవి 0.3 శాతానికి తగ్గాయి. వాసెక్టమీ పదినిమిషాల్లో ముగుస్తుంది. కావాలనుకుంటే వెనక్కి మరల్చవచ్చు. ట్యూబెక్టమీలో కోత, కుట్లు ఉంటాయి. దురదృష్టవశాత్తూ పుట్టిన వాళ్లు చనిపోతే ట్యూబెక్టమీలో వెనక్కి వెళ్లి పిల్లల్ని కనే పరిస్థితి ఉండదు. అప్పుడు మగవాళ్ళు వేరే పెళ్లి చేసుకునేందుకు ఆస్కారం ఉంది. మరోపక్క ఏటా భారత్‌లో 1.6కోట్ల అబార్షన్లు జరుగుతున్నాయి. లెక్కకి అందనివి ఇంకెన్నో. వీటిలో సగం జవాంఛిత గర్భధారణలు కాగా, మగ పిల్లలు కావాలనుకోవడం మరో కారణం.



రెండో త్రైమాసికంలోకి వెళ్తే అబార్షన్లతో ప్రాణహాని ఉంటుంది. అంతేనా... గర్భనిరోధకాలు వాడటం మగవాళ్లకు సంబంధంలేనిదిగా కేవలం పనే అన్నట్టుగా ఉంది. వీటన్నింటివల్ల మహిళల ఆరోగ్యమూ దెబ్బతింటుంది. జేఆర్‌డీ టాటా చెప్పినట్టు "మగ వాళ్లు మారినప్పుడే దేశం మారుతుంది. వాళ్లలో ఎలాంటి మార్పు రావాలంటారా... పిల్లల పెంపకంలో బాధ్యతలు తీసుకోవాలి. ఇంటిపనుల్లో మహిళలకు భాగమవ్వాలి. కుటుంబ నిర్ణయాల్లో మాటకు విలువ ఇవ్వాలి. అప్పుడే జనాభా పెరిగినా, తగ్గినా సమస్యలు తగ్గుతాయి. జనాభా లెక్కల్లో మహిళలకు సంబంధించిన డేటా తక్కువగా వెలుగులోకి వస్తోంది. 2027 జనాభా లెక్కలతోనైనా దీన్లో మార్పు రావాలి. జనాభా లెక్కింపు సమయంలో ఇంటి వివరాలు మగవాళ్లే చెబుతారు. అలా కాకుండా మహిళల్ని అడగాలి. మహిళలు, బాలికలకు సంబంధించి సరైన సమాచారం లేకుంటే పథకాల రూపకల్పనలో పొరపాట్లు జరుగుతాయి. అది ఎన్నటికీ పూడ్చలేని లోటుగా మిగిలిపోతుంది. 2050 నాటికి జనాభాలో 20 శాతం(34కోట్లు) వృద్ధులు ఉంటారని అంచనా. మహిళల ఆయుష్షు ఎక్కువ కాబట్టి వీరి కోణంలోనూ ప్రణాళికలు రచించాలి. కొత్త విషయాలను. నైపుణ్యాల్ని నేర్చుకునేలా అలవాటు చేయాలి. దాని వృద్ధాప్యంలోనూ పనిచేసే సామర్థ్యం వస్తుంది. □

# ఆధారం ఇస్తేనే ఆరోగ్యంగా..



ఎండా, వానా, చలీ.. వంటివాటి నుంచి మనం రక్షణ ఏర్పాటు చేసుకున్నట్లే మొక్కల విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే అవి ఆరోగ్యంగా ఉంటాయి.

- వర్షం, బలమైన గాలుల వల్ల పొడవుగా ఉన్నవీ, కాయలూ, పండ్లతో ఉన్న మొక్కలు రకాలూ ఇట్టే విరిగిపోతుంటాయి. అలాకాకుండా ఉండాలంటే మొక్కలను గ్రిల్‌కో,పెద్ద చెట్టుకో తాడుతో కట్టేయాలి.
- వర్షాకాలంలో కుండీల్లో అదనపు నీరు నిలిచి మొక్కలు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. వీలైతే వాటిని రూఫ్ కిందకో, పెద్ద చెట్టు నీడకో తెచ్చి పెట్టడం మేలు. ఆ అవకాశం లేకపోతే మొదలు చుట్టూ ప్లాస్టిక్ షీట్ కప్పేయండి.
- తరచూ వర్షాల్లో తడవడంవల్ల ఆకులూ, పూలూ వాడిపోవడం, కుళ్లిపోవడం జరగొచ్చు. అలాంటివాటిని ఎప్పటికప్పుడు తీసేయాలి. లేదంటే ఈ సమస్య మిగిలిన భాగాలకూ వ్యాపించొచ్చు. ఇలాంటప్పుడు బేకింగ్ సోడా, కార్న్‌పౌడర్, దాల్చినచెక్క పొడి వంటివి చల్లుకుంటే సరి. తెగుళ్లను నియంత్రించొచ్చు. □

**చెలి చిట్కా** వాష్‌బేసిన్ రంధ్రాల్లో వాసనరాకుండా ఉండటానికి బేకింగ్‌సోడావేసి వేడినీరు పోయండి.

- పూరీపిండి 2 స్పూన్ల బొంబాయిరవ్వ మరో 2 స్పూన్లు మైదా కలిపితే పూరీలు చాలా రుచిగా ఉంటాయి. □

# స్నేహితురాలు ఉండాల్సిందే..

పనిలో బిజీగా ఉన్నా, కుటుంబ బాధ్యతల్లో పడిపోయినా కొంతమంది అమ్మాయిలు మొదట త్యాగం చేసేది స్నేహితులనే కానీ, మనల్ని మనం మలుచుకోవాలన్నా, భావోద్వేగాలను పంచుకోవాలన్న స్నేహానికి మించిన బంధం ఏముంటుంది చెప్పండి. నిజానికి అమ్మాయిల మధ్య ఉండే



స్నేహం ఒకింత ప్రత్యేకమైంది. ఎందుకంటే, మనసువిప్పి మాట్లాడుకోవడానికి ప్రతి ఒక్కరికీ ఓ స్నేహితురాలు ఉండాల్సిందే. యూసిఎల్ఎ పరిశోధన ప్రకారం, మహిళలకు ఒత్తిడి కలిగినప్పుడు.. దాన్ని ఎదుర్కోవడంలో భాగంగా మెదడులో కొన్ని రసాయనాలు విడుదలవుతాయి. వాటిలో ఆక్సిటోసిన్, ఈస్ట్రోజన్ కొన్ని. అవే మనం పిల్లలతో ఆడుకునేలా, ఇతర మహిళలతో స్నేహం చేయడానికి కారణమవుతాయట. దాంతో ఒత్తిడి దూరమై ప్రశాంతంగా ఉండగలుగుతాం. అయితే, ఈ కామింగ్ ఎఫెక్ట్ మగవారిలో ఉండదట. ఎందుకంటే వాళ్లు ఒత్తిడికి గురైనప్పుడు టెస్టోస్టిరాన్ హార్మోన్ ఎక్కువగా ఉత్పత్తయ్యి, ఆక్సిటోసిన్ ప్రభావాన్ని తగ్గిస్తుందట. కాబట్టి, ఒత్తిడి ఎదురైనప్పుడు అబ్బాయిలూ, అమ్మాయిలూ వేరుగా స్పందిస్తారట. అంతేకాదు, స్నేహితులతో ఎక్కువ సమయం గడిపే మహిళల్లో వయసు పైబడ్డాక వేధించే శారీరక బలహీనతలు వచ్చే అవకాశం తగ్గుతుందని హార్వర్డ్ మెడికల్ స్కూల్ పరిశోధనలో తేలింది. అంతేనా, మన భావాలు పంచుకునే స్నేహితులు లేకుంటే, ఒత్తిడి గూడుకట్టుకుపోయి బరువు పెరిగే అవకాశాలు ఉన్నాయట. ఇక, సుమారుతొమ్మిదేళ్లపాటు స్నేహితులతో నాణ్యమైన సమయం గడిపిన వారిలో మరణించే ప్రమాదం 60శాతానికి పైగా తగ్గిపోతుదనీ పరిశోధనలు చెబుతున్నాయి. దీన్నిబట్టి దీర్ఘాయుష్షును అందించే జీవనమంత్రం స్నేహమే అని అర్థమవుతుంది. □


# క్యాలీఫ్లవర్ పకోడీ

**కావలసిన పదార్థాలు :** చిన్నగా తుంచిన క్యాలీఫ్లవర్ పూలు–రెండు కప్పులు, శనగపిండి–కప్పు, ఉప్పు, పసుపు–పావు చెంచా చొప్పున, అల్లం వెల్లుల్లి ముద్ద–అరచెంచా, కొత్తిమీర తరుగు చారెడు,కచ్చాపచ్చాగా నూరిన పచ్చిమిర్చి–చెంచా, నూనె–వేయించేందుకు సరిపడా.

**తయారీ :** ఒక పాత్రలో శనగపిండి,ఉప్పు, పసుపు, అల్లం వెల్లుల్లి ముద్ద, నూరిన పచ్చిమర్చి, కొత్తిమీర తరుగు వేసి కొద్దికొద్దిగా నీళ్ల పోస్తూ కొంచెం గట్టిగా కలుపుకోవాలి. చిన్నగా తుంచిన కాలీఫ్లవర్ పూలను పిండిలో ముంచి తీసి కాగిన నూనెలో దోరగా వేయించుకుంటే సరిపోతుంది. కమ్మటి క్యాలీఫ్లవర్ పకోడీ చిన్నా పెద్దా అందరికీ నచ్చుతాయి. □



# ఓట్స్‌తో మెరిసే చర్మం



**మీది జిడ్డు చర్మమా? మొటిమలూ, మచ్చలూ ఇబ్బంది పెడుతున్నాయా?** అయితే, కీరదోస, ఓట్స్ ఫేస్‌మాస్క్‌ను ప్రయత్నించండి. ముందుగాతొక్క తీసిన కీరదోస ముక్కలను మిక్సీలో వేసి మెత్తని ముద్దగా చేసుకోండి. దానికి రెండు టేబుల్ స్పూన్ల ఓట్స్‌ను కలిపి మరోసారి మిక్సీ పట్టండి. ఆ మిశ్రమానికి ఓ టీస్పూన్ తేనె వేసి కలిపి.. శుభ్రపరచుకున్న ముఖానికి రాయాలి. అరగంట అయ్యాక, గోరువెచ్చని నీటితో ముఖం కడిగేసుకుంటే సరి. కీరదోస చర్మాన్ని చల్లబరిచి వాపును తగ్గిస్తుంది. మచ్చలు మానేలానూ చేస్తుంది. ఓట్స్‌లో అధికంగా ఉండే జింక్.. ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించి, మొటిమలు పెరగకుండా చేస్తుంది. కాబట్టి, తరచూఈమాస్క్‌ను వేసుకుంటే మెరిసే చర్మం మీ సొంతమవుతుంది. □

# పనులు పూర్తవడం లేదా?

ఉద్యోగాల్లో కొన్ని సందర్భాలు డెడ్‌లైన్‌తో ఉంటాయి. మరో పక్క ఇంట్లో పనులూ ఓ పట్టాన తెమలవు. దీంతో తెలియని ఆందోళన.. దేనిపైనా దృష్టిపెట్టలేకుండా చేస్తుంది. అలాకాకూడదంటే..



మల్టీ టాస్కింగ్ చేయడంలో మహిళలు సమర్థులంటారు! కానీ ఆ అలవాటు అన్ని సమయాల్లోనూ మంచిది కాదు. ముఖ్యంగా పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు దీని జోలికి పోవద్దు అంటారు. కెరియర్ నిపుణులు. దేనికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలో గుర్తించగలిగితే దానిమీదే శ్రద్ధపెట్టి త్వరగా పూర్తి చేయొచ్చు. ఇలా పనులన్నింటికీ ఓజాబితా రాసుకుంటే.. మనలో ఆందోళన తగ్గించడానికి ఈ స్పష్టత చాలు. పని పూర్తి చేయాలనే తొందరలో విరామం తీసుకోకుండా పనిచేస్తుంటారు కొందరు. దీనివల్ల అనుకున్న లక్ష్యం చేరకపోగా మరింత ఒత్తిడికి గురవుతుంటారు. ఇలాంటప్పుడు పనిని కాసేపైనా వాయిదా వేయడం మంచిదే. ఆ సమయంలో ఓ మంచి కాఫీ తాగండి. నచ్చిన మరో అంశంపై దృష్టిపెట్టండి లేదా ఓ చిన్న కునుకు తీయండి. ఇవన్నీ మీ కంగారుని తగ్గిస్తాయి. తిరిగి ఉత్సాహంగా పనులు మొదలు పెట్టే శక్తినిస్తాయి. ఒక్కోసారి ఒత్తిడితో కూడుకున్న పనులు రెండుమూడురోజులు కూడా కొనసాగొచ్చు. అలాంటప్పుడు రోజుకి కనీసం గంటైనా ఏదైనా వ్యాయామం చేయండి. అది ఆందోళనని ఎదుర్కొనే శక్తినిస్తుంది. మెదడుని చురుగ్గా మార్చగలిగే బాదం, వాల్‌నట్స్ వంటివి తినండి. మనసుని ప్రశాంతంగా ఉంచే కొన్ని గుమ్మడి గింజల్ని నోట్లో వేసుకోండి. ఇవన్నీ ఒత్తిడిని తట్టుకుంటూ పనిచేయగలిగేఏకాగ్రతనీ పెంచుతాయి. □

# ఈ కాలంలో ఆరోగ్యంగా..

**వాతావరణం మారినప్పుడు..అందులోనూ వర్షాకాలంలో వివిధ వ్యాధుల బారిన పడడం మామూలే. అయితే ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవారిలో ఈ సమస్యలు మరింత అధికం. ఈ క్రమంలో–వానలు కురిసే వేళ దగ్గు, జలుబు, జ్వరాల వంటి సమస్యల బారిన పడకుండా ఈ పానీయం ఉపయోగపడుతుందంటున్నారు నిపుణులు.**

**కావాల్సిన పదార్థాలు :** మరిగించిన నీరు–2 కప్పులు, నిమ్మకాయలు–ఒకటిన్నర, తాజా అల్లం రసం–ఒకటిన్నర టేబుల్ స్పూన్, మామిడి అల్లం–టేబుల్ స్పూన్, తేనె–2 టేబుల్ స్పూన్లు, తేనె–2 టేబుల్ స్పూన్లు, ఉప్పు–చిటికెడు, దాల్చిన చెక్క –(రుచి కోసం).

**తయారీ :** ముందుగా ఒక గిన్నె/టీపాట్ లోకి తేనె, నిమ్మరసం, అల్లం రసం, మామిడి అల్లం, దాల్చిన చెక్క, ఉప్పు తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమానికి మరిగించిన నీటిని జత చేసి తేనెతో పాటు మిక్స్ చేసిన పదార్థాలన్నీ కరిగిపోయే వరకు బాగా కలపాలి. ఆ తర్వాత దీనిపై మూత పెట్టి 5–6 నిమిషాల పాటు పక్కన పెట్టాలి. ఆపై ఒక కప్పులోకి వడకట్టుకుని తాగాలి.



**వేటితో ఏ ప్రయోజనం:** ◆. తేనెలో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థ పనితీరును క్రమంగా మెరుగుపరుస్తాయి.

◆ అల్లంలో పుష్కలంగా ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీరాన్ని డీటాక్సిఫై చేస్తాయి. దీంతో జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గిపోతాయి. జీవక్రియల రేటు కూడా మెరుగుపడుతుంది.



◆ నిమ్మలో సహజంగా ఉండే సి–విటమిన్, పొటాషియం రోగ నిరోధక శక్తి పెరగ డానికి సహకరిస్తాయి. అలాగే శరీరంలోని విష పదార్థాల ప్రభావాన్ని తగ్గిస్తాయి.

◆ ఇక మామిడి అల్లం పోషకాల సమూహం. ఇందులో యాంటీ బ్యాక్టీరియల్,యాంటీ ఫంగల్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కీళ్లనొప్పులు, చర్మంపై దురద, గాయాల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. అదే విధంగా దగ్గు, అజీర్తి సమస్యలను తగ్గిస్తాయి. □

# చెరపకురా చెడేవు

ఆధ్యాత్మికం



ఒక వేటగాడు తన విల్లంబులు, కుక్కలను వెంటబెట్టుకొని అడవికి బయలు దేరాడు. దారిలో అతడికి ఒక బౌద్ధభిక్షువు ఎదురయ్యాడు. "ఈ దరిద్రుడు తారస పడ్డాడు. ఇక నాకు ఈరోజు వేట దొరుకుతుందా" అని మూఢనమ్మకాలను నమ్మే ఆ వేటగాడు అనుకొన్నాడు. ఆరోజు అతడికి నిజంగానే నిరాశ ఎదురైంది. ఎలాంటి జంతువు, పక్షి అతడికి చిక్కలేదు. ఉసూరుమంటూ తిరుగు పయనమయ్యాడు. దారిలో మళ్లీ అతడికి ఆ భిక్షువు కనిపించాడు. కోపంతో ఊగిపోతూ వేటగాడు తన కుక్కలను ఆ భిక్షువు మీదకి ఊసిగొలిపాడు. అవి వెంటపడుతుంటే భిక్షువు భయపడి దగ్గరలో ఉన్న చెట్టు ఎక్కాడు. అక్కడికి చేరిన వేటగాడు అతణ్ణి రాళ్లతో కొట్టడం మొదలుపెట్టాడు. భిక్షువు మరింత పైకి ఎక్కే అతడు కప్పుకున్న వస్త్రం జారి ఆ వేటగాడిపై పడింది. ఆ వేటగాడినే భిక్షువని భ్రమపడిన కుక్కలు అతడి కండలు చీల్చి చంపేశాయి. వేటగాడి మరణానికి భిక్షువు చాలా బాధపడ్డాడు. ఆ తర్వాత బుద్ధుడికి తెలియజెప్పి కన్నీరుపెట్టుకున్నాడు. "ఇందులో నీ తప్పేమీ లేదు. పరులకు ఎలాంటి హానీ తలపెట్టని నీలాంటి వాడిపైకి కుక్కలను వదిలి ఆ వేటగాడు తన అంతం తానే కొనితెచ్చు కొన్నాడు" అని ఊరడించాడు. అనంతరం బుద్ధుడు ఇలా చెప్పాడు. "మనసులో ఎలాంటి కల్మషం లేకుండా పదిమంది మంచి కోరుతూ సన్మార్గంలో పయనించేవాడికి ఎవరైనా అపకారం తలపెడితే, అది తిరిగి వారికే తగులుతుంది. గాలికి ఎదురుగా నిలిచి మట్టిని విరజిమ్మితే ధూళి వారి కంట్లోనే పడుతుంది కదా!" మన పెద్దలు దీన్నే 'చెరపకురా చెడేవు' అని మరొక విధంగా చెబుతారు! □

# పోషకాల 'పుట్ట'

**ఒక్కో సారి** మనసు దిగులుగా ఉంటుంది. భావోద్వేగాలూ పెల్లుబుకుతూ ఉంటాయి. కానీ, ఇలా తరచూ జరుగుతూ ఉంటే మాత్రం మీ డైట్‌లో కొన్నిరోజులు మాష్రూమ్‌ని చేర్చుకుని చూడండి. ఇందులోని పొటాషియం ఆ భావనని పోగొట్టి కొన్ని రోజులు మష్రూమ్‌ని చేర్చుకుని చూడండి. ఇందులోని పొటాషియం ఆ భావనని పోగొట్టి మిమ్మల్ని చురుగ్గా మారుస్తుందని చెబుతోంది పెన్ యూనివర్సిటీ పరిశోధన. ఇది కాదు..గతంలో ఓ అధ్యయనం పుట్టగొడుగుల్లో లభించే ఎర్గోథియోనీన్ అనే యాంటీకానఇసడెంట్‌కి..రొమ్ము క్యాన్సర్ కణాలతో పోరాడి అకాల మృత్యు ముప్పుని తగ్గించే శక్తి ఉందనీ వెల్లడించింది. ఇంతేనా మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ వీటిని తినడం వల్ల అందుకోవచ్చు.



సాధారణంగా వర్షాకాలంలో మష్రూమ్స్ ఎక్కువగా దొరుకుతాయి. ఇవి రుచిలోనూ, పోషకాల్లోనూ నాన్‌వెజ్‌కిపోటీనివ్వ గలుగుతాయి. అందుకే, వీటికి సూపర్‌ఫుడ్ అనే పేరూ ఉంది. అయితే, ప్రపంచ వ్యాప్తంగా పుట్ట గొడుగుల్లో రెండు వేల రకాలు ఉంటే, మన దేశంలో 283 జాతులున్నాయి. వాటిల్లో వైట్ బటన్ మాష్రూమ్, ఆయిస్టర్ మష్రూమ్, చైనీస్ మష్రూమ్, మిల్కీ మష్రూమ్ వంటివాటినే మనం ఎక్కువగా పెంచుతాం. తింటుంటాం. వీటిల్లోని యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో కెమికల్స్..యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్‌గా పనిచేస్తాయి. ఇందులోని పోషకాలు కొలెస్ట్రాల్‌ని తగ్గించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఎముకల్ని దృఢంగా మార్చే డి విటమిన్, ఆహారాన్ని శక్తిగా మార్చి శరీరానికి అందించే బి12 వంటి కీలకమైన పోషకాల్నీ అందిస్తాయి. కండరాల పనితీరుని, వ్యాధినిరోధకశక్తినీ పెంపొందించే ప్రొటీన్ కూడా పుట్ట గొడుగుల నుంచి తగినంతగా అందుతుంది. □

# నేడు బిగ్ ఫైట్

## భారత్‌కు డూ ఆర్ డై మ్యాచ్.. సిరీస్ కైవసం కోసం ఇంగ్లండ్



**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ముగిసే సమయానికి భారత్ ప్రస్తుతం 1-2 తేడాతో వెనుకబడి ఉంది. ఈ నెల 23 నుంచి మాంచెస్టర్ వేదికగా ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో నాలుగో టెస్టు మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ టీమిండియాకు డూ ఆర్ డై మ్యాచ్ కానుంది. ఇందులో గెలిచి సిరీస్‌ను 2-2తో సమం చేయాలని భారత్ భావిస్తోంది. ఈ మ్యాచ్‌లో ఓడినా లేదా డ్రా చేసుకున్నా, సిరీస్‌ను గెలిచే అవకాశం భారత్‌కు ఉండదు. ఈ నాలుగో కీలక టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఒక్క మార్పుతో బరిలోకి దిగుతోంది. టెస్టు కోసం ఇంగ్లాండ్ జట్టు తమ ప్లేయింగ్ 11ను ప్రకటించింది. గాయంతో సిరీస్ నుంచి తప్పుకున్న ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ స్థానంలో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ లియమ్ డాసన్‌కు అవకాశం లభించింది. ఇంగ్లాండ్‌కు ఇది కీలకమైన టెస్టు కావడంతో అనుభవజ్ఞులైన ఆటగాళ్లకు అవకాశం ఇచ్చారు. దీంతో దాదాపు 8 ఏళ్ల తర్వాత డాసన్ టెస్టు జట్టులోకి వచ్చాడు. షోయబ్ బషీర్ గాయంతో దూరం కావడంతో డాసన్‌కు ఇంగ్లాండ్ జట్టు నుంచి పిలుపు వచ్చింది. లార్డ్స్ టెస్టు మూడో రోజు షోయబ్ బషీర్‌కు గాయం అయింది. రవీంద్ర జడేజా కొట్టిన హిట్టింగ్ డ్రైవ్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నించిన సమయంలో అతని ఎడమ చేయి చిటికన వేలికి గాయం అయింది. భారత జట్టు విషయానికి వస్తే పేస్ బౌలింగ్ విభాగంలో గాయాల వల్ల సవాళ్లను ఎదుర్కొంటోంది. ఆకాష్ దీప్ ఇంకా గాయాల నుంచి కోలుకోలేదు. అర్షదీప్ సింగ్ చేతి గాయంతో టెస్టు మ్యాచ్‌కు దూరమయ్యాడు. అతను చివరి మ్యాచ్ కు కూడా అందుబాటులో ఉండే అవకాశం లేదని సమాచారం. జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, శార్దూల్ ఠాకూర్, ప్రసిద్ధ్ కృష్ణ, అన్షుల్ కంబోజ్ మాత్రమే ప్రస్తుతం భారత పేస్ బౌలింగ్ విభాగంలో ఫిట్ గా ఉన్నారు. 24 ఏళ్ల అన్షుల్ కంబోజ్‌ను రిజర్వ్‌గా జట్టులోకి తీసుకున్నారు. అతని లైన్‌లెంగ్త్ బౌలింగ్, క్రమశిక్షణ గౌతమ్ గంభీర్, అజిత్ అగార్కర్ సహా కోచింగ్ సిబ్బందిని మెప్పించడంతో జట్టులోకి వచ్చాడు. ఇక భారత వికెట్ కీపర్ రిషబ్ పంత్ కు గత మ్యాచ్ లో చేతికి గాయం అయింది. భారత ఇన్నింగ్స్ సమయంలో పంత్ బ్యాటింగ్ చేయడానికి వచ్చారు. ప్రస్తుతం గాయం తగ్గడంతో తిరిగి కీపింగ్ బాధ్యతలు చేపట్టనున్నాడు. ప్రాక్టీస్ సెషన్‌లో స్వల్పంగా అసౌకర్యంగా ఉన్నా, అతను కీపింగ్ చేస్తూ కనిపించాడు. ఇది భారత జట్టుకు పెద్ద బలంగా మారనుంది. అయితే ఆకాష్ దీప్ గాయం మరోసారి తీవ్రతరం కావడంతో అతను ఆడటం కష్టమేనని సమాచారం.

## వరల్డ్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్ తొలి రౌండ్‌లో మహిళా ప్లేయర్స్ విక్టరీ

**న్యూఢిల్లీ:** ప్రపంచ జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్-2025 ప్రారంభ రోజున భారతీయులు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఆరుగురు భారత మహిళా క్రీడాకారిణులలో ఐదుగురు తమ తొలి రౌండ్ మ్యాచ్‌లను గెలిచారు. ఈజిప్టులోని కైరోలో జరిగిన వ్యక్తిగత స్క్వాష్‌లో భారత స్క్వాష్ క్రీడాకారులు విజయాలతో ఆరంభించారు. అండర్ 19 ఆసియా బాలికల స్క్వాష్ ఛాంపియన్ అనాహత్ సింగ్ మొదటి రౌండ్‌లో బై పొందగా, అండర్ 17 ఆసియా జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత అనికా దుబే పోలాండ్‌కు చెందిన తోలా ఒట్రాసెక్‌ను 3-1 (9-11, 11-7, 11-9, 11-3) తేడాతో ఓడించింది. రుద్ర సింగ్, నవ్య సుందరరాజన్, మరియు ఆరాధ్య పోర్వాల్ తమ ప్రత్యర్థులపై ఏకపక్ష విజయాలు సాధించారు. రుద్ర దక్షిణాఫ్రికాకు చెందిన చాంటే లెప్పన్‌ను 3-0 (11-6, 11-3, 11-3) తేడాతో ఓడించగా, నవ్య దక్షిణాఫ్రికాకు చెందిన డెనే వాన్ జైల్‌ను 3-0 (11-5, 11-8, 11-3) తేడాతో ఓడించింది. ఆరాధ్య పోర్వాల్ దక్షిణాఫ్రికాకు చెందిన మకైలా నాయుడును 3-0 (11-3, 11-3, 11-4) తేడాతో ఓడించింది. మరో వైపు ఉన్నతి త్రిపాఠి ఏకైక భారతీయురాలు, పోలాండ్‌కు చెందిన నటాలియా మియర్జె జ్యూస్కా చేతిలో 0-3 (11-13, 8-11, 9-11) తేడాతో ఓడిపోయింది. కాగా పురుషులలో అరిహంత్ కెఎస్, శివన్ అగర్వాల్ వారివారి మొదటిరౌండ్ మ్యాచ్‌లను గెలిచారు. అరిహంత్ జర్మనీకిచెందిన రూఫస్ గెబార్ట్‌ను 3-0 (11-2, 11-4, 11-5) తేడాతో ఓడించగా, శివన్ ఐర్లాండ్‌కు చెందిన ఫ్రాంక్ ఓ ఫ్లిన్‌ను 3-0 (11-3, 11-3, 11-8) తేడాతో ఓడించాడు. అయితే, కరణ్ యాదవ్ ఈజిప్ట్‌కు చెందిన ఇయాద్ దౌద్ చేతిలో 3-0 (3-11, 4-11, 5-11) తేడాతో ఓడిపోయి టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాడు.




## వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో.. నిరాశతో ముగిసిన భారత్ ప్రచారం
### పరుగులో గురిందర్‌వీర్, మణికంఠ ఓటమి

**న్యూఢిల్లీ:** వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్-2025లో స్ప్రింటర్లు మణికంఠ, గురిందర్‌వీర్ ఆకట్టుకోలేకపోయారు. పురుషుల 100 మీటర్ల పరుగులో మణికంఠ హోబ్లిధర్ మరియు గురిందర్‌వీర్ సింగ్ సెమీస్‌కు చేరుకోలేకపోయారు. వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్ 2025లో పురుషుల 100 మీటర్ల ఈవెంట్‌లో భారతదేశం యొక్క ప్రచారం నిరాశతో ముగిసింది, దేశంలోని ప్రముఖ స్ప్రింటర్లలో ఇద్దరు గురిందర్‌వీర్ సింగ్, మణికంఠ హోబ్లిదార్ ఇద్దరూ సెమీఫైనల్స్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యారు. హీట్ 7లో, గురిందర్‌వీర్ సింగ్ నిరాశపరిచే 11.00 సెకన్లు పూర్తి చేసి, నాల్గవ స్థానంలో నిలిచాడు మరియు ఆటోమేటిక్ అర్హత స్థానాలకు వెలుపల ఉన్నాడు. ఈ సంవత్సరం ప్రారంభంలో ఇండియన్ గ్రాండ్ ప్రిక్స్‌లో 10.20 సెకన్లు పూర్తి చేసి వార్తల్లో నిలిచిన ఈ పంజాబ్ స్ప్రింటర్, ప్రారంభం నుంచే లయ తప్పి ఎప్పుడూ తన గరిష్ట వేగాన్ని అందుకోలేకపోయాడు. ఇటీవలి సంవత్సరాలలో భారతదేశపు అగ్రశ్రేణి స్ప్రింటర్లలో స్థిరంగా స్థానం సంపాదించిన 100 మీటర్ల స్పెషలిస్ట్ ఫామ్‌లో ఇది ఆశ్చర్యకరమైన క్షీణత. అతను రౌండ్ 1 లో పాల్గొన్న వారిలో మొత్తం 40వ స్థానంలో నిలిచాడు. ఇంతలో, 10.23 సెకన్ల మార్కుతో మాజీ జాతీయ రికార్డు హోల్డర్ అయిన మణికంఠ హోబ్లిదార్, హీట్ 8లో మరింత పోటీతత్వంతో కూడినా కాని నిరాశపరిచే పరుగును అందించాడు, 10.74 సెకన్ల సమయంతో మూడవ స్థానంలో నిలిచాడు. ప్రతి హీట్‌లో మొదటి ఇద్దరు ఫినిషర్లు, మొత్తం మీద అత్యంత వేగంగా చేరే తదుపరి ఎనిమిది మందితో పాటు, సెమీఫైనల్‌కు చేరుకుంటాయి. అయితే మణికంఠ సమయం వేగంగా కటాఫ్‌ను చేరుకోలేక పోవడంతో పోటీ నుండి నిష్క్రమించాడు. అతను ఫీల్డ్‌లో మొత్తం 26వ స్థానంలో నిలిచాడు.



## వాషింగ్టన్ డబుల్స్ ఓపెనర్‌లో.. వీనస్ విలియమ్స్ విజయం



**న్యూఢిల్లీ:** ఏడుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ వీనస్ విలియమ్స్ 16 నెలల్లో తన తొలి ప్రొఫెషనల్ టెన్నిస్ మ్యాచ్‌లో విజయం సాధించింది. హైలీ బాప్టిస్ట్‌తో కలిసి దీది ఓపెన్ మొదటి రౌండ్‌లో తోటి డబుల్స్ వైల్డ్ కార్డ్‌లు యూజీని బౌచర్డ్ మరియు క్లెర్వీ న్గౌనౌలను ఓడించింది. 3-1 తేడాతో వెనుకబడి, బ్రేక్ పాయింట్‌ను ఎదుర్కొన్న వీనస్ మరియు బాప్టిస్ట్ గత 12 ఆటలలో 11 ఆటలను గెలుచుకుని పుంజుకున్నారు. 2022లో మొదటి రౌండ్‌లో ఓటమి తర్వాత, వీనస్ దీది ఈవెంట్‌లో ఇది రెండవసారి. టోర్నమెంట్ కోసం వైల్డ్‌కార్డ్‌ను అంగీకరించిన 45 ఏళ్ల మాజీ ప్రపంచ నంబర్ వన్, మార్చి 2024లో మయామి ఓపెన్ తర్వాత పోటీ పడలేదు. చివరిగా ఆగస్టు 2023లో సిన్సినాటి ఓపెన్‌లో గెలిచింది. కాగా విలియమ్స్ సోదరీమణులు చాలా సంవత్సరాలుగా క్రీడలో ఆధిపత్యం చెలాయించడంతో, ర్యాంకింగ్ లేని వీనస్, మహిళల డబుల్స్‌లో సెరెనాతో కలిసి 14 ప్రధాన టైటిళ్లను గెలుచుకుంది. కాగా సింగిల్స్ పోటీలోని మొదటి రౌండ్‌లో ఆమె మరో అమెరికన్ పేటన్ స్టెర్న్స్‌తో తలపడనుంది. ఇక వాషింగ్టన్‌లో జరుగుతున్న పురుషుల సింగిల్స్‌లో బ్రిటన్‌కు చెందిన డాన్ ఎవాన్స్ మరియు కామెరాన్ నోరీ రెండో రౌండ్‌కు చేరుకున్నారు. 2023లో వాషింగ్టన్ టైటిల్ గెలుచుకున్న ఎవాన్స్, జిజౌ బెర్గ్స్‌పై 36, 64, 63 తేడాతో కఠినమైన విజయాన్ని సాధించాడు. 35 ఏళ్ల వైల్డ్ కార్డ్ తదుపరి 13వ సీడ్ అమెరికన్ అలెక్స్ మైఖేల్‌సెన్‌తో తలపడనుంది. అలాగే నోరీ బ్రిటిష్ క్వాలిఫైయర్ బిల్లీ హారిస్‌ను 63 76 (74) తేడాతో ఓడించాడు మరియు రెండవ రౌండ్‌లో ఫ్రెంచ్ ఓపెన్ సెమీ ఫైనలిస్ట్ మరియు ఇటలీకి చెందిన రెండవ సీడ్ లోరెంజో ముసెట్టిని ఎదుర్కొంటాడు.

## చైనా ఓపెన్‌లో వటనాబేను ఓడించిన ప్రణయ్



**న్యూఢిల్లీ:** చైనా ఓపెన్ 2025, ఓపెనర్‌లో వటనాబేను హెచ్‌ఎస్ ప్రణయ్ ఓడించాడు. ప్రపంచ 18వ ర్యాంక్‌లో ఉన్న ఆటగాడిని ఓడించడానికి 5 మ్యాచ్ పాయింట్లను ప్రణయ్ ఆదా చేశాడు. మంగళవారం జరిగిన చైనా ఓపెన్ తొలి రౌండ్‌లో భారత అనుభవజ్ఞుడు ప్రణయ్ అద్భుతమైన పునరాగమనం చేశాడు. ప్రపంచ 35వ ర్యాంకర్ ప్రణయ్, ఆ సంవత్సరం జరిగిన చివరి సూపర్ 1000 టోర్నమెంట్‌లో 57 నిమిషాల థ్రిల్లర్‌లో ప్రపంచ 18వ ర్యాంకర్ కోకి వటనాబేను 8-21, 21-16, 23-21 తేడాతో ఓడించాడు. ఈ సారి ప్రణయ్ తన ప్రచారాన్ని అస్థిరంగా ప్రారంభించాడు, దీంతో మొదటి గేమ్‌ను 8-21 తేడాతో కోల్పోయాడు. అయితే, అతను తిరిగి పుంజుకుని రెండవ గేమ్‌ను 21-16 తేడాతో కైవసం చేసుకున్నాడు. చివరి సెట్ అత్యంత నాటకీయంగా మారింది. ఒక దశలో 2-11 తేడాతో వెనుకబడిన ప్రణయ్, 5 మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని గేమ్‌ను కైవసం చేసుకుని 23-21 ఆధిక్యంతో మ్యాచ్‌ను ముగించాడు. కాగా ప్రపంచ ఛాంపియన్‌షిప్ దగ్గర పడుతున్న తరుణంలో, ప్రణయ్ తన కాంస్య పతక విజేత ప్రదర్శన కోసం ఎదురు చూస్తున్నాడు. డెన్మార్క్‌లో జరిగిన మునుపటి ఎడిషన్‌లో ప్రపంచ నంబర్ 1 విక్టర్ అక్సెల్సెన్‌ను ఓడించి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. ఇక భారత్ మరో ప్లేయర్ లక్ష్యయ్ సేన్ మరోసారి మొదటి రౌండ్ నుండి నిష్క్రమించాడు, ఐదవ సీడ్ లీ షిఫెంగ్ చేతిలో 21-14, 22-24, 11-21 తేడాతో గంటలో ఓడిపోయాడు.

# వాణిజ్యం

## అనిల్ అంబానీని 'ఫ్రాడ్'గా వర్గీకరణ

**న్యూఢిల్లీ, జూలై 22:** భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్ కామ్), దాని ప్రమోటర్ డైరెక్టర్ అనిల్ డి. అంబానీలను అధికారికంగా 'ఫ్రాడ్'గా వర్గీకరించినట్టు పార్లమెంట్ తెలిపింది. ఈ నేపథ్యంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కు ఫిర్యాదు చేసే ప్రక్రియలో బ్యాంక్ ఉన్నట్టు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు రాత పూర్వక సమాధానంలో తెలిపారు. భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నిర్దేశించిన మోసం రిస్క్ మేనేజ్‌మెంట్ మాస్టర్ డైరెక్షన్స్, ఎస్‌బీఐ బోర్డు ఆమోదించిన పాలసీకి అనుగుణంగా జూన్ 13 న ఈ వర్గీకరణ జరిగినట్టు మంత్రి చౌదరి వివరించారు. ఈ వర్గీకరణను బ్యాంక్ జూన్ 24న ఆర్బీఐకి నివేదించింది. ఎస్‌బీఐకి ఆర్‌కామ్ పెద్ద మొత్తంలో బకాయి పడింది. ఇందులో రూ.2,227.64 కోట్ల ఫండ్ బేస్డ్ ప్రిన్సిపల్ బకాయి (ఆగస్టు 26, 2016 నుంచి వడ్డీ, ఇతర ఖర్చులు సహా), రూ.786.52 కోట్ల నాన్ ఫండ్ బేస్డ్ బ్యాంక్ గ్యారెంటీ ఉన్నట్టు మంత్రి తెలిపారు. ఆర్‌కామ్ మొత్తం రుణం మార్చి 2025 నాటికి రూ. 40,400 కోట్లుగా ఉన్నట్టు నివేదించింది. చట్టపరమైన చిక్కులు ఆర్‌కామ్ ప్రస్తుతం 2016 నాటి ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఐబీసీ) కింద కార్పొరేట్ ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రక్రియలో ఉంది. కమిటీ ఆఫ్ క్రెడిటర్స్ రిజల్యూషన్ ప్లాన్‌ను ఆమోదించి, మార్చి 6, 2020న ముంబైలోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) వద్ద దాఖలు చేసినప్పటికీ, దాని ఆమోదం ఇంకా పెండింగ్‌లో ఉంది. ఈ పరిణామాలకు తోడు ఎస్‌బీఐ అనిల్ డి. అంబానీపై వ్యక్తిగత ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రక్రియను కూడా ప్రారంభించింది. ఇది ప్రస్తుతం ఎన్‌సీఎల్‌టీ ముంబై వద్ద విచారణలో ఉంది. గతంలో కూడా ఈ మోసం వర్గీకరణకు సంబంధించిన వివాదం తలెత్తింది. నవంబర్ 10, 2020న ఎస్‌బీఐ ఈ ఖాతాను, అనిల్ డి. అంబానీని మోసంగా వర్గీకరించి, జనవరి 5, 2021న సీబీఐకి ఫిర్యాదు చేసింది. అయితే, జనవరి 6, 2021న ఢిల్లీ హైకోర్టు స్టేటస్ కో ఇచ్చింది. అనంతరం, సుప్రీం కోర్టు మార్చి 27, 2023న ఇచ్చిన తీర్పు (స్టేట్ బ్యాంక్‌ఆఫ్ ఇండియా.. ఇతరులువర్సెస్ రాజేష్ అగర్వాల్.. ఇతరులు కేసు) ప్రకారం, రుణగ్రహీతలకు మోసం వర్గీకరణకు ముందు తమ సమర్థనను వినిపించుకునే అవకాశం ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ తీర్పు నేపథ్యంలో, సెప్టెంబర్ 2, 2023న బ్యాంక్ గత మోసం వర్గీకరణను రద్దు చేసింది. అయితే, జులై 15, 2024న ఆర్బీఐ జారీ చేసిన కొత్త సర్క్యులర్ ప్రకారం తిరిగి ప్రక్రియ నిర్వహించి, ఖాతాను మళ్లీ మోసంగా వర్గీకరించింది.



## ఆల్‌టైమ్ గరిష్టానికి ఎటెర్నల్ షేర్లు

**ముంబై, జూలై 22:** జొమాటో, బ్లింకిట్ పేరిట వ్యాపారాలు నిర్వహిస్తున్న ఎటెర్నల్ షేర్లు కొత్త మైలు రాయిని అందుకున్నాయి. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో మంగళవారం కంపెనీ షేర్లు రూ.311 వద్ద ఆల్‌టైమ్ గరిష్టాన్ని తాకాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.3 లక్షల కోట్లు దాటింది. నిఫ్టీ 50లో ప్రముఖ కంపెనీలైన విప్రో, టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, నెస్లే ఇండియా వంటి కంపెనీలను అధిగమించింది. మార్కెట్ ముగిసే సమయానికి ఎన్‌ఎస్‌ఇలో ఎటెర్నల్ షేర్లు 10 శాతం లాభంతో రూ.299.75 వద్ద ముగిశాయి. త్రైమాసిక ఫలితాల్లో ఎటెర్నల్ లాభాల్లో 90 శాతం క్షీణత నమోదైంది. కేవలం రూ.25 కోట్ల నికర లాభాన్ని మాత్రమే నమోదు చేసింది. అదే సమయంలో ఆదాయంలో మాత్రం 70 శాతం వృద్ధి నమోదు చేసింది. గతేడాది రూ.4,206 కోట్లుగా ఉన్న ఆదాయం రూ.7,167 కోట్లకు పెరిగింది. దీనికితోడు క్విక్ కామర్స్ విభాగమైన బ్లింకిట్ రాణించడంతో ఎటెర్నల్‌కు కలిసొచ్చింది. జొమాటో నెట్ ఆర్డర్ వాల్యూను (వివీజు) తొలిసారి బ్లింకిట్ దాటేసింది. గతేడాదితో పోలిస్తే గ్రాస్‌ఆర్డర్ వాల్యూలో 140 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది ఇన్వెస్టర్లను మెప్పించింది. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో పలు బ్రోకరేజీ సంస్థలు కూడా ఎటెర్నల్‌కు బై రేటింగ్ ఇచ్చాయి. నొమురా ఎటెర్నల్ టార్గెట్ ప్రైస్‌ను రూ.280 నుంచి రూ.300కు పెంచగా, నువామా ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ తన టార్గెట్ ప్రైస్‌ను రూ.290 నుంచి రూ.320కి సవరించింది. జెఫ్రీస్ అయితే ఏకంగా ఎటెర్నల్ టార్గెట్ ప్రైస్‌ను రూ.250 నుంచి రూ.400కు పెంచడం గమనార్హం. ఈ కారణంగా ఎటర్నెల్ షేర్లు దూసుకెళ్లాయి. గత 12 నెలల్లో ఎటెర్నల్ షేర్లు 33 శాతం రాణించగా, 2025లో 7 శాతం మేర పెరిగాయి. మరోవైపు ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ విభాగంలో ఉన్న స్విగ్గీ షేర్లు కూడా రాణించాయి. ఎటెర్నెల్ ఎఫెక్ట్‌తో 5 శాతానికి పైగా లాభంతో రూ.418 వద్ద ముగిశాయి.



## పేటిఎం నికర లాభం రూ.122.5 కోట్లు

**ముంబై, జూలై 22:** ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఫలితాలను మంగళవారం పేటిఎం పేరెంట్ సంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ విడుదల చేసింది. 2025-06 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో నికర లాభం రూ.122.5 కోట్లుగా ప్రకటించింది. ఈ యేడాది ఈ సంస్థ భారీగా లాభాల్లోకి దూసుకెళ్లింది. గత త్రైమాసికంలో నివేదించబడిన రూ.540కోట్ల నికర నష్టంతో పోలిస్తే ఈ యేడాది భారీగా పెరిగింది. కార్య కలాపాల ద్వారా కంపెనీ ఆదాయం రూ.1,918 కోట్లుగా ఉంది.



## ఎంఅండ్‌ఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ లాభం 3.2% వృద్ధి

**ముంబై, జూలై 22:** మహీంద్రా అండ్‌మహీంద్రా (ఎంఅండ్‌ఎం) ఫైనాన్షియల్ సర్వీసెస్ 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసిక ఫలితాలను మంగళవారం విడుదల చేసింది. స్టాండ్ ఎలోన్ నికర లాభం రూ.3.2శాతం పెరిగి రూ.530 కోట్లకు చేరుకుంది. గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.513 కోట్లుగా ఉంది. ముంబై ప్రధాన కార్యాలయం కలిగిన గ్రామీణ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బిఎఫ్‌సి) మొత్తం ఆదాయం 18శాతం పెరిగి రూ.4,438 కోట్లకు చేరుకుంది. ఇది గత సంవత్సరం ఇదే కాలంలో రూ.3,760 కోట్లుగా ఉంది. దేశవ్యాప్తంగా 1000 కంటే ఎక్కువ కార్యాలయాలతో భారతదేశంలోని అగ్ర ట్రాక్టర్ ఫైనాన్సర్లలో ఇది ఒకటి.

## ఆరంభంలో లాభాలు..చివరికి ఫ్లాట్‌గా సూచీలు

**ముంబై, జూలై 22:** తొలి త్రైమాసిక ఫలితాల జోష్‌తో ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు, చివరికి ఫ్లాట్‌గా ముగిశాయి. ఎటెర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. అయితే, అమెరికాతో ట్రేడ్ డీల్‌పై ఇంకా స్పష్టత రాకపోవడం, ట్రంప్ నిర్దేశించిన గడువు ఆగస్టు 1 దగ్గర పడుతుం డడంతో మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీంతో సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82,527.43 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,200.34) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82,110.63 82,538.17 మధ్య కదలాడిన సూచీ.. చివరికి 13.53 పాయింట్ల నష్టంతో 82,186.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 29.80 పాయింట్ల నష్టంతో 25,060 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.36గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, టైటాన్, బీఈఎల్, మారుతీ సుజుకీ, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, ఎస్‌బీఐ, రిలయన్స్, ఎల్‌అండ్‌టీ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 68.49 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3,396 డాలర్ల వద్ద కొనసాగింది.




## గూగుల్ 11వేల యూట్యూబ్ ఛానళ్లపై వేటు

**ముంబై, జూలై 22:** వివిధ దేశాలకు సంబంధించి అసత్య ప్రచారాలను వ్యాప్తి చేస్తున్నాయని ఆరోపిస్తూ గూగుల్ దాదాపు 11వేల యూట్యూబ్ ఛానళ్లను తొలగించింది. వీటిలో చైనా, రష్యాకు చెందిన ఛానళ్లు టాప్ లిస్టులో ఉన్నట్లు వెల్లడించింది. తొలగించిన వాటిలో కేవలం చైనాకు సంబంధించినవే 7,700 యూట్యూబ్ ఛానళ్లు ఉన్నట్లు తెలిపింది. అవి భారత్‌లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా పార్టీకి సంబంధించి ప్రచారాలు చేస్తున్నాయని.. ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ప్రశంసిస్తూ పలు కంటెంట్‌లను పోస్టు చేస్తున్నాయని ఆరోపించింది. రష్యాకు చెందిన 2,000లకు పైగా యూట్యూబ్ ఛానళ్లు, ఇతర వెబ్‌సైట్లను తొలగించినట్లు గూగుల్ వెల్లడించింది. ఈ ఖాతాల్లో ఉక్రెయిన్, నాటోలను విమర్శిస్తూ.. రష్యాకు మద్దతిచ్చేలా సందేశాలను వ్యాప్తి చేస్తున్నట్లు గుర్తించామని పేర్కొంది. రష్యాలోని పలు సంస్థలకు కూడా ఈ ఛానళ్లతో సంబంధాలు ఉన్నట్లు తెలిపింది. ఇటీవల గూగుల్ 20 యూట్యూబ్ ఛానెల్‌లు, నాలుగు ఖాతాలు, రష్యా ప్రభుత్వ నియంత్రణలో ఉన్న మీడియా సంస్థకు సంబంధించిన ఓ బ్లాగును తొలగించినట్లు వివరించింది. చైనా, రష్యాలతో పాటు ఇరాన్, తుర్కియే, ఇజ్రాయెల్, రొమేనియా, అజర్‌బైజాన్, ఘనాకు చెందిన యూట్యూబ్ ఛానళ్లను కూడా తొలగించినట్లు గూగుల్ తెలిపింది. ఆయా దేశాలకు చెందిన యూట్యూబ్ ఛానళ్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే.. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా అసత్య వార్తలు ప్రసారం చేస్తున్నందువల్ల వాటిని నిలువరించడానికే ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. 2025 మొదటి త్రైమాసికంలో గూగుల్ 23,000లకు పైగా ఖాతాలను తొలగించింది. మెటా సైతం ఇటీవల దాదాపు 10 మిలియన్ల నకిలీ ప్రొఫైల్‌లను తొలగిస్తున్నట్లు ప్రకటించింది.




## కాల్గేట్-పామోలివ్ లాభం రూ.363.98 కోట్లు

**ముంబై, జూలై 22:** ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో కాల్గేట్-పామోలివ్ లిమిటెడ్ నికర లాభం రూ.363.98 కోట్లకుచేరుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో కార్యకలాపాల ద్వారా కంపెనీ ఆదాయం కూడా 4.4శాతం తగ్గి రూ.1,420.64 కోట్లకు చేరుకుంది. వేగంగా కదిలే వినియోగ వస్తువుల మేజర్ యొక్క కార్యాచరణ లాభం రిపోర్టింగ్ త్రైమాసికంలో రూ.431.95 కోట్లు, ఇది గత సంవత్సరం రూ.489.25 కోట్ల కంటే తక్కువ. 'పట్టణ డిమాండ్ తగ్గడం, పెరిగిన పోటీ తీవ్రత కారణంగా కఠినమైన ఆపరేటింగ్ పరిస్థితుల నుంచి నిరంతర ఎదురుదెబ్బలను మా తొలి త్రైమాసిక ఫలితాలను ప్రతిబింబిస్తాయి. ప్రస్తుత త్రైమాసిక పనితీరు మునుపటి సంవత్సరం కంటే అధిక బేస్ సైకిల్ ద్వారా కూడా ప్రభావితమవుతుంది' అని మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రభా నరసింహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత సవాళ్లను అధిగమించాలని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ భాగంలో క్రమంగా కోలుకోవాలని ఆశిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.